# భారతీయ నాగరికతా విస్తరణము


గ్రంథకర్త

మారేమండ రామారావు ఎమ్.ఏ., పిహెచ్.డి., బి.ఇడి.,

చరిత్రోపన్యాసకులు - హిందూకళాశాల, గుంటూరు.



ప్రకాశకులు

వేంకటరామ అండ్ కో.,

సికింద్రాబాదు - వరంగల్లు



సర్వస్వామ్య సంకలితము]



1947 [వెల రు. 12

# భారతీయ
# నాగరికతా విస్తరణము

శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయము
విభాగము ............
విభాగ సంఖ్య ............

గ్రంథకర్త
మారేమండ రామారావు ఎమ్.ఏ., పిహెచ్. డి., బి.ఇడి.,
చరిత్రోపన్యాసకులు—హిందూకళాశాల, గుంటూరు.

ప్రకాశకులు:
**వేంకట్రామ అండ్ కో.,**
సికింద్రాబాదు - వరంగల్లు.

సర్వస్వామ్య సంకలితము] 1947 [వెల రు. 0-12-0

ములును, పరిశోధక పత్రికలలోని పెక్కుపండితుల వ్యాసములును, ప్రాగ్భారతదేశముల అర్షశాఖానివేదికలు నీగ్రంథరచనమున నాకు మిక్కిలి తోడ్పడినవి.

నావ్యాసములను తమ పత్రికలలో ప్రకటించిన పత్త్రికాధిపతులకు నేను కృతజ్ఞుడను. ఈగ్రంథమునకు ముద్రణాభాగ్యము గలుగ జేసిన వేంకటరామ అండ్ కో. యజమానులగు మ. రా. శ్రీ. ఈదర వెంకటరావుపంతులుగారికి నావందనములు.

ఈగ్రంథ మాంధ్రలోకముయొక్క యాదరమును బడయుగాక.

గుంటూరు,
14-6-47.

గ్రంథకర్త.

# వి ష య సూ చి క.


| | | |
|---|---|---|
| 1. | ఆవర్తములు | 1 - 6 |
| 2. | నాగరికతావిస్తృతి | 7 - 14 |
| 3. | అఫ్గనిస్థానము | 15 - 23 |
| 4. | మధ్యఆసియా | 24 - 30 |
| 5. | చైనాదేశము | 31 - 39 |
| 6. | చంపారాజ్యము | 40 - 47 |
| 7. | కాంభోజరాజ్యము | 48 - 53 |
| 8. | దక్షిణహిందూదేశము— | |
| | ప్రాగ్భారతదేశములు | 54 - 59 |
| 9. | ఆంధ్రదేశము—ప్రాగ్భారతదేశములు | 60 - 64 |
| 10. | సుమాత్రాద్వీపము | 65 - 70 |
| 11. | యవద్వీపము | 71 - 81 |
| 12. | యవద్వీపకళ | 82 - 89 |

# పీఠిక.

భారతదేశ చరిత్ర పరిశోధకుల కిటీవల లభించిన చారిత్రకసామగ్రి యమూల్యమైనది. దానినుండి ప్రాచీనభారతీయుల గౌరవాధిక్యతలను సూచించు రెండు నూతనాంశములు బయల్వెడలినవి. అందు మొదటిది సింధుప్రాంత నాగరీకత. రెండవది దేశాంతరములయందలి భారతీయ నాగరీకత. ఈ రెండంశములునుగూడ ప్రపంచమంతటను విద్వల్లోకము యొక్క దృష్టి నాకర్షించినవి. ఈయంశములనుగూర్చి పలువురు పండితులు జేయుచున్న పరిశోధనల మూలముననను, వారికి తట్టుచున్నసిద్ధాంతముల మూలమున నీ నూతనాంశముల ప్రాముఖ్యము దినదినము నభివృద్ధి నందుచున్నది.

సింధుప్రాంత నాగరీకతవలన భారతదేశ నాగరికతయొక్క ప్రాచీనత యినుమడించి, యంతర్జాతీయ చరిత్రమున భారతదేశమునకు గల గౌరవము హెచ్చినది. ఇతరదేశములలో దొరకిన భారతీయ నాగరికతా చిహ్నముల మూలమున భారతదేశ చరిత్ర పరిణామమునం దజ్ఞాతపూర్వమగు నొక నూతనపథము బయల్వెడలినది. అందునను భారతీయ నాగరికతా విస్తరణచరిత్రము నేటి సంక్షుభితసమయమున భారతీయులకు నూతనోత్సాహము నొసంగదగియున్నది. నేడు పాశ్చాత్యదేశీయులు నాగరికతా ప్రచారకులమనియు, పెక్కువలసరాజ్యములతో నలరారు సామ్రాజ్యముల కధినేతలమనియు సగర్వముగ విజృంభించుచున్నారు. ప్రపంచమునం

దలి యితరజాతులవలెనే భారతీయులనుగూడ తమ సంస్కృతిని బోధించి సంతరింపజేయు చుంటిమని వారు తలంచుచున్నారు. కాని భారతీయ నాగరికతా విస్తరణ చరిత్ర మీయభిప్రాయములయందలి యసత్యతను వ్యక్తము చేయుచున్నవి. నేటిప్రపంచమున ప్రబలులుగనున్న పాశ్చాత్య జాతులవా రనామధేయులుగను, అనాగరికులుగను ఉండినకాలమున, భారతదేశము నాటి ప్రాచ్యపాశ్చాత్య ప్రపంచమునకంతటికి నధినేతయై, వివిధదేశములలో విజ్ఞాన బీజములను వెదజల్లి విశ్వమానవ కల్యాణమును చేకూర్చెను. పసుబలముచే జయింపబడి, నిర్మింపబడిన నేటిసామ్రాజ్యములకును, నాడు భారతీయులు నిర్మించిన సుస్థిరమగు నాధ్యాత్మిక సామ్రాజ్యమునకును పోలికయేలేదు.

భారతదేశ చరిత్రమున కింత ముఖ్యమగు నంశమైనను, దీనిని గూర్చి యాంధ్రభాషలో నొక గ్రంథమైనను వెలువడియుండలేదు. 19[illegible] సంవత్సరమున "భారతీయ నాగరికతా విస్తరణము" అను శీర్షికతో నేను త్రిలింగ, రైతు, గోల్కొండ పత్రికలలో గొన్ని వ్యాసములను ప్రకటించియుంటిని అటుపై మరికొంత సామగ్రిని సమకూర్చుకొని యీగ్రంథము తయారుచేసితిని. పిమ్మట నొక ప్రసిద్ధులగు గ్రంథప్రకాశకులు దీనిని ప్రకటింతుమని వాగ్దానముచేసి, తమవద్ద మాతృకను రెండేండ్లకాలము నిల్పియుంచుకొనిరి. తుదకు మాతృకనుగూర్చి "అస్తి నాస్తి విచికిత్స" గూడ గలిగినది. ఎట్లో యదృష్టవశమున నిది తిరిగి నాకులభించినది. నేటికైన నిది ముద్రింపబడుట మిక్కిలి సంతోషకరము.

కలకత్తాలోని "Greater India Society" వారి ప్రకటనలు న్ను, సయాం, కాంబోడియా, చంపారాజ్యములనుగూర్చిన ప్రత్యేక గ్రంథ

# భారతీయ నాగరికతా విస్తరణము.

## 1. ఆ ద ర్శ ము లు.

అతి ప్రాచీనకాలమునుండియు భారతదేశము నేటివలెనే యితర జాతులతోడను, దేశములతోడను, సంపర్కమేమియు లేక నేకాంత జీవితమును గడఁపుచుండెనను నభిప్రాయము మన దేశీయులలో బలముగ నాటుకొనియున్నది. ఉత్తరమున హిమాలయములు నితరదిశల సముద్రము నీదేశమును బాహ్యసంపర్కమునుండి మూసివేయ, ప్రాచీన భారతీయులు వర్ణవిభేదములను గల్పించుకొని, పూర్వాచార పరాయణులై, కూపస్థ మండూకములవలె గాలక్షేపము చేయుచుండిరను నభిప్రాయము పూర్వచరిత్ర పఠనమువలన గలుగుచున్నది. కాని యిటీవల పరిశోధనలీయభిప్రాయము వాస్తవము కాదనియు, సత్యదూరమనియు నిరూపించుచున్నవి. ప్రాచీనార్యులకును నేటి క్రైస్తవ జాతులకును నడుమ నీదేశముపై దండెత్తివచ్చిన ప్రతి జాతికిని తమ స్వాతంత్ర్యమును గోల్పోవుచు, వారికి జోహారొనర్చుచు, కొంచె మవకాశము దొరికినపుడు కొలదికాలము తలయెత్తుచు, మొత్తముమీద భారతీయులు శతాబ్దములకాల మస్వతంత్ర జీవితమున కలవడిరను పూర్వాభిప్రాయము సరియైనదికాదు. అటులే భారతీయ నాగరికత భారతదేశపు సరిహద్దులను దాటలేదనియు, నేటి ఇంగ్లండు, ఫ్రాన్సు మున్నగు పాశ్చాత్యదేశీయులవలె భారతీయుల ప్రతిభ తమ దేశము నెన్నడును దాటిపోలేదనియుఁ, నెంచుటయు ప్రమాదకరమే. ఇటీవల ఆశియాఖండమునందలి వివిధ భాగములలో గనుగొనబడిన చారి

త్రిక సామగ్రి భారతదేశచరిత్రమున కొక నూతనోత్తేజమును, శక్తిని గల్గిం చుచున్నది. దానినుండి ప్రాచీన భారతీయు లాశియాయూరోపుఖండముం లోని విశేషభాగములపై నాధ్యాత్మిక దిగ్విజయ మొనర్చిరనియు, నేఁ ఇంగ్లండు దేశమువలెనే భారతదేశముగూడ నొకప్పుడొక సువిశాల సామ్రా జ్యమున కధినేతయై, నాటి ప్రపంచమునకంతటికినిగూడ నాదర్శభూమియై యొప్పుచుండెననియు దెలియనగుచున్నది. తమదేశములను, తమ కుటుంబములను, విడచి సుదూరదేశములకేగి యచటి కష్టనిష్ఠురముల కోర్చి యేకదీక్షతో క్రైస్తవమతప్రచార మొనర్చు ఫాదిరీలవలెనే యొక ప్పుడు భారతీయులు వర్ణవయోభేదములులేక, సముద్రయానమునందలి ప్రమాదములను లెక్కచేయక, కేవలమును విశ్వమానవ కళ్యాణమునే కాంక్షించి, సుదూరదేశములకేగి భారతీయ విజ్ఞానమును వెదజల్లిరి. అంతవరకు నజ్ఞానాంధకారమున మునిగియుండి యాధ్యాత్మికప్రవృత్తిలేక ననాగరికులుగనుండిన జాతులవా రెందరో నాటి భారతీయ పండితుల యొక్కయు, బౌద్ధభిక్షువులయొక్కయు, కవిగాయక శిల్ప్యాదికళారాధకుల యొక్కయు, స్వార్థరహితమగు సేవచే ప్రబుద్ధులై స్వదేశియసామగ్రిని భారత దేశాదర్శములను సమ్మేళనముచేసి నిలకడగు నాగరికతను నిర్మించుకొనిరి. అంతియగాక సాహసవంతులును, స్వాతంత్ర్యాభిలాషు లునగు భారతవీరులెందరో మత రాజకీయాదివిప్లవము లొదవినప్పుడెల్ల మాతృదేశమును వీడి జావా, సుమత్రా, ఇండోచైనా, బర్మామున్నగుదూర దేశములకేగి, స్వబాహుబలముచే నచటివారిని జయించి, చక్రవర్తిరాజ్య ములను స్థాపించి, వానియందు తమతమ మాతృదేశములందలి నాగరిక తను నెలకొల్పి పెంపొందించిరి. ప్రాచీన గ్రీసుదేశమునుండి యెందరో వలసపోయి, యీవిధముననే పెక్కు చిన్నచిన్న రాజ్యములను నెలకొల్పి గ్రీసుదేశ నాగరికతను విస్తరింపజేసిరి. ఇటీవలికాలమున ఇంగ్లండు ఫ్రాన్సు మున్నగుదేశములనుండియు ననేకు లపుడే నూతనముగ గను గొనబడిన అమెరికాఖండమున వలసరాష్ట్రములను నిర్మించిరి. కాని గ్రీసు

ఇంగ్లండుదేశములవలె భారతదేశ మీవలన రాష్ట్రములతో తగవులాడి, దౌర్జన్యమునుజూపి, తుదకు వానిని గెల్వలేదు. ఆయ్యావి బౌద్ధులు వెడలిన నాటినుండి క్రీ. శ. 13 వ శతాబ్దప్రాంతమున అరబ్బులమున్నగు నితరజాతులవారికి వశమగు వరకునుగూడ నీవలనరాజ్యములతో నత్యుత్తమమగు మైత్రినిపాటించి, యాదర్శప్రాయమై, భారతదేశ మత్తవు మాతవలె నలరారుచుండెను. ఈదూరదేశములన్నిటియందునుగూడ భారతీయ నాగరికతాచిహ్నము లనేకములు నేటికని గాంచనగుచున్నవి. నేటికని కొన్నికొన్ని జాతులయొక్కయు, దేశములయొక్కయు సాంఘికజీవితమునందును, నాగరికతయందును భారతదేశ సంబంధము స్పష్టముగ గన్పించుచున్నది.

భారతదేశముయొక్క యీయాధ్యాత్మిక దిగ్విజయమునకును, తత్ఫలితముయొక్క శాశ్వతత్వమునకునుగూడ ముఖ్యకారణములు ప్రాచీన భారతీయుల యాదర్శములే. క్రీ పూ. 1500-500 నడుమ ప్రాచీన సామ్రాజ్యము లనేకములు ప్రబలినవి. వానికన్నిటికినిగూడ విదేశీయ నాగరికతలతో ప్రత్యర్థిత్వము సంభవించినది. ఫినీషియనులు తాము జయించిన జాతుల యార్థికసంపదనెల్ల చూరగొని వారి ననాథులను జేసి వేసిరి. అటుపై అస్సిరియనులు పశుబలముచే నెన్నియోతెగలను రూపుమాపి తమ సామ్రాజ్యమును స్థాపించిరి. ఈజిప్షనులును, రోమనులు నీమార్గమునే యవలంబించి ఖడ్గముతో తమనాగరికత నితరజాతులవారిలో వ్యాపింపజేసిరి. గ్రీసుదేశీయులుగూడ తాము జయించినజాతుల నాగరికతను నశింపజేసి వారందరును తమనాగరికతనే యవలంబి చుంట్లొనర్చిరి. ఇదేకాలమున భారతదేశమునందు ప్రాచీనార్యుల కితరజాతులతో సంబంధమేర్పడెను కాని యీసందర్భమునం దార్యులు ప్రత్యర్థిజాతులనునిర్మూలింపజేయుటగాని, వారి నాగరికతను పూర్తిగ ధ్వంసముచేయుటగాని, చేయక వారియెడ సామరస్యము నుపయోగించి, వారి నాగరికతయందలి యుత్తమాంశములను గైకొని, తన్మూలమున దమనభ్యతనుగూడ

మార్పుజేసికొని, క్రమక్రమముగ పైజాతులవారినెల్ల వశపరచుకొనిరి. ఈయార్యానార్య నాగరికతా సమ్మిశ్రణమువలన నీరెండుజాతులవారికిని లక్ష్యైక్యతయు, దన్మూలమున శాంతియు సమకూడినవి. దాని నుండి జాతినిర్మూలనముగాక జాత్యుద్ధరణమే ప్రాచీనభారతీయుల మొదటి యాదర్శమని స్పష్టమగుచున్నది.

పూర్వభారతీయుల యాధ్యాత్మిక ప్రవృత్తిగూడ విశ్వాత్మకము గనే యుండినది. ఉపనిషత్తులు సంసారచక్రమున పరిభ్రమించు మానవ కోటి కంతటికినిగూడ మోక్షమార్గము నుపదేశించుచున్నవి. అదే విధ మున బౌద్ధతత్త్వముగూడ సర్వమానవకల్యాణము చేకూరు మార్గముల నెన్నిటినో యుపదేశించినది. ఈవిధమున ప్రాచీనభారతదేశము అహింస, తృష్ణారాహిత్యత, సౌహార్దతయను సూత్రముల నుపపాదించి ప్రతివ్యక్తికిని శాశ్వతసుఖము నొనగూర్పనగియుండెను. దానినుండి ప్రాచీనభారతీయులు సత్యానంతరణమును మరియొక యాదర్శముగ నుంచుకొనిరని స్పష్ట మగుచున్నది.

క్రీ. పూ. 5-3 శతాబ్దములలో విశ్వసామ్రాజ్య నిర్మాణకాం క్షచే రాజన్యులెందరో దుష్కృత్యముల ననేకముల జేసియుండిరి. స్వార్థ పరులై కేవల పశుబలముతో పర్షియనులు సటుపిమ్కుట యువనవీరుడగు నలెగ్జాండరును సువిశాలములగు సామ్రాజ్యములను నిర్మింప యత్నించి, నాటి మనుష్యకోటి నెన్నియోవిధముల పీడించిరి. కాని మానవ రుధి రార్ద్రములగు యుద్ధభూములలో హృదయదారకమగు నిర్వేదము నణంచి భారతభూమి యిదేసమయమున మరియొకసారి శాంతిసందేశము నుద్ఘో షించెను. కళింగ సంగరరంగమున "ధర్మమను మహాస్త్రముచే మానవ హృదయములను జయించుటయే నిజమైన విజయము" అను నవిముప్మక మగు ప్రబోధమునంది యశఃకాయుడగు నశోకచక్రవర్తి "సర్వేమనుష్యా మే ప్రజాః" అని యుద్ఘోషించి, జాతిమత వివక్షతలను పాటింపక

మానవసంఘ మంతటికిని ధర్మోపదేశ మొనర్చెను. ఈచక్రవర్తి మహా సందేశము సిరియా, ఈజిప్టు, సైరినీ, మాసిడోనియా, ఎపిరస్, సింహళము, స్వర్ణభూమి మున్నగు దూరదేశములందు సహితము ప్రతిధ్వనించెను. అహింస, ప్రేమ యను మరి రెండాదర్శములను యీచక్రవర్తి సమకాలిక ప్రపంచమున కొసంగెను.

క్రీ. పూ. 5 వ శతాబ్దినుండి క్రీస్తుశకారంభము వరకునుగల కాలమునాటి భారతదేశచరిత్రము మరియొక ముఖ్యాంశమును దెలుపుచున్నది. మొదట పర్షియనులును పిమ్మట యవనులు నీదేశపు పశ్చిమోత్తరప్రాంతమును వశపరచుకొనిరి. ఆకాలమునం దాయాజాతుల వారట స్థిరపడి స్థానికులతో గలసిపోయిరి. పిమ్మట శక, పహ్లవ, యూఏచీ జాతులవా రీదేశముపై దండెత్తివచ్చి యిట స్థిరపడి రాజ్యములనుగూడ నిర్మించిరి. కాని యనతికాలమునకే వారు తమ విదేశీయవ్యక్తిత్వమును గోల్పోయి' పరిపూర్ణముగ భారతీయులై, భారతీయాచార వ్యవహారములను పరిగ్రహించి, హిందూబౌద్ధమతముల నవలంబించి, భారతీయులలో గలసిపోయిరి. 'దీనినుండి సర్వజన సమాదరణము పూర్వభారతీయుల మరియొక యాదర్శమని తెలియుచున్నది.

ఈవిధమున సర్వజాత్యుద్ధరణము, సర్వసంతరణము, అహింస ప్రేమ, ధర్మసంస్థాపనము, సర్వజన సమాదరణమునను నుత్తమాదర్శముల మూలమున ప్రాచీనభారతీయులు నాటి ప్రాచ్యపాశ్చాత్య ప్రపంచములపై నాధ్యాత్మిక దిగ్విజయమొనర్చి విశ్వమానవకల్యాణమును చేకూర్చిరి. మధ్య యుగమునాటి పాశ్చాత్యదేశమునందలి సాహసవంతులవలెనే నాటి భారతీయ పండితులును, యువకులును, దేశాంతర విజయములను సంపాదించుటకై యువ్విళ్ళూరుచుండిరి. ఒకట్రొటియయ్యు సహస్రస్థలముల ప్రతిబింబించుచు నాటి భారతభూమి సువిశాలమగు నాధ్యాత్మిక సామ్రాజ్యమునకధినేతయై యొప్పుచుండెను.

ఈభారతీయ నాగరికతా విస్తరణముయొక్క యారంభకాలము నుగూడ నొకవిధమున నిర్ణయింపవచ్చును. కెపడోషియా యను దేశమున "బొగజ్ కోయి"యనుచోట నొకశాసనము గనుగొనబడినది. ఇది క్రీ పూ. 14 వ శతాబ్దినాటిదని పండితులు నిశ్చయించి యున్నారు. "హిట్టైట్" "మిట్టానీ" యను రెండుజాతులవారు నిరంతరమును తమలోజరుగుచుండిన సమరములను మాని, సంధియొనర్చుకొని, దానికి ప్రమాణముగ వేదములలో పేర్కొనబడిన ఇంద్ర, వరుణ, మిత్రాది ప్రాచీనార్యదేవతలను పేర్కొనిన శాసనమునుండి తెలియుచున్నది. ఈసంధి చిరస్థాయిగనుండుటకై యాజాతుల రాజవంశములకు వైవాహికసంబంధ మేర్పరుపబడెను. మరియు నప్పుడువివాహితులైన నూతనదంపతుల కభ్యుదయమొసంగుటకై నా సత్యులను వైదికదేవతలు ప్రార్థింపబడిరి. క్రీ. శ 13 వ శతాబ్దినాటికి పెక్కుస్థలముల నుపద్రవములు సంభవించి, భారతీయ నాగరికత యంతరించెనని యింతకుపూర్వము చెప్పియుంటిమి. కాన నీనాగరికతా విస్తరణము క్రీ. పూ. 14 వ శతాబ్దినుండి క్రీ. శ. 13వ శతాబ్దివరకును జరగెనని స్పష్టమగుచున్నది.

# భారతీయ నాగరికతా విస్తరణము.

## 11. నాగరికతా విస్తృతి

పూర్వప్రకరణమున ప్రాచీనభారతీయుల యాదర్శములను పేర్కొనియుంటిమి. ఈప్రకరణమునందు భారతీయనాగరికత యేయేదేశముల యం దేయేశతాబ్దములలో వ్యాపించెనో దిఙ్మాత్రముగ సూచింపబడును.

ఇటీవల ఫ్లిండర్స్‌పెట్రీ యను నొక పండితుడు యూరప్, ఆసియా, ఆఫ్రికా ఖండముల నడుమగల మధ్యధరాసముద్ర తీరమునం దున్న మెంఫిసునగరమున భారతీయ స్త్రీపురుషుల చిత్రములను గనుగొనెను. ప్రాచీనభారతీయు లాసియాఖండపు ప్రాగుత్తరమునన్న జపానుద్వీపమునందును, ప్రాగ్దక్షిణమునసున్న మొలక్కాసుద్వీపమునను, నైరృతిభాగమునందున్న అఫ్రికాఖండమునకు సమీపమునందున్న మెడగాస్కర్‌ద్వీపముననుగూడ తమ నాగరికతను వ్యాపింపజేసినటుల తెలియుచున్నది. ఈయెల్లలనడుమనుండు సువిశాలభూభాగమంతయు నొకప్పుడు భారతీయాధ్యాత్మిక సామ్రాజ్యముగ నుండెను.

ఈయార్యనాగరికత భారతదేశమునందలి యన్నిభాగములనుండియు విస్తరించెను. పశ్చిమమున ఆఫ్గనిస్థానముమొదలు తూర్పున జపానువరకునుగల దేశములలో వ్యాపించిన నాగరికత యుత్తరాపథ నాగరికత. బర్మా, ఇండోచైనా, జావా, సుమాత్రాలలో విస్తరించినది యాంధ్రదేశ నాగరికత. ఆశియాఖండపు ప్రాగ్దక్షిణద్వీపములలో

గొంతవరకును ద్రావిడదేశ సంపర్కమును గన్పించుచున్నది. ఈ భారతీయ నాగరికత భూమార్గముననను సముద్రమార్గముననుగూడ విస్తరించెను. సామాన్యవాణిజ్యమార్గములే నాగరికతా విస్తరణమునకుగూడ మార్గములైనవి. ఇటుపైని విస్తరణము సవిస్తరముగ వివరింపబడును.

(I) టిబెట్:— క్రీ. శ. 1 వ శతాబ్దమున 'యూఎచీ'అను నొకజాతివారు మధ్య ఆసియానుండి భారతభూమిపై దండెత్తివచ్చి యిట స్థిరపడిరి. వారిలో నొక తెగవారగు కుషాను లిచ్చట రాజ్యమేలిరి. అందు సుప్రసిద్ధుడును, భారతీయచక్రవర్తులలో నగ్రగణ్యుడునగు కనిష్కుడు కాష్ఘర్, యార్ఖండ్ మున్నగు మధ్య ఆసియాలోని ప్రదేశములను జయించెను. ఈతని యాదరణముచే నీదేశములలో మహాయానబౌద్ధమతము విస్తరించినది. ఇటనుండి యామతము చైనాకు ప్రాకినది, క్రీ. శ. 7 వ శతాబ్దమున స్ట్రాంగ్ ట్సన్ గంపో (Strang-tsan-Gampo)యను నాతడు టిబెట్టును పాలించుచుండెను. అతని భార్యయగు నేపాలరాజపుత్రిక తాంత్రికబౌద్ధమతము నాదేశమున బ్రవేశింపజేసెను. ఆ రాజు మఱియొకభార్యయగు చైనారాజపుత్రిక యాదరమున టిబెట్టుదేశమున ననేకులగు చైనాదేశభిక్షువు లేతెంచిరి. గంపోరాజు తనమంత్రిని హిందూదేశమునకు విశేషజ్ఞానము నుపార్జించుటకై బంప, నాతడు దేవనాగరీలిపినుండి యొకక్రొత్తలిపిని నిర్మించి టిబెట్టుదేశమున బ్రచారము చేయించెను. క్రీ. శ. 8 వ శతాబ్దమున మఱియొకరాజు పద్మసంభవుడు నాతనిశిష్యుడగు వైరోచనుడు మున్నగు భారతీయపండితుల ననేకులరావించి వారిసాహాయ్యమున టిబెటనుబాషలో వాఙ్మయమును నిర్మింపజేసెను. క్రీ. శ. 1083లో నాలందావిశ్వవిద్యాలయాధ్యక్షుడును బండితశిఖామణియునగు ద్వీపాంకర అతీశుడు టిబెట్టునకేగి యచ్చటిమతమునకు నూతనోత్తేజమును గల్గించెను. ఆదేశమునం దమరకోశము, మేఘదూతము, చంద్రగోమివ్యాకరణము, చిత్ర

లక్షణము మున్నగుభారతీయ గ్రంథములెన్నియో భాషాంతరీకరింపబడి నవి. మొత్తముమీద టిబెటనులు తాంత్రికబౌద్ధమున బద్ధాదరులైరి. మంత్రములు, ఇంద్రజాలము, శక్త్యారాధనము వీరికి ప్రీతికరములు.

(2) చైనా:— క్రీ. పూ. 3 వ శతాబ్దమున చైనాదేశీయులు హిందూదేశమును జేరుటకై యనేకప్రయత్నము లొనర్చిరి. క్రీ. పూ. 217 లో పదునెన్మండ్రు బౌద్ధభిక్షువు లాదేశమునకేగిరట. మఱునటి శతాబ్దమున 'చాంగకియన్' అను నతడటనుండి మొదటిసారి మనదేశమునకు రాగల్గెను. క్రీస్తుశకారంభమున యూఎచి, బాక్ట్రియును, సాగ్డియసుమున్నగు మధ్య ఆసియాజాతులవారు చైనాలో బౌద్ధమతము నుపదేశించిరి. క్రీ. శ. 67లో కశ్యపమతంగుడు, ధర్మరక్షకుడునను నిర్వురు భారతీయభిక్షువులు చైనాకేగి 'మింగటి' యను నాదేశపు చక్రవర్తియాదరము నంది బౌద్ధగ్రంధములను భాషాంతరీకరించియు, నారాధనలను నెలకొల్పియు, మతప్రచారము సాగించిరి. క్రీ. శ. 4 వ శతాబ్దమున 'ఫాహియన్' అను నత డనేకకష్టముల కోర్చి యీదేశమున కేతెంచెను. ఈతడు తక్షశిలా, పురుషపురము, పాటలీపుత్రము, తామ్రలిప్తి మున్నగు బౌద్ధ విద్యాస్థానములలో బౌద్ధమతరహస్యములను నేర్చుకొనెను. అందుచే చైనాదేశీయులకు బౌద్ధగ్రంథములను, మతమునుగూడ, మూలకల నుండి నేర్చుటకవకాశము గలిగెను.

ఇదేసమయమునం దొక చైనాదేశసైన్యాధిపతి "కుమారజీవుడు" అను నొకభారతీయుని దనదేశమునకుబందిగగొనిపోయెను. ఈతడు పది సంవత్సరము లాదేశముననుండి, యసమాన పాండిత్యప్రతిభచే ననేకమేధావంతుల నాకర్షించి, బౌద్ధగ్రంథ భాషాంతరీకరణమునకు మార్గదర్శియయ్యెను. ఈకాలమున బుద్ధభద్రుడను మఱియొక భిక్షువు సముద్రమార్గమున చైనాదేశముజేరి దక్షిణభాగమున మత ప్రచారమారంభించెను.

ఇచ్చటి ప్రజ లూహాశక్తియు, గావ్యధోరణియు గలవారుగ నుండిరి. ఈ గుణములకు భారతీయమగు ఋజువర్తనమును, మనస్సంయమనమును, ధ్యానమును తోడుజేసి, యాభిక్షువు చైనాదేశమున ధ్యానవాదమునకు (School of Meditation) బునాదులేర్పరచెను. క్రీ. శ. 5 వ శతాబ్దిలో కాశ్మీరరాజపుత్రుడగు గుణవర్మయను నాతడు మతదీక్షచే రాజ్యమును విడచి, యన్యదేశములకేగెను. 424లో నీతడు చైనాదేశోత్తరభాగమున దన యత్యద్భుతభాషాంతరీకరణ శక్తివలనను, చిత్రకళా నైపుణ్యముచేతను మతప్రచారము నత్యుత్తమముగ నొనర్చెను. ఒకవిశేషమేమన నీతడు భిక్షుణీజనములకైగూడ గొన్నివిహారములను గట్టించెను. ఇంతటినుండియు సంఘసేనుడు, గుణవృద్ధి మున్నగు ననేకులు సింహళ జావాద్వీపముల మీదుగా భారతభూమినుండి చైనాదేశమున కేగియుండిరి క్రీ. శ, 6 వ శతాబ్దమున మఱి యిర్వురు భిక్షువులు మతప్రచారమొనర్చిరి. వీరిలో బోధిధర్ముడు ప్రథముడు, అతనికి పిమ్మట బౌద్ధతత్వజ్ఞులలో ముఖ్యుడగు వసుబంధకవి జీవితచరిత్రమును వ్రాశిన పరమార్థుడు గూడ సముద్రమార్గముననే చైనాకువచ్చెను అనంగ, వసుబంధు మున్నగు సర్వాస్తివాదుల గ్రంథములను భాషాంతరీకరించి యాపండితుడు చైనాలో యోగాచారవాదమును బయల్వెడలించెను. క్రీ. శ. 7, 8వ శతాబ్దములలో చైనాదేశమునందీ భారతీయ నాగరికతా విజృంభణము పరమావధిని గాంచినది. అప్పుడు హిందూదేశమున కేతెంచి యిట విజ్ఞానామృతమును గ్రహించి స్వదేశమగు చైనాను పునీతంజేసిన హ్యూఎన్ త్సాంగు, ఈత్సింగు మున్నగువార లీవిషయమై వ్రాసియుండిరి. ఆకాలమున భారతీయమగు ప్రతివిషయమును గౌరవనీయముగ నుండెడిది బౌద్ధయుగమున హిందూదేశమున వర్థిల్లిన శిల్పము, విగ్రహనిర్మాణము, తంత్రము, చిత్రలేఖనము మున్నగునవి యాకాలపు చైనాదేశీయుల కాదర్శములై నిరుపమమగు నాగరికతా సమ్మేళనమును జూపుచున్నవి.

(3) కొరియా:— చైనానుండి బౌద్ధమతము కొరియాకు ప్రాకినది. క్రీ. శ. 374లో 'అతో, 'షణతో' అను నిర్వురు భిక్షువులాదేశమునకు రాజధానియగు పినాంగ్‌పట్టణము కేగిరి. మఱి పదిసంవత్సరములకు పిమ్మట మతానందుఁడను నతడు కొంత అనుచరులతోగూడ కొరియారాజ్యమున కాహ్వానింపబడెను. 5వ శతాబ్దమున మఱియొక భిక్షువు కొరియాలోని సిల్లరాజపుత్రికకు దనయోగశక్తిచే చికిత్సజేసి రాజాదరమును బడసి, యారాజ్యమున తాంత్రికబౌద్ధమతమును వ్యాపింపజేసెను. మఱి యేబదిసంవత్సరములకు కొరియారాజవంశతులు బౌద్ధదీక్షను గైకొనిరి. అంతట నాదేశమునం దొక మతనియోగ మేర్పడి 10వ శతాబ్దమువరకును బౌద్ధమత మభివృద్ధినందెను.

(4) జపాను.— క్రీ. శ, 5వ శతాబ్దమున చైనా నాగరికత జపానునకు సోకినను బౌద్ధమతముమాత్ర మాదేశమునకు కొరియా మూలముననేవచ్చెను. 538 లో కొరియాదేశము స్వర్ణనిర్మితమగు నొక బుద్ధవిగ్రహమును కొన్నిబౌద్ధగ్రంథములను సామంతతా చిహ్నములుగ చైనాదేశమున కంపెను. మఱి నలుబదిసంవత్సరములకు 'ఉమయోదో'యను జపానురాజు బౌద్ధమతమును రాజమతము నొనర్చెను. కొరియాభిక్షువులచే దన ప్రజలకు వైద్యజ్యోతిషములను చెప్పించి యాతడు దేశీయులను గొందరిని బౌద్ధధర్మమును దెలిసి కొనుటకై చైనాదేశమున కంపెను బౌద్ధమతముతోపాటు కళలు, స్వచ్ఛందసేవ మున్నగునవికూడ జపానును ప్రవేశించినవి 'కణజిణ' అనునాత డీదేశమున వైద్యసంఘములను స్థాపించెను. 736 లో భారతీయుడును, బ్రాహ్మణుడును భారద్వాజగోత్రియుడునగు బోధిసేనుడను భిక్షువు చిత్రకారులను, గాయకులను దోడ్కొని జపానుదేశమునకేగి ముప్పదిసంవత్సరములకాలము బౌద్ధమతప్రచారము నొనర్చెను. ఈభిక్షువులు భారతీయాచర్యములను భారతీయ గానమును చిత్రకళను దేశీయులకు నేర్పియు, దేశీయనాగరికత నభివృద్ధిపరచియు

జపానుదేశ జీవితమునకు నూతనతేజమును గల్పించిరి. 8 వ శతాబ్దమున నాదేశమున వైదుష్యమును, శాంతిసౌఖ్యములును బ్రబలినవి. సుభాకరసింహ, అమోఘవజ్రాదులచే బ్రవర్తింపబడిన మాంత్రికవాదమును, అనంగభిక్షుని ధర్మలక్షణవాదమునుగూడ నీదేశమున కేతెంచినవి. ఈ ప్రచారమునకు ఫలితముగ 9 వ శతాబ్దమున జపానుదేశీయులే ప్రత్యేక పరిశ్రమమొనర్చిబౌద్ధమతమున నూతనసిద్ధాంతములను బయల్వెడలించిరి. 'టెండెయ్' ('Ten-dei') 'షిన్ గన్' (Shin-Gon) అను శాఖ లిట్టివే. 12 శతాబ్దినాటికి తాత్త్విక బహుళముగాక సుగమమును మనోరంజకమునగు మత మవసరమైనది! దానికి ఫలితముగ 'సుఖవటి' యను నొకసిద్ధాంతము బయల్వెడలినది. దీని ననుసరించి తత్త్వమును, యోగమును, నిష్ప్రయోజకములు. అమితాభయను దైవమునందు నిశ్చలమగు నమ్మకముండినచో ముక్తి సులభ సాధ్యమగును అంతియేగాక బౌద్ధమతమునకు బూర్వ మీదేశమునందుండిన 'షింటో' మతమునగూడ గొప్పపరివర్తనములు జరిగినవి అమతావలంబకులు తమ దేవతలను బుద్ధుని యవతారములుగ జరిగణింప మొదలిడిరి.

బర్మా:— క్రీస్తుశక ప్రారంభముననే భారతీయులకు బర్మాదేశముతో బరిచయముండినటుల దెలియుచున్నది. క్రీ. శ. 78 లో ప్రపంచమంతను చుట్టివచ్చిన యొకగ్రీకుదేశీయుడు ఆఫ్రికాఖండమునుండి హిందూదేశముమీదుగాచైనా దేశమువరకును వర్తకముజరుగుట కనుకూలమగు మార్గముండెడిదని వ్రాసియున్నాడు బర్మా యీమార్గముననే గలదు. 3 వ శతాబ్దమున హిందూదేశమునుండి అస్సాం బర్మాలమీదుగా చైనాకు మార్గముండెడిదని చంపాయను హిందూరాజ్యములోని శాసనములనుండి తెలియుచున్నది. 5 వ శతాబ్దమున భారతదేశమునందు గుప్తరాజుల పరిపాలనమున హిందూమతమపూర్వమగు నభివృద్ధి నందినది. ఈ సమయముననే ఆశియాఖండమునందలి ప్రాగ్దక్షిణదిశను అస్సాం చైనాలకు

మధ్యనుండు ప్రకృత ఇండోచైనాలో చంపా, కాంబోజయును, హిందూ రాజ్యములు నెలకొల్పబడినవి.

బౌద్ధగాథలలో అశోకచక్రవర్తి బర్మాకుగూడ మతప్రచారకులను బంపెనని వ్రాయబడియున్నది. ఈ దేశమున దొరికిన 5వ శతాబ్దినాటి 'ప్యూ' శాసనములనుండి యంతకు రెండు మూడు వందల సంవత్సరములకు బూర్వమే యిచ్చట హిందూమతము వ్యాపించె ననియు' నిచ్చటి వారలు సంస్కృత ప్రాకృతములనుండి కొన్ని మాటలను తమభాషలోనికి దెచ్చుకొనిరనియు, దెలియుచున్నది. అటుపై మహాయానబౌద్ధమతము గూడ బర్మాను బ్రవేశించెను. క్రీ. శ. 450లో హీనయానబౌద్ధమత ప్రచారకుడగు బుద్ధఘోషు డీదేశమున మతబోధ నొదర్చెను.

(6) సయాం:--కాంభోజ దేశమునుండి హిందూ బౌద్ధమతము లీ దేశమును బ్రవేశించినవి. అంతియగాక భారతదేశమునుండి విజ్ఞానకృషి చేయుటకై యేతెంచిన బ్రాహ్మణులును, వర్తకమునకై వచ్చిన వణిజులునుగూడ నీ మతప్రచారము నొనర్చిరి, సయాందేశమునందలి మతము, భాష, సంస్థలు, లిపి, కళలు, వాఙ్మయము మున్నగు- నవన్నియు హిందూదేశమునుండి పరిగ్రహింపబడినవే.

(7) కాంబోడియా:-ఈదేశము బర్మాకును, చైనాకును మధ్యనుండి ప్రకృతమునం 'ఇండోచైనా, యని పిలువబడు భాగమున సయాంకు దక్షిణమునం దున్నది. క్రీ. శ. 1 వ శతాబ్దమునం దొకపర్యాయమును, 4 వ శతాబ్దిలో నింకొక సారియు హిందువులు మాతృభూమినుండి యీ దేశమున కువలనవచ్చిరి. ఇచ్చటి శాసనములనుండి 7-13 వ శతాబ్దములలో నిచ్చట సంస్కృత భాషయు, దేవనాగరీ లిపియు వ్యవహారమునం దుండెడి వనియును, హిందూ దేవాలయము లనేకములు నిర్మింప బడిన వనియును దెలియుచున్నది. 5 వ శతాబ్దమునం దిచ్చటి జయవర్మయను రాజు నాగ

సేనుటను బౌద్ధభిక్షువును హిందూ దేశమునుండి రావించి బౌద్ధమతమును వ్యాపింపజేసెను.

(8) చంపా:- ఇయ్యది సయాం కాంబోడియాలకు తూర్పున బ్రిటిష్ అన్నాం లో నుండినది. క్రీ. శ. 192 లో హిందువులు దీనిని నిర్మించిరి. పాణినీయ వ్యాకరణము, పురాణములు, జ్యోతిషము, షడ్దర్శనములు, ధర్మశాస్త్రములు శైవాగమములు, హిందువుల చతుఃషష్టి కళలు నీ దేశమునందుండినవి. ఇచ్చట శైవ మతము ప్రబలుటచే శివాలయము లనేకము లుండెడివి. వాని శిథిలములు నేటికిని బరిశోధకులకు లభించుచున్నవి.

(9) మలే ద్వీపకల్పము:- ప్రాచీన హిందువులు పశ్చిమమున ఆఫ్రికా ఖండములోని మెడగాస్కర్ ద్వీపముతోడను, తూర్పున మలేద్వీప కల్పము మీదుగా జావా, సుమత్రా దీవులతోడను వ్యాపారము జేయుచుండిరి. మలే భాషలో నెన్నియో సంస్కృత పదములు గలవు. మతనైతి కార్షిక జ్యోతిష గణితాది విషయములను గూర్చి యిచ్చటివారి యభిప్రాయములు గీర్వాణ పదములలోనే బేర్కొనబడుచున్నవి. వారి దేవతలలో నుత్తమ వర్గీయులు హిందూదేవతలు. సర్వవిధములను మలేవాసులు చిరకాలము హిందూనాగరికత ననుభవించిరి.

# భారతీయ నాగరికతా విస్తరణము.

## 111. అఫగనిస్థానము

అఫగనిస్థానము ప్రాచీనకాలమున ప్రఖ్యాతి బడిసిన పర్షియా మున్నగు పశ్చిమ ఆసియాదేశములకును, హిందూ దేశమునకును నడుమ నున్నది. ఇందుండిన కొంత కాలమునకు పిమ్మటనే యొక యార్యశాఖ భారతదేశమునకు వచ్చినది. పిమ్మట నీ భూభాగము పర్షియను, గ్రీకు, హైందవశక, హూణ, తురుష్క, అఫగను, మొగలు జాతీయుల వశమై విచిత్రమగు పరిణామమును గాంచినది. కాన నీ దేశమున వివిధజాతుల యొక్కయు వారివారి నాగరికతల యొక్కయు సమ్మిశ్రణము జరిగినది. సామీప్యతనుబట్టి యీదేశమునకు ప్రాచీన కాలమునుండియు భారతదేశముతో సంబంధమేర్పడినది. హిందూ దేశమునుండి పశ్చిమ ఆసియా దేశములకు ప్రకృతి దత్తములగు రెండుమార్గములేర్పడినవి. అందొకటి సింధునదియును కాబుల్‌నదియును గలయుస్థలమునుండి బయల్వెడలి, కాబూల్‌నదిననుసరించి, హిందూకుష్‌పర్వతములను దాటి, బ్యాక్ట్రియను మైదానము గుండా పర్షియాకు పోవుచుండెను. రెండవమార్గము సింధునది యొక్క క్రిందభాగమున బయలుదేరి సులేమాన్ పర్వతముల ప్రక్కగా కాందహార్‌నగరముమీదుగా హీరట్‌నగరమున కేగి, యటనుండి ఎల్‌బర్జ్ పర్వతములకు దక్షిణముగా పశ్చిమదేశముల కేగుచుండెడిది. వీనిలో మొదటి మార్గము మిగుల ముఖ్యమైనది. డరయస, అలెగ్జాండరు, సెల్యూకస్, కాడ్ఫైసిస్ మున్నగు హిందూదేశ విజేతలును, హ్యూన్‌త్సాంగ్ మున్నగు

మౌర్యయుగము:- అలెగ్జాండరు మరణించిన పిమ్మట నాతని సేనానులలో నొకడగు సెల్యూకస్ యవనరాజ్యమునందలి తూర్పుభాగ మును స్వాధీనము జేసికొనెను. ఉత్తర హిందూదేశమునం దప్పుడే దల యెత్తిన చంద్రగుప్త మౌర్యుని ధాటి కాగలేక నీ యవన సేనాని పరొపని సదె, ఆరియానా, ఆరకోసియా యను విభాగముల నాతని కొసంగి సంధి చేసికొనెను. ఈ మౌర్యులు బశ్చిమోత్తర ప్రాంతసంరక్షణార్థమై తక్షశిలానగరమునం దొక రాజ ప్రతినిధిని నియమించిరి. అప్పటినుండియు నా నగరమునుండి హైందవ నాగరికత బశ్చిమమునకు విస్తరించినది. అశోక చక్రవర్తి పరిసరములనుండు స్వతంత్రరాజ్యములకే గాక యవన, కాంభోజ, గాంధారదేశములలోని తన యేలుబడి క్రిందనుండిన భూభాగములకు గూడ బౌద్ధభిక్షువుల నంపియు, ధర్మమహామాత్రులను నియమించియు, మతప్రచారమొనర్చెను. క్రీ. శ. 7 వ శతాబ్దమున భారతదేశము బర్యటన మొనర్చిన హ్యూన్‌ష్వాంగ్ అను చైనాయాత్రికుడు కపిశానగరరాజ్యమునం దశోకుడు స్థూపములను గట్టించెనని చెప్పియున్నాడు.

యవనరాజులు:— అశోకునిబిమ్మట శుభసేనుడను హిందూరాజు హిందూకుష్‌పర్వతప్రాంతమును వశపఱచుకొనెను. తరువాత 'డెమిత్రియస్' అను యవనరాజు కాబూల్, ఆరకోషియా, పంజాబులను జయించెను, అటుపై యూక్రటైడిస్ అను నాతడు కపిశ గాంధార రాజ్యములనుగూడ జయించెను. ఈ యవనరాజులకాలమున హిందూదేశ నాగరికత ప్రబలినది. వీరు తమ నాణెములపై నామములను ప్రాకృతభాషలో బ్రాహ్మి, ఖరోష్ఠిలిపులలో ముద్రించిరి. "కావిశియె నగర దేవతా" యను నొక నాణెముపై వ్రాతనుబట్టి యాకాలమున సుదూరమునందుండిన కపిశానగరమువ బ్రాకృతభాష వ్యాప్తిలో నుండెనని తెలియుచున్నది.

నుండిరని తృణీకారభావము జూపబడినది. ఆపస్తంభ, బౌధాయనులు, గాంధారపారసీకదేశములకు పోనూడదని శాసించిరి.

పర్షియను విజయము = క్రీ. పూ, 522-486 నడుమ పర్షియా నేలిన డరయుస్ అను రాజు బ్యాక్ట్రియా, గాంధార. సింధుమైదానములను తన రాజ్యమున చేర్చికొనెను. గాంధారదేశమునకును భారతదేశమునకు ననేకవిధములగు సంబంధ ముండెడిది. భారతదేశమునందలి పదునారు మహా జనపథములలో గాంధార మొక్కటిగ పేర్కొనబడియున్నది. సంస్కృత వ్యాకరణ నిర్మాతయగు పాణిని యాదేశముననే జన్మించెను. బౌద్ధజాతకములలోని రంగము లనేకము లచ్చటివే. ఇదిగాక హిందూదేశపు నరిహద్దులో తటగు, అపరిత్రి, శక, పర్షియను సామ్రాజ్య విభాగము లుండెడివి. వీనిలో తటగుదేశవాసులగు దరదిస్ అనువారు మహాభారతమునందు నితర సంస్కృతగ్రంథములందును దరదులని పేర్కొనబడియున్నవారు. శక యను ప్రదేశమున కాస్పిడీం అను జాతి యుండెడిది. పాణిని కౌటిల్యుడు మున్నగువారు వీరిని కాపిశులని పేర్కొనియున్నారు.

అలెగ్జాండరు విజయము:— ఈయవనవిజేత భారత దేశముపై దండెత్తివచ్చిన సమయమునం దఫ్గనిస్థానముపై హిందూదేశ ప్రభావము ప్రబలముగనుండినది. ఆకాలమున హిందూకుష్ పర్వత ప్రాంతమును శశిగుప్తుడను నత డేలుచుండెను. అసెసినీయస్, అస్పనులు నను తెగలవారు బ్రకృతకునార్, పొకాజ్ కోరా, స్వాత్‌నదితీరములం దుండిన భారత జాతీయులు. ఇచ్చట ననేకస్థలములకును నదులకును హిందూనామము లుండెడివి సువాస్తు, గౌరీనదులును పుష్కరావతీనగరము నిందు కుదాహరణములు. మహాభారతమునం దొకచో (5-9-333) నదీవర్ణనమునం దీనదులుగూడ పేర్కొనబడియున్నవి.

మౌర్యయుగము:- అలెగ్జాండరు మరణించిన పిమ్మట నాతని సేనానులలో నొకడగు సెల్యూకస్ యవనరాజ్యమునందలి తూర్పుభాగ మును స్వాధీనము జేసికొనెను. ఉత్తర హిందూదేశమునం దప్పుడే బల యెత్తిన చంద్రగుప్త మౌర్యుని ధాటి కాగలేక నీ యవన సేనాని పరోపని నదె, అరియానా, అరకోసీయా యను విభాగముల నాతని కొసంగి సంధి చేసికొనెను. ఈ మౌర్యులు బశ్చిమోత్తర ప్రాంతసంరక్షణార్థమై తక్షశిలాన గరమునం దొక రాజ ప్రతినిధిని నియమించిరి. అప్పటినుండియు నా నగ రమునుండి హైందవ నాగరికత బశ్చిమమునకు విస్తరించినది. అశోక చక్రవర్తి పరిసరములనుండు స్వతంత్రరాజ్యములకే గాక యవన, కాంభోజ, గాంధారదేశములలోని తన యేలుబడి క్రిందనుండిన భూభాగములకు గూడ బౌద్ధభిక్షువుల నంపియు, ధర్మమహామాత్రులను నియమించియు, మతప్రచారమొనర్చెను. క్రీ. శ. 7 వ శతాబ్దమున భారతదేశము బర్యటన మొనర్చిన హ్యూన్‌ప్యాంగ్ అను చైనాయాత్రికుడు కపిశానగరరాజ్య మునం దశోకుడు స్థూపములను గట్టించెనని చెప్పియున్నాడు.

యవనరాజులు:— అశోకునిపిమ్మట శుభసేనుడను హిందూరాజు హిందూకుష్‌పర్వతప్రాంతమును వశపఱచుకొనెను. తరువాత 'డెమిట్రి యస్' అను యవనరాజు కాబూల్, అరకోషియా, పంజాబులను జయించెను, అటుపై యూక్రటైడిస్ అను నాతడు కపిశ గాంధార రాజ్యము లనుగూడ జయించెను. ఈ యవనరాజులకాలమున హిందూదేశ నాగరికత ప్రబలినది. వీరు తమ నాణెములపై నామములను ప్రాకృతభాషలో బ్రాహ్మీ, ఖరోష్ఠీలిపులలో ముద్రించిరి. "కావిశియె నగర దేవతా" యను నొక నాణెముపై వ్రాతనుబట్టి యీకాలమున సుదూరమునం దుండిన కపిశానగరమున బ్రాకృతభాష వ్యాప్తిలో నుండెనని తెలియుచున్నది.

శకరాజులు:—వీరు యవనులను జయించి భారతదేశపశ్చిమోత్తరభాగమున కధిపతులైరి. పిమ్మట యూఏచీ తెగకు జెందిన కుషానురాజులు వీరినణచి తాము ప్రబలిరి. వారిలో నగ్రగణ్యుడగు కనిష్క చక్రవర్తి కాలమునం దిప్పటి అఫ్గనిస్థానములోని కాబూల్, కాందహార్‌లును, గాంధారమును- మధ్య అసియాలోని కాష్ఘర్, యార్ఖండ్, కోటానులును కావరకునుగల యుత్తర హిందూదేశమును గలసి యొక మహాసామ్రాజ్య మేర్పడెను. ఈసమయమునందిచట ననేకనాగరికతలు కలసినవి. కనిష్కునిచే బునరుద్ధరింపబడిన బౌద్ధమతము పశ్చిమోత్తరముగ వ్యాపించి, యటనుండి ప్రాగుత్తరముగ మధ్యఆసియాను ప్రవేశించినది. గాంధారమున నొక క్రొత్తశిల్పపద్ధతి బయల్వెడలెను. అఫ్గనిస్థానమున గనుగొనబడిన స్థూపములపై శాసనములనుండి థియోడోరస్ అను నొక యవనోద్యోగియు, వెస్‌పేసి కపిశామండలముల పాలకులునుగూడ నీకాలమున బౌద్ధులైయుండిరని తెలియుచున్నది.

దీనినుండి ప్రాచీనకాలమున భారతవర్షము సింధునదికి పశ్చిమమున, హిందూకుష్‌పర్వతముల కావలివరకునుగూడ వ్యాపించియుండెనని స్పష్టమగుచున్నది. క్రీ. శ. 11 వ శతాబ్దము వరకునుగూడ ప్రస్తుత అఫ్గనిస్థానములోని ప్రాగ్భాగమంతయు నుత్తరాపథముగనే పరిగణింపబడుచుండెడిది.

అఫ్గనిస్థానమునందలి బౌద్ధనిర్మాణములు : — ఒకరి వెంబడి నొకరుగా నేగుదెంచిన యనేక విజేతల ధాటికనోర్పగా మిగిలిన బౌద్ధశిథిలము లెన్నియో యిచ్చటగలవు. ఈవిషయమున ప్రకృత జలాలాబాద్ మైదానము ముఖ్యమైనది. దీనికిబూర్వము నగరహారమనిపేరు. ఇచ్చటి కైదుమైళ్ళదూరములోనున్న హద్ద యనుచోట నొకచక్కని స్తూపముగలదు. ఇయ్యది బుద్ధదేవుని పుఱ్ఱెయెముకపై నిర్మింపబడినది. ఇందుగాంధార

పద్ధతి శిల్పము లనేకములుకలవు, కాబూల్‌నగరముచెంత గొన్ని బౌద్ధ నగరీశిథిలములున్నవి. కపిశానగరమున కనిష్కచక్రవర్తి యాస్థానమునం దుండిన చైనారాయబారులచే నిర్మింపబడిన స్థూపమును, హ్యూన్‌స్యాంగ్ వర్ణించిన యితరకట్టడములును గనుగొనబడినవి. హిందూకుష్ పర్వత ముల నంటియున్న బమియన్‌నగరమువద్ద కొండలలోనెన్నియో విహార ములు, మహోన్నతములగు బుద్ధవిగ్రహములగు బుద్ధవిగ్రహములు నున్నవి.

తురుష్కులు:— క్రీ. శ. 5 వ శతాబ్దిలో నీభూమియంతయు హూణులకు వశమైనది. స్వపక్షపరపక్ష నిర్ధూమధాములై యీక్రూరు లిట నవనవలాడుచుండిన భారతీయనాగరికతను ధ్వంసముగావించిరి. ముఖ్య ముగ గాంధార ఉద్యానరాజ్యములకు వీరివలన గొప్పకీడుగల్గెను, 6 వ శతాబ్దమున తురుష్కులు హూణులను బారదోలి యీప్రదేశము నాక్ర మించిరి. హ్యూన్‌స్యాంగ్ కాలమున హిందూకుష్‌పర్వతములకు బశ్చిమ మున 27 చిన్నరాజ్యములుండినవి. ఈతురుష్కప్రభువులు బౌద్ధమత మును విశేషముగ నాదరించిరి. క్రీ. శ. 626 లో 'పిహూకగన్' అనునతడు చైనాదేశమున ధర్మప్రచార మొనర్పనేగుచుండిన ప్రభాకర మిత్రుని, పిమ్మట చైనానుండి భారతదేశమున కేతెంచుచుండిన హ్యూన్ స్యాంగ్‌నుగూడ మిక్కిలియాదరించెను. 7 వ శతాబ్ది మధ్యభాగమున హిందూదేశమునకువచ్చిన 'వూకుంగ్' అను నొకభిక్షువు కాశ్మీరగాంధార దేశ ములలో నొకతురుష్కరాజు నాతనిభార్యా పుత్రులును గట్టించిన దేవాలయము లనుగాంచెను. కున్‌డుజ్ అనుభాగమున జనులు విశేషముగ బౌద్ధు లైయుండిరి. బాల్ఖ్ రాష్ట్రములో 3000 మంది భిక్షువులుగల 100 విహారములికాలము నందుండెడివి. హిందూకుష్‌పర్వతములకు గొంచె ముత్తరముగ నుండిన నవసంఘారామమున గౌతమబుద్ధుని స్నానపాత్రి మును, దంతమును బదిలపరుపబడియున్నవి. బాల్ఖ్‌రాష్ట్రమునకు

రాజగృహమను నగరము రాజధానిగ నుండినది. ఇయ్యది మగధదేశము నందలి యానామముగల నగరమునకు ప్రతికృతి. గజే అను విభాగ మున పెక్కువిహారములును, స్థవిరాస్తివాదులగు 300 మంది సన్యాసులు నుండిరి. బమియుకా రాష్ట్రము మిగుల ముఖ్యమైనది ఇది లోకోత్తర వాదులగు బౌద్ధులకు స్థానము. ఇచ్చట పరినిర్వాణబుద్ధవిగ్రహ ముండి నది. కపిశారాజ్యమున మహాయానశాఖీయు లుండిరి. క్షత్రియుడగు నిపటిరాజు లంపాక, నగరహార, గాంధారములపైగూడ నధికారమును నెరపుచుండెను. 'ఈత్‌సింగ్' అను మఱియొక చైనాయాత్రికు డీ బళ్ళి మోత్తరభాగములనుండి యనేకు లార్యావర్తమునందలి పుణ్యక్షేత్రముల కేగుచుండిరని వ్రాసియున్నాడు. బుద్ధగయలో సమర్‌కండ్, టొఖరిస్థాన ము, కపిశాయున్నగు దేశముల ప్రజలు దమ దేశీయులగు యాత్రికులసౌక ర్యములకై వసతులను గట్టించిరట.

క్రీ. శ. 7 వ శతాబ్దినాటికి యీఅఫ్గనిస్థాన ప్రాంతమున బౌద్ధ మతమేగాక నితరమతములుగూడ వ్యాపించినవి వీనిలో శైవమతము ముఖ్యమైనది. గాంధారదేశమున దొరికిన యొక ఖరోష్ఠీశాసనమునుండి యచ్చట దుమజుని పుత్రుడగు మొయికుడను నతడు కుషాణరాజగు వెంఢవకాడ్ ఫెసెస్ కాలమునందొక శివాలయమునకు దాన మొసంగెనని తెలియుచున్నది. ఈకుషాణరాజు నాణెములపై నొకవైపున శివుని ప్రతిమ గలదు 'బౌద్ధమతద్వేషి యగు మిహిరగులుడు శైవమునెడ నాదరమును జూపెను. కాన హ్యూయాన్‌ష్వాంగ్ కపిశారాజ్యమున పెక్కుబ్రాహ్మణదేవాలయ ములను, పాశుపత, కాపాలిక శైవులను గాంచెను. ఇట్టియాలయములు లంపాక, నగరహార, జౌగుడ, అంతరాబ్ మున్నగు రాష్ట్రములలోగూడ నుండెడివి.

ఇస్లాము విజృంభణము:— 7 వ శతాబ్దిలో అఫ్గనిస్థానమును చైనాటిబెట్‌దేశీయులును, మహమ్మదీయులగు నరబ్బులును వరుసగా

జయించిరి. క్రీ. శ. 663లో నిఇస్లామమతస్థులు సుప్రసిద్ధమగు నవ విహారసంఘారామమును నాశమొనర్చి కాబూల్‌ను బాల్ ఖ్‌ను వశపరచు కొనిరి. 8 వ శతాబ్దమున సి చంద్రధ్వజులు బెలూచిస్థానమును జయించి పంజాబులోని ముల్తానువరకును విజృభించిరి. అనతికాలమునకే బమియణ రాజ్యమును మహమ్మదీయమతము నవలంబించెను. ఈదేశమిట్టి విప్లవము లకులోనైనను భారతీయ నాగరికత యిట బూర్తిగా నశింపలేదు. క్రీ శ. 753 లో గాంధారమున సుఖావతి పద్మావతియను రెండువిహారము లుద్యా ననగరమునం దుండినవి. క్రీ. శ. 785-810 ల మధ్య కుభా (కాబూల్) నగరవాసియగు ప్రజ్ఞాడను శ్రమణుడు కొన్నిబౌద్ధగ్రంథములను చైనాభాష లోనికి తర్జుమాచేసెను. నగరహారమునందలి యొక బ్రాహ్మణకుటుంబము నకు జెందిన వీరదేవుడనుభిక్షువు మహాబోధియాత్రనుజేసి పిమ్మట వంగ రాజగు దేవపాలునిచే నాలందా విద్యాపీఠమున కధ్యక్షుడుగ నియమింప బడెను.

9 వ శతాబ్దిలో పర్షియాదేశమునుండి మఱియొక మహమ్మదీయ విజయతరంగ మేతెంచి ఆఫ్గనిస్థానము నంతటిని గలంచివైచెను. క్రీ. శ. 870 ప్రాంతమున కాబూల్‌రాజ్యమును తురుష్కజాతికి జెందిన షాహియ వంశీయు లేలుచుండిరి. వీరు బౌద్ధులు. ఇందు కడపటిరాజును తుద ముట్టించి యాతని మంత్రియగు 'లల్లియ' యనునతడు రాజ్యమును వశ వశపరుచుకొనెను ఈ లల్లియకు నీతని నలతతివారికిని " ఒహింద్‌నగర్ హిందూషాహియు"లని పేరు. దక్షిణహిందూ దేశమునందలి విజయనగర రాజులవలె నీవంశపు రాజులు హిందూమతోద్ధరణ దీక్షితులై మహమ్మదీయుల తోబోరి తుదకు దమసర్వస్వమును గోల్పోయిరి. లల్లియ సింహవ్యాఘ్రములు బోలు దరదతురుష్కరాజ్యముల మధ్యనుండిన తన రాజ్యమును కడునిపుణ తతో గాపాడుకొనెను. గాంధారము, ఉద్యానము, పంజాబులోని గొంత

భాగము నిందు చేరియుండినవి, ఈవంశీయులలో కడపటివారికి గజినీ సుల్తానులతో పోరాటము సంభవించినది. వీరిలో జయపాలుని పుత్రుడగు అనందపాలుడు వ్యాకరణశాస్త్రము నాదరించెను, శత్రువగు గజనీ మహమ్మదునెడ నీహిందూరాజు విశేషమగు దయ్యనుజూపెనట. అనందపాలుని పుత్రుడగు త్రిలోచనపాలుడు తౌషినదీతీరమున మహమ్మదుతో నొక ఘోర యుద్ధ మొనర్చెను. ఇందు విజయలక్ష్మి మహమ్మదీయులనే వరించెను తళ్ళి కోటయుద్ధానంతరము విజయనగరమువలె నీహిందూషాహియుల రాజధానియగు ఉదభాండపురము మహమ్మదీయులచే నాశమొనర్పబడెను. మిగిలినరాజ్యమంతయు వారికి సులభముగ వశమయ్యెను. ఇంతటితో ఆఫ్గనిస్థానమందలి భారతీయనాగరికతా విస్తరణచరిత్ర మంతమగు చున్నది.

# భారతీయ నాగరికతా విస్తరణము.

## IV. మధ్య ఆసియా.

భారతీయ నాగరీకత ప్రాచీనకాలమునం దనేక దేశములకు విస్తరించినది. అందొకశాఖ సింధునదీతీరమునుండి ప్రకృత అఫ్గనిస్థానము మీదుగా మధ్యఆసియాకేగి, యచటనుండి చైనాదేశమును జేరినది, ఇటీవలి యాత్రాపరిశోధనలచే మధ్యఆసియాలోని భారతీయనాగరకతా విస్తరణమును గూర్చి విశేషాంశములు దెలియనగుచున్నవి. ఈభాగమునకిపుడు "చైనీస్ టర్కీస్తాన్" అని పేరు. దీనికుత్తరమున చెన్‌షాన్ పర్వతములును, దక్షిణమున కున్‌లున్ పర్వతములును, పశ్చిమమున పామిర్ పర్వతములును, దూర్పున నాన్‌షాన్ పర్వతములును గలవు. అనగా నీభూభాగము టిబెట్ కుత్తరమునను, చైనాకు బశ్చిమముగను, కాశ్మీరమునకు బ్రాగుత్తరముగ నుండును. ఇయ్యది బూర్వపశ్చిమముగ 1500 మైళ్లదూరమును, ఉత్తరదక్షిణముగ 600 మైళ్లదూరమును వ్యాపించియుండును. ఇందలి విశేషభాగము పర్వతములతోడను, యెడారులతోడను నిండియున్నది. అయిన నీప్రదేశము ప్రాక్పశ్చిమనాగరీకతలను సంగమస్థానముగ నుండెను. చైనానుండి పశ్చిమమునకేగు మార్గములు మధ్యఆసియామీదుగనే పోవుచుండెడివి. హ్యూన్‌త్సాంగ్, ఫాహియన్ మున్నగు విదేశయాత్రికు లీదేశముమీదుగనే భారతదేశమున కేతెంచిరి.

ఈమధ్యఆసియాకును హిందూదేశమునకును గల చరిత్రాత్మకమగు సంబంధమును వర్ణించుటకు బూర్వమీప్రదేశమును బరిశీలించుటకై

బండితులొనర్చిన పరిశ్రమను దానిఫలితమును సంగ్రహముగ బరీక్షింప వలసియున్నది. 1879 సంవత్సరమున రిగెల్ అనునొక జర్మనీదేశపువృక్ష శాస్త్రజ్ఞుడు మధ్యఆసియా కేగెను. అతని నివేదికలనుండి ఈభాగమున ప్రాచీనశిథిలములు లభించుననెడియాశ బయల్వెడలినది. 1890లోకల్నల్ బవర్ అనునత డిచ్చట భూర్జపత్రములపై లిఖింపబడిన యొక వైద్యగ్రంథ మును సంపాదించెను. క్రీ. శ. 4వ శతాబ్దమునాటి యాగ్రంథము దొరుకుట తోడనే హైందవ విజ్ఞాన పరిశోధకులలో నూతనోత్సాహ ముదయించెను. క్రీ. శ. 1892 లో నొక ఫ్రెంచిదేశీయుడు గోశృంగవిహార మనుచోట ఖరోష్ఠి లిపిలో వ్రాయబడిన క్రీ. శ. 2వ శతాబ్దినాటివగు ప్రాకృతధర్మపదమును సంపాదించెను. క్రీ. శ. 1901లో ఇండియాప్రభుత్వమువారు సర్. ఆరల్ స్టెయిన్ అను నతనిని మధ్యఆసియాకు బంపిరి. ఈతడిచ్చట నమూల్యము లగు శిథిలములను, చారిత్రక విషయములను గనిపెట్టి ప్రపంచమునకు క్రొత్తవింతల నెన్నిటినో దెలియజేసెను. క్రీ. శ. 1902-1906ల నడుమ జర్మనులుగొందరు మధ్యఆసియాలో బరిశోధన మొనర్చి బౌద్ధశిల్పములను, సంస్కృత చైనా సిరియను సోగ్డియను భాషలలో లిఖింపబడిన గ్రంథము లను గన్గొనిరి. క్రీ. శ. 1906 లో రెండవతూరి స్టెయిన్ యాప్రదేశమునకు యాత్రచేసి "వేయిమందిబుద్ధులగుహ" ( Grottos of the Thosand Buddhas) లని పిలువబడు బౌద్ధవిహారములను, వానిలో క్రీ. శ. 11 వ శతాబ్దమునుండియు పదిలపరుపబడి యుండిన యొక బౌద్ధగ్రంథాలయము ను గనుగొనెను. ఇచ్చట గాంధారమునందలి కళనుబోలు శిల్పచిత్రలేఖనా కళలగూడ నుండినవి. పిమ్మట రష్యా, ఫ్రాన్సుదేశీయులుగూడ నీమధ్య ఆసియా బరిశోధనలలో బాల్గొనిరి. ఈపరిశోధనలనుండి యాప్రాంతమున భారతీయములగు బ్రాహ్మీఖరోష్ఠిలిపులును, ఒకతరగతి ప్రాకృతభాషయు, బౌద్ధమతమును, వ్యాప్తిలో నుండెడివని స్పష్టమగుచున్నది.

మధ్య అసియాయందలి భారతీయనాగరికతా చరిత్రమును రచించుటకు దగిన యాధారము లింకను లభింపవలసియున్నవి. అయినను పరిశోధకుల కీప్రదేశమున దొరకిన వివిధవస్తువులనుండి యాప్రదేశములపై హిందూదేశము దన ప్రభావమును జూపినవిధమునుగూర్చి కొన్ని విశేషాంతములుదెలియుచున్నవి. కాన నీవస్తువులను క్లుప్తముగా వర్ణింపవలసియున్నది.

(1) ప్రాకృతధర్మపదము:— ఇయ్యది బెరడును లేఖ నాయోగ్యముగ నొనర్చి దానిపై వ్రాసిన గ్రంథము. దీనిని క్రీ. శ. 1892లో నిప్పటి కోటానుకు సమీపమునందున్న గోశృంగవిహారమను గుహలో నొక ఫ్రెంచి దేశీయుడు గనుగొనెను. క్రీ. శ. 3,4 శతాబ్దములవరకును బశ్చిమోత్తర భారతదేశమున వ్యాప్తిలోనుండిన ఖరోష్ఠిలిపిలో నీగ్రంథము వ్రాయబడియున్నది. అక్షరవిన్యాసమునుబట్టి పండితు లీగ్రంథము క్రీ. శ. 2 వ శతాబ్దినాటిదని నిర్ణయించినారు. ఇందలి ప్రాకృతభాష నూతనము. ఇంతవరకును పరిశోధకులకు పాళీసంస్కృతభాషలలో మాత్రమే ధమ్మ పదము లభించియున్నది.

(2) ఖరోష్ఠి ఫలకములు:—మధ్యఆసియాలోని శిథిలములలో నెన్నియోవారుఫలకములు దొరికినవి. వీనిలో కొన్ని వలయాకారములు. మఱికొన్ని చతురస్రములు. ఇందుమొదటివానికి 'కీలముద్ర' లనిపేరు. 7 మొదలు 15 అంగుళములవరకును పొడవుగల రెండుఫలకములు ఒకదారముచే కట్టబడి, పైఫలకమునం దొక మట్టిముద్ర వేయబడియున్నది ఇందు "మహానుభావ, మహారాజ" యని పిలువబడు రాజు, కొన్నివ్యవహారములను బరిష్కరించునెడ స్థానికోద్యోగుల కిచ్చిన యాజ్ఞలు లిఖింపబడినవి. పరిపాలనావత్సరమును, అజ్ఞను నిర్వహింపవలసిన యుద్యోగి నామమునుగూడ నిందుగలవు. చతురస్రములగు ఫలకములు సుమా రొక గజమువరకును గూడ నిడివిగలవై యున్నవి. వీటికిని మృణ్ముద్రగలదు. ఇందొక తరగతి

ఫలకము లుద్యోగుల కొసగబడు నాజ్ఞలనుదెల్పునవిగ నున్నవి. మఱికొన్ని ప్రజలు దమలోదాము జేసికొనిన యొడంబడికలను దెల్పుచున్నవి. వీనిలో సంవత్సరము లీయబడినవి.

(3) చర్మలేఖలు:— మధ్యఆసియాలో నీకాలమున చర్మములు గూడ వ్రాయుటకై యుపయోగింపడు చుండెడివి. ఈసందర్భమునం దుప యోగింపబడిన కఱ్ఱకలములును సిరాపాత్రములు నెన్నియో గనుగొన బడి నవి. ఈచర్మలేఖలలో రెండుతరగతు లున్నవి. కొన్ని యున్నతోద్యోగుల సామంతులకు వ్రాసినవి. రెండవ తరగతివానికి "వింనదిలేఖ "లని పేరు. ఇయ్యవి సాధారణముగ రాజుచే వ్రాయబడినవి. వీనిలో సంవత్సరములు గాక మాసములును రోజులును ఉదహరింపబడియున్నవి.

(4) కాగితపు టుత్తరములు:— ఇవి కొలదిగ మాత్రము లభిం చినవి. ఇందలిభాష ప్రాకృతము. లిపి ఖరోష్ఠి

(5) పట్టువస్త్రములపైలేఖలు:—క్రీ. శ. 105 నుండియుచైనాలో పట్టుగుడ్డలను వ్రాయుటకై యుపయోగించుచుండిరి. లేఖలు ప్రాకృత భాషలో ఖరోష్ఠిలిపిలోనున్నవి. ఇందు చాలవరకును సాధారణలేఖలు. కొన్నిదేవాలయములపై నుండెడి జండాలు. ఒకలేఖలో నొకడు తనయాప్తు నియారోగ్యమునకై గావించిన ప్రార్థనగలదు. ఇందు "అరుఘ దచిన ఏ భవదు" (ఆరోగ్యదక్షిణాయై భవతు) అని వ్రాయబడియున్నది. ఇట్టివాక్య ము హిందూదేశములోని కుషాణరాజుల శాసనములలోగూడ గలదు.

ఇటుపై నచ్చటనే దొరకిన బ్రాహ్మీలిఖితవస్తువులను వర్ణింపవలసి యున్నది. బ్రాహ్మీలిపి భారతదేశమునం దెక్కుడు వ్యాప్తినిజెంది యాధునిక లిపుల కెన్నిటికో మాతృకగ నున్నది. భారతీయనాగరికతతోబాటుగ నీలిపి గూడ విదేశములకేగినది. దీనిలో వ్రాయబడిన గ్రంథములెన్నియో మధ్య

ఆసియాలో దొరికినవి. ఈగ్రంథములన్నియు సంస్కృతభాషలోనివే. ఇందు మూడు రకముల లిపి గలదు. మొదటిది కుషాణ, గుప్తవంశీయుల కాలము నందుండిన పరిశుద్ధమగు భారతీయ లిపి. అశ్వఘోషుని నాటకములును, కుమారలాతుని కల్పనామణ్డితికా యను గ్రంథము నీలిపిలో రచింపబడి నవే. రెండవది ఏటవాలుగానుండు గుప్తలిపి, (Slanting Gupta Script) కుచ, టర్ఫణ మున్నగుచోటుల దొరికిన గ్రంథము లీలిపిలోనివే మూడవది ఋజుగుప్తలిపి. (Upright Gupta Script) కోటాణ దేశము లోని సంస్కృతగ్రంథము లీలిపిలోనివి. ఈవివిధ లిపులలోనివై మధ్యఆసియాలో దొరికిన సంస్కృత లిఖితగ్రంథములలో నారుమాత్రము ముఖ్యము లైనవి.

(1) అశ్వఘోషుని నాటకములు:— ఇంతవరకును మహాయాన బౌద్ధమతమునకు మూలస్తంభముగనొప్పు నీమహా విద్వాంసుడు బుద్ధచరిత్ర సుందరానందాది కావ్యములను, తత్త్వగ్రంథములను రచించెనని మనకు దెలియును, కాని యీమధ్య ఆసియాపరిశోధనల మూలమున నీత డొక గొప్పనాటక రచయిత యనువిషయము బయల్పడినది. ఈదొరికిన నాటకములలో "శారిపుత్ర ప్రకరణ" మనునది మొదటిది. వినయపిటకము నందలి మహావగ్గమునుండి యిందలి కథాభాగము గైకొనబడినది. ఇందు బుద్ధుడు, శారిపుత్రుడు, మౌద్గలాయనుడు" కౌండిన్యుడు ననువారలు ముఖ్యపాత్రులు రెండవనాటకము నైతికము. ప్రబోధచంద్రోదయము నందువలె దీనిలో బుద్ధి,ధృతి, కీర్తి యనుపాత్రలు బౌద్ధధర్మమును బోధించుచున్నవి. మూడవదానిలో మొదటినాటకములోని పాత్రలేగాక నొక యోగి, యొకబ్రాహ్మణుడు, నొక విదూషకుడునుగూడ గలరు. ఇందలి రంగములు మగధరాజ్య కేంద్రమగు రాజగృహములో స్థాపింపబడినవి. ఇందు పాత్రోచితముగ సంస్కృత ప్రాకృతభాషలు నుపయోగింప బడి యున్నవి.

(2) ఉదనవగ్గము:— ఈగ్రంథముయొక్క భాగములు వివిధ స్థలములలో దొరికినవి. చెట్లబెరడుతో తయారుచేసిన పుటలపై మసితో వెడల్పగు కలముతో నీగ్రంధము లిఖింపబడినది. లిపినిబట్టి యియ్యది క్రీ.శ. 2వ శతాబ్దమునాటిదిగ గన్పట్టుచున్నది. ఇయ్యది బౌద్ధులలో సర్వాస్తివాదులకు ముఖ్యగ్రంధము. ముప్పదిమూడు ప్రకరణములుగల యీ గ్రంథములో 1000 శ్లోకములుగలవు. ధర్మత్రాతయను నత డీగ్రంథమును రచించెను, ప్రకరణ పదమను గ్రంథమును రచించి, కనిష్కునిచే గావింపబడిన బౌద్ధసంఘ సమావేశమున కధ్యక్షుడుగ నుండిన వసుమిత్రుని కితడు మేనమామ. ఉదనవగ్గము మిగుల ముఖ్యమగు గ్రంథమగుటచే దానిపై నెన్నియో వ్యాఖ్యానములును భాషాంతరీకరణములును బయల్వెడలినవి,

(3) కల్పనామండితిక:— కుమారలాతుడు దీనిని రచించెను. ఇయ్యది దుబ్బుకలముతో తాళపత్రములపై లిఖింపబడినది. ఇయ్యది క్రీ. శ. 300 ప్రాంతమున పశ్చిమోత్తర భారత దేశమున నిర్మింపబడి పిమ్మట మధ్యఆసియాకు గొనిపోబడెనని పండితుల యభిప్రాయము.

(4) బవర్‌గ్రంథము:— దీనిలో ఏడు చిన్న చిన్న గ్రంథము లున్నవి. ఇందు మూడు వైద్యశాస్త్రమునకు సంబంధించినవి. వీనిలో నుల్లిపాయవలన నెన్నియోరోగములు కుదురుననియు, పూర్ణాయుర్దాయము గల్గుననియు వ్రాయబడియున్నది. జీర్ణపద్ధతి, మూలికలు, కషాయములు, అంజనములు మున్నగువాని ప్రశంస యిందు గలదు, మఱియొక ఖండములో 14 వైద్యయోగములు గలవు. ఈగ్రంథభాగములలో ముఖ్యమైనది "నవనీతకము". అగ్నివేష, భేద, హారీత, జాతుకర్ణ, క్షారపాణి, పరాశరాది వైద్యశాస్త్రజ్ఞుల గ్రంథములందలి సారాంశ మీనవనీతకమున గలదు. భస్మ,

త్తెల, కషాయ' లేపన, లేహ్యాదుల ప్రశంస యిందున్నది. ఇయ్యది సంస్కృత భాషలో శ్లోకరూపము లిఖింపబడినది.

(5) భిక్షుణీప్రతిమోక్ష:— ఇయ్యది సర్వాస్తివాద బౌద్ధుల ముఖ్య గ్రంథములలో నొకటి.

(6) భిక్షుప్రతిమోక్ష:— ఇదియును సర్వాస్తివాదులకు ముఖ్యమైనదే. క్రీ. శ. 5వ శతాబ్దములో కుమారవిజయుడు దీనిని చైనాభాషలోనికి పరివర్తించెను.

# భారతీయ నాగరికతా విస్తరణము.

## V చైనా దేశము.

### ప్రాచీన సంబంధము

చైనాదేశము సంస్కృతవాఙ్మయమున 'శీనా' యని పేర్కొన బడి యున్నది. ఆదేశమునందలి భూస్వాములయొక్క 'మండరిన్' అను నామము సంస్కృతమునందలి 'మంత్రిన్' శబ్దభవము. క్రీ. పూ. 218లో అశోకచ్రకర్తిచే బంపబడిన పదునెన్మండుగురు బౌద్ధభిక్షువులు చైనాదేశపు రాజధాని కేగిరి. క్రీ. పూ. 2 వ శతాబ్దిలో చైనాదేమున 'హ్యాన్' (Han) వంశము ప్రాముఖ్యతనందెను. ఈకాలమున చైనాకు పశ్చిమమున హూణులు, యూఎచీలునుండిరి. వీరివలన తనదేశమున కుపద్రవము గలుగకుండు నటులొనర్చుకై 'వూ' యను హ్యాన్ చక్రవర్తియొక సేనానాయకుని బశ్చిమమున కంపెను. ఈతడు 12 సంవత్సరముల కాలము తిరిగి ఫెర్ఘానా, పార్థియా, బాక్ట్రియామున్నగు నెన్నియో దేశములను జూచి చక్రవర్తికి నివేదించెను. బాక్ట్రియాలోనుండగా నాతడు చైనాలోని దక్షిణభాగమునుండి బాక్ట్రియామీదుగను "సింధు" (హిందూ) దేశముమీదుగా అఫ్గనిస్థానమునకు వర్తక మార్గములుండుట గాంచెను. ఈవార్తను వినినపిమ్మట చైనాచక్రవర్తి హూణులను దళిమి వారిదేశమును జయించి, దక్షిణమునుండి హిందూదేశమున కొకమార్గము నేర్పరుప బ్రయత్నించెను. క్రీ.శ. 73లో చైనాదేశీయులు ఫెర్గానానుజయించి, కుచాయనుచోట నొక రాజప్రతినిధిని నెలకొల్పిరి. ఇందుమూలమున చైనానుండి ఇండియాకు పోవుమార్గము సురక్షితముగ నుండినది.

బౌద్ధమతము క్రీస్తుశకమునకు బూర్వమే చైనాను ప్రవేశించెను. క్రీ. పూ. 218 లో అశోకుడు భిక్షువుల నంపెను. క్రీ. పూ. 121 లో క్యూపెన్‌గన్ అనుసేనాని హూణులతో యుద్ధముజేయునపు డొక బంగారపు బుద్ధవిగ్రహమును సంపాదించెను. క్రీ. శ. 68 లో నెక హ్యాంగ్ చక్రవర్తి బౌద్ధులను గొనితెచ్చుటకై యనుచరులనంపగా వారు హిందూదేశమునుండి కశ్యపమతంగ; ధర్మరత్న యనువారలను రాజధానికి గొనిపోయిరి. ఇదేసమయమున బాక్ట్రియను రాజులవద్దనుండి యొక రాయబారి బౌద్ధగ్రంథము నొకదానిని చైనాకు దెచ్చెను.

## మా ర్గ ము లు

పూర్వకాలమున నేటివలె హిందూదేశము చైనాదేశపు దక్షిణపశ్చిమ సరిహద్దువరకును వ్యాపించియుండలేదు. ఈరెండుదేశములకును నడుమ నెన్నియోరాజ్యము లుండెడివి. భారతీయ బౌద్ధమతము చైనాదేశమున వ్యాపించుట కీమధ్యనుండిన చిన్నచిన్నరాజ్యములు విశేషముగ దోడ్పడినవి. గాన వీనిమధ్యనుండి యాకాలమున హిందూచైనాదేశములకుగల మార్గములను గుర్తింపవలసియున్నది. ఇట్టివి నాలుగుమార్గము లుండెడివి.

(1) టర్కీస్థానమార్గము:— చైనాలోని లాబ్‌నార్ సరస్సునకు పశ్చిమమునను, హిందూదేశములోని కాశ్మీరమున కుత్తరమునగల హిమాలయములకు పైనున్న పామీర్ పర్వతములకు దూర్పునను, టిబెట్‌దేశమున కుత్తరమునను, టారిమ్‌మైదానము గలదు. ఈ మైదానమున క్రీ. పూ. 2వ శతాబ్దమున 36 చిన్నరాజ్యము లుండెడివి. కాంక్సు రాజ్యములోనిటుఎంగ్ హోంగ్ అనుపట్టణమునుండి టారిమ్‌మైదానముమీదుగా పశ్చిమమునకు రెండుమార్గములుండెడివి. పురుషపురము (Peshawar) వలెనే క్రీస్తుశకారంభమునం దీ నగరమనేక జాతులవారి నాకర్షించి వివిధనాగరికతలను మేళవించినది. 3 వ శతాబ్దమునం దిచ్చట భారతీయులు గొందరు స్థిర

పడిరి. చైనాలో 'వెయ్' వంశీయులుపాలించుకాలమునం దీనగరమున బారతదేశబౌద్ధమతము ప్రబలినది. చుట్టుపట్లనుండు కొండలలో గుహలను దొల్చి శిల్పులు వేయి బౌద్ధాలయములను నిర్మించిరి. ఇటీవల బరిశోధకులు వీనిని దెఱచి యాశిల్పములను, కుచియను, కోటానీ, సిరియను, టిబెటను సంస్కృతభాషలలో లిఖింపబడిన గ్రంథములను, గన్గొనిరి. టుఎన్ హుఙగ్ నగరమునుండి యొకదారి లాబ్‌నార్ సరస్సునకు దక్షిణమునగల షాఙషాఙకేగి యటనుండి టారిం నదీతీరముననునరించి యార్ ఖండ్ కును, అటుపై పామిర్ పర్వతములను దాటి బాల్ ఖ్, పార్థియామొదలగు టుర్కీస్థానదేశములకు నేగుచుండెను. మఱియొకదారి టారింనదీతీరము ననుసరించి ఖోటానుకు పోయి, పామిర్ పర్వతములనుదాటి, సమర్‌కండ్ మీదుగాబశ్చిమమునకు బోవుచుండెను. క్రీ. శ. 4 వ శతాబ్దమున హిందూ దేశమునకు వచ్చిన ఫాహియాన్ అను చైనాదేశయాత్రికుడు టుఎన్ హెూఙగ్ నుండి టారింమార్గమున కరషన్, ఖోటాన్ కాష్‌ఘర్‌లమీదుగా నచ్చి పర్వతములను దాటి గిల్‌గిట్ నదీతీరము ననుసరించి సింధుప్రాంతమును జేరెను. 7 వ శతాబ్దమున హ్యూఙష్వాంగ్ అనునతడుగూడ చైనాలోని టుఎఙహుఙగ్ నుండి బయలుదేరి కరషర్, కుచమీదుగానేగి బెడల్‌కను మగుండా ఇస్సికుల్ నదిని చేరెను. ఇంతకుపూర్వము నాలందానుండి ప్రభాకరమిత్రుడనుభిక్షువుయిటకు వచ్చి, కొంతకాలమునకు బిమ్మట చైనా కేగియుండెను. ఈ యాత్రికు డిటనుండి సోగ్డియాకేగి యటనుండి కపిశకు బోయి, హిందూకుష్ పర్వతమును దాటి హిందూదేశమును బ్రవేశించెను.

(2) అస్సాం మార్గము:- అస్సాం, ఉత్తరబర్మాలమీదుగా హిందూ దేశమునుండి దక్షిణచైనాకు మఱియొకమార్గముండెడిది. కాని యిందు దుర్గమములగు పర్వతములును' క్రూరజంతువులును, క్రూరతములగు నడవిజాతివారు నుండుటచే నీమార్గము బ్రసిద్ధికెక్కియుండలేదు. క్రీ. శ. 7వ శతాబ్దిలో హ్యూన్‌ష్వాంగ్ కామరూపము (Assam) లో నుండుగా

618 లో చైనాదేశమున గల్పింపబడిన యొకబాట 638 నాటికి అస్సాంకు వ్యాపించెననియు, నాదేశమునుండి దక్షిణచైనాకు రెండునెలలలో గొనిపోవు మార్గమొకటిగలదనియు వినెను. కియటన్ అను 8వ శతాబ్దపు చైనాగ్రంథమునుండి యీ మార్గమునుగూర్చి కొన్నివివరములు తెలియుచున్నవి. ఇయ్యది చైనాకు దక్షిణమునందున్న టాన్‌కిన్‌నుండి బయలుదేరి యూనన్ చేరి, యటనుండి పశ్చిమముగనేగి, సలోఎన్ నదిని దాటి చౌకొలీన్‌గ్‌కు పోవుచుండెను. ఇది యొక ముఖ్యస్థానము. ఇటనుండి యీదారి రెండు శాఖలయ్యెను. ఒకశాఖ యిచ్చటనుండి బర్మాలోని మాంఏలేకేగి, పేగన్ ప్రోంలమీదుగా అరకన్‌పర్వతములనుదాటి అస్సాము బ్రవేశించుచుండెను. రెండవశాఖ దక్షిణముగా ఐరావతీముఖద్వారమువరకునేగి పిమ్మట అస్సాముకు బోవుచుండెను.

(3) టిబెట్‌మార్గము :- క్రీ. శ. 7వ శతాబ్దములో ఇండియానుండి చైనాకు మరియొకమార్గము నిర్మింపబడెను. అప్పటి టిబెట్‌రాజగు స్ట్రాంగ్ ట్సన్ గంపో యనునతడు చైనారాజపుత్రికను బెండ్లియాడుటచే హిందూ చైనాదేశములకు దరచు రాకపోకలు జరుగుచుండెడివి. క్రీ. శ. 627 లో ప్రభాకరమిత్రుడను నాలందావిద్యాపీఠ పండితుడు టిబెట్‌మార్గమున చైనాకేగి యచ్చట బౌద్ధమతమును వ్యాపింపజేసెను. అదేసంవత్సరమున హ్యూన్‌ఖౌ అను చైనాశ్రమణుడొక డీమార్గముననే భారతదేశమునకు వచ్చెను. చక్రవర్తి శ్రీహర్షుని రాజ్యకాలమునం దీదేశమునకేతెంచిన హ్యూన్ ష్వాంగ్‌కూడ నీమార్గముననే యనుసరించెను. ఆచక్రవర్తి యనంతర మిదే మార్గమున వచ్చి టిబెట్ నేపాళదేశముల సేనలు హిందూదేశమున విజయములను గాంచినవి. కాని 650 లో 'గంపో' చనిపోయినపిమ్మట టిబెట్ చైనాదేశములకు నిరంతరశాత్రవ మేర్పడుటచే నీమార్గము కట్టుపడెను.

(4) సముద్రమార్గము :- క్రీ. శ. మొదటిశతాబ్దమునుండియు చైనా హిందూదేశములకు రాకపోకలు జరుగుచుండెడివి. చైనాదేశీయుల గ్రంథ

ములలో నాకాలమున కౌండిన్యుడను హిందూబ్రాహ్మణుడు ఇండోచైనాలోని 'ఫౌనన్, (Faunan) దేశమునకేగి, యచ్చట రాణిని వశపరచుకొని పెండ్లియాడెనని యున్నది. అంతటినుండియునీ ప్రదేశమొక హిందూరాజ్యమయ్యెను. చైనాదేశచరిత్రకారు లీవిషయము క్రీ. శ. 1 వ శతాబ్దములో జరిగెనని వ్రాసియున్నారు. ఈ కాలమున హిందూదేశమునందలి భరుకచ్ఛమను రేవుపట్టణమునుండి చైనాలోని 'టాన్కిన్, నగరమునకు సముద్రమార్గమున వర్తకము జరుగుచుండెడిది. 2 వ శతాబ్దిలో ఇప్పటి అన్నాందేశమున 'చంపా, యను మరియొక హిందూరాజ్యము స్థాపింపబడినది. మరునటిశతాబ్దిలో భారత దేశమునందలి మురుండ రాజునకును చైనాకును రాయబారములు జరగినవి. 5 వ శతాబ్దిలో ఫాహియన్ హిందూదేశమునకు వచ్చునప్పటికి తామ్రలిప్తినగరము గొప్ప నౌకావాణిజ్యకేంద్రముగ నుండి చైనాతో వర్తకము జరపుచుండెను. ఇచటినుండి గుణవర్మ, పరమార్థుడు, మున్నగువారెందరో మతప్రచారమునకై హిందూచైనాదేశములకు తరచు ప్రయాణము జేయుచుండిరి.

## నాగరికతా విస్తారకులు.

ఇంతవరకును భారతదేశమునకును చైనాకును ప్రాచీనకాలమున సన్నిహితసంబంధముండెడిదనియు, నీదేశములమధ్య ననేక మార్గములుండెడివనియు నిరూపించియుంటిమి. అనేక సమయములలో ననేకజాతులవారలు భారతీయనాగరికతను చైనాదేశమున విస్తరింపజేసిరి. ఇటుపైనినాగరికతా ప్రచారముయొక్క చరిత్రము వివరింపబడును.

మధ్యఆసియా జాతులు .- [1] ఇండోసిథియనులు-చైనాదేశీయులు హూణుల బాధపడజాలక దమకు బశ్చిమమునుండి యాశత్రువులను ద్రొక్కిపెట్టగల యొక రాజ్యముతో స్నేహము జేసికొనుటకై యత్నించిరి. ఈ సిథియనుల రాజ్య మట్టిది. క్రీ. శ. 1 వ శదాబిలో నీరెండురాజ్యముల

కును సంబంధ మేర్పడెను. క్రీ. పూ. 21 వ శతాబ్దములో సిసిథియను రాజు చైనా చక్రవర్తి కొక బౌద్ధగ్రంథము నంపెను. ఇదియే యాదేశపు బౌద్ధమతపరిచయము నకు ప్రారంభము. క్రీ. శ. 1 వ శతాబ్దిలో సిథియనులు హిందూదేశమును జయించి, పంజాబునుండి బఖ్ఖిమోత్తరమున ఆక్సస్ నదీతీరమువరకునుగల భూభాగమునం దొక సామ్రాజ్యమును నిర్మించిరి. మధ్యఆసియాలో వీరికిని చైనాకును సరిహద్దుల విషయమున సంఘర్షణ మొదవినది. ఈ సన్నిహితత్వమువలన భారతీయ నాగరికత సథియను సామ్రాజ్యముగుండ చైనాకువిస్తరించుట కవకాశమేర్పడెను. ఇండోసిథియను భిక్షువు లనేకులు చైనాలో బౌద్ధమతమును ప్రచారము చేసిరి. క్రీ.శ. 68లో కశ్యప మతంగ ధర్మ రక్షయను వార లీకార్యమును నిర్వర్తించిరి. క్రీ. శ. 147 లో లోకక్షేముడను నొక విద్వాంసుడు చైనా కేగి మహాయాన గ్రంథముల నెన్నిటినో యాదేశభాషలోనికి బరివర్తించెను. దీచ్చొకియఙా అను నొక సిథియను భిక్షువు క్రీ. శ. 100 లో చైనాదేశమునకు బోయి యట నూరు బౌద్ధగ్రంథములను భాషాంతరీకరించి, దక్షిణచైనాలో బౌద్ధమతమును విశేషముగ విస్తరించెను ఈ మతప్రచారకులలో నెల్ల క్రీ. శ. 3 వ శతాబ్ది నాటి ధర్మరక్షుడను భిక్షువగ్రగణ్యుడు. ఈతడు పెక్కుభాషలను నేర్చెను. హిందూ విద్వాంసునివద్ద విద్యనభ్యసించెను. బహుభాషావిదుడగు నీభిక్షువు 284-313 ల నడుమ రెండువందల సంస్కృతగ్రంథములను చైనాభాషలోనికి బరివర్తించెను. [2] పార్థియనులు :- క్రీ. శ. 2 వ శతాబ్దమున పార్థియను రాజగు మొదటి మిత్రిడేటిస్ తన రాజ్యమును హిందూదేశము నందలి జీలంనదివరకును వ్యాపింపజేసెను. అంతటినుండియు నీరెండు దేశములకును సంబంధము గలిగినది. అందుమూలమున పార్థియనులు బౌదతత్త్వమును గ్రహింపగలిగిరి. క్రీ. శ. 138 లో నొక పార్థియనురాజు రాజ్యమును త్యజించి కొన్ని బౌద్ధగ్రంథములతో చైనాదేశమున కేగి, యచ్చట విశేషముగ బరిశ్రమచేసి, బౌద్ధగ్రంథభాషాంతరీకరణమునకై యొక సంఘము నేర్పరచెను. ఈతడు లోకోత్తముడని పిలువబడుచుండెను.

ఉగ్రపరిపచ్ఛ, ద్వాదశనిదాన మున్నగు సుద్గ్రంథము లీతని నిర్దేశమున
బరివర్తింపబడినవి. ఇదేకాలమునం దొకచైనాదేశభిక్షువు మిక్కిలి ప్రఖ్యాతి
నందెను. మహామేధావియగు నీతడు సంస్కృతమున బాండిత్యమును సం
పాదించి, ప్రతిమోక్షము మున్నగు గ్రంథముల నెన్నిటినో గంథ స్థముల జేసి
కొని, మహాయానబౌద్ధము ననేకవిధముల బ్రచారముజేసెను ఈతడు ఆ
చార్యబుద్ధదేవుడని పిలువబడుచుండెను. (3) సోగ్డియనులు:- మధ్యఆసి
యాలో ప్రాముఖ్యతనందిన యొకజాతికిజెందియుండిరి. కృషియువాణిజ్య
మును వీరికి ముఖ్యవృత్తులు. పర్షియనుల మతగ్రంథమగు అవెస్టాలో
నిసోగ్డియనులు మగధవేశీయులుగ పేర్కొనబడియున్నారు. హిందూదేశము
నకు సమీపమునందుండుటచే వారు క్రీస్తుశకారంభమున కీబౌద్ధమత బరి
చయమునుగల్గియుండిరి. ఇటీవల మధ్యఆసియాలో నెన్నియో బౌద్ధగ్రం
థములకు సోగ్డియనుభాషలో భాషాంతరీకరణములు లభించినవి. క్రీ.శ. 3వ
శతాబ్దిలో సెంగ్‌హుయీ యనునాతడు చైనాకువెడలెను. ఇతనిబూర్వులు
హిందూదేశమున స్థిరపడిరి, నాఙ్‌కింగ్ నగరమునకేగి యీప్రచారకు డొక
విహారమును నిర్మించుకొని యటనుండి మతబోధ చేయదొడగెను. (4) కుచి
యనులు:— వీరు పూర్వముటారింనదీతీరమున నివసించుచుండిరి. మధ్య
ఆసియానుండి చైనాకుబోవు వర్తకమార్గములన్నియు కుచియనురాజ్యము
మీదుగనే బోవుచుండినవి. త్వరలో హిందూదేశమునుండి మతప్రచారకు
లీవర్తకమార్గముల ననుసరించి, కుచరాజ్యమును చేరిరి. క్రీ శ. మూడ
వశతాబ్దమునం దీనగరమున 1000 బౌద్ధస్తూపము లుండెడివనియు, బౌద
మతము బ్రబలముగ నుండినదనియు, దెలియుచున్నది. కుమారయను
డను నాతడు హిందూదేశమునందొక రాజ్యమున మంత్రిగనుండెను. కొంత
కాలమునకువిమ్మట విరాగియై యాతడు మతప్రచారముచేయు సంకల్పము
తో కుచియనురాజ్యమునకేగెను. రాజీతని నధికముగ గౌరవించి తనకు
గురువునుజేసికొనెను. కొలదికాలమునకే రాజుపుత్రిక యీప్రచారకుని పెండ్లి

యాడెను. వీరికి కుమారవిజయుడు బుట్టెను. పిమ్మట నారాజపుత్రిక బౌద్ధమతమునవలంబించి, కుమారవిజయుని విద్యాభ్యాసమునకై కాశ్మీర దేశమునకేగి, కొంతకాలమట నివసించెను. విద్యాభ్యాసము ముగిసినపిమ్మట గుమారవిజయుడు చైనాకు మరలివచ్చి క్రీ. శ. 401 నుండి బండ్రెండు సంవత్సరములకాలము మతప్రచారమొనర్చెను. ఈతడికాలమున సూత్రా లంకారశాస్త్ర దశభూమువిభాసాశాస్త్ర, శతశాస్త్ర, సత్యసిద్ధిశాస్త్రాది మహాయాన గ్రంథముల నెన్నిటినో భాషాంతరీకరించి, వసుబంధు, నాగార్జు నాశ్వఘో షాది మహనీయులను చైనాదేశీయులకు సుపరిచితుల నొనర్చెను. (5) కోటా నీయులు:- కోటాఞ అనుదేశము సాధారణముగ చైనాదేశీయులు భారతదేశ మునుండి స్వదేశమునకు మరలునపు డనుసరించు దక్షిణమార్గమునందు న్నది సంస్కృతవాఙ్మయమునందీదేశము 'కుస్తన' యని పేర్కొనబడియు న్నది. హిందూదేశమునకు సమీపముగ నుండుటవలనను అఫ్గనిస్థానము నుండియు, కాశ్మీరమునుండియుగూడ నీదేశమునకు మార్గములుండుటవల నను, భారతీయులెందరో యిట నివసించుటయు, నీదేశపుభాషలో విశేష ముగ సంస్కృతపదములు గలియుటయు దటస్థించినవి. నాణెములనుండి యీదేశమునకు క్రీ. శ. 1వ శతాబ్దిలోనే భారతీయసంపర్కము గల్గెనని తెలి యుచున్నది ఇచ్చట ఖరోష్ఠిలిపిలో వ్రాయబడిన ప్రాకృతలేఖలు దొరికి నవి. క్రీ. శ. 259లో ట్చౌషిహింగ్ (Tchou.she.hing) అను నొక చైనా దేశభిక్షుచైనాభాషలోనికి బరివర్తింపబడిన బౌద్ధగ్రంథముల పట్టికను దయా రుచేయుటకును, నూతనగ్రంథములను సమర్థులగు వారివద్ద నేర్చుటకునై కోటానుకువచ్చెను. క్రీ. శ. 291లో మొక్సలుడను (Moksala) భిక్షు నిటనుండి చైనాకేగి పంచవింశతి సహస్రికప్రజ్ఞాపారమిత, యను మహా యాన గ్రంథమును భాషాంతరీకరించెను ఐదవ శతాబ్దిప్రారంభమున న్గఞాయంగ్ (Ngan Yang) అను నొక చైనారాజపుత్రుడు కోటానుకేగి, గోమతి మహావిహారములో బుద్ధసేనుడను భిక్షువువద్ద మహాయానమును

నేర్చెను. ఆదేకాలమున చైనాదేశములో మతప్రచార మొనర్చుచుండిన ధర్మక్షేముడను భారతీయభిక్షువు, మహాయానగ్రంథమగు మహాపరినిర్వాణ సూత్రమును భాషాంతరీకరించునపుడు కోటానుదేశమున కెన్నియోసారులు యాత్రలనుజేసెను. క్రీ. శ. 493లో నీదేశమున జరగిన పంచవార్షిక సభకు, చైనాభిక్షువులుగూడ వచ్చి కొన్నియుద్గ్రంథములను సంపాదించిరి. సర్వవిధముల నీకాలమున కోటాఁదేశ మొక సుప్రసిద్ధ విద్యాస్థానముగ నుండినది. ఇటనుండియే గొన్నివిజ్ఞానకిరణములు చైనాపై ప్రసరించినవి.

# భారతీయ నాగరికతా విస్తరణము.

## VI చ ం పా రా జ్య ము.

ఇండోచైనాయనునది మలేద్వీపకల్పమునకును, చైనాకును మధ్య గల దేశము. ఇందు నేడు సయాం రాజ్యమును ఫ్రెంచి ఇండోచైనాయును గలవు. భారతీయనాగరికతా విస్తరణచరిత్రమున కీభాగము మిగులముఖ్యమైనది. పూర్వ మిందు చంపా, కాంబోజ యను హిందూరాజ్యములును, నేటికినివర్ధిల్లుచున్న సయాంరాజ్యము నుండెడివి. హిందూదేశనాగరికతా భినివేశము లిట విజృంభించియుండుటచే వీని చరిత్రమును సంగ్రహముగ బేర్కొనవలసియున్నది.

నేటి అన్నాంలోని క్వాంగ్నాం (Quang,nam) బిన్ తూన్ ఉన్ (Bin Thuan) అను దక్షిణభాగములు పూర్వపు చంపారాజ్యములో నుండినవి, ప్రాచీన యాత్రికుల కీరాజ్యము పరిచితమై యుండెను. క్రీ. శ. 2వ శతాబ్దమునాటి టాలెమీ యను గ్రీసుదేశీయుడు దీనిని 'జబ'' యని పేర్కొనినాడు. మార్కుపోలో దీనిని "అజంబ" యనెను, అరబ్బులవ్రాతలలో నీరాజ్యమునకు "కౌఫ్" అను పేరున్నది. హ్యూన్ష్వాంగ్ దీనిని "మొహొచంపో" (మహాచంపా) యని ప్రశంసించియున్నాడు. హిందూదేశమున చంపారాజ్యము సుప్రసిద్ధమైయున్నది దానినుండి యీభారతేతర రాజ్యమును విడమరచుటకై హ్యూన్ష్వాంగ్ దీనిని మహాచంపాయని పేర్కొనియుండును. చైనాదేశ చరిత్రమున నీచంపారాజ్యమునకు "లిన్ఈ" యను నామ మొసంగబడియున్నది.

ఈరాజ్యనిర్మాణమునుగూర్చి పెక్కుగాథలు గాంచనగుచున్నవి. హుణటియన్ అనుబ్రాహ్మణు డీరాజ్యముపై దండెత్తి, యచటిరాణిని బరి యమాడి యాదేశమునకు రాజయ్యెనని చైనాదేశీయుల వ్రాతలు దెలుపుచున్నవి. ఈహుణటియుణ అనునతడే కౌండిన్యుడనియు, నీవృత్తాంతము క్రీ.శ. 1 వ శతాబ్దమున జరగెననియు, పెలియట్ అను ఫ్రెంచిపండితుడు వ్రాసియున్నాడు, మరికొన్ని చైనాచరిత్రములలో క్రీ. శ. 2 వ శతాబ్దాంత మున చైనాదేశమును హ్యాణవంశీయులేలుచుండగా "కియులియణ" అనునతడు చంపారాజ్యమును స్థాపించెనని యున్నది. చంపాలోవోకాన్ అనుచోట దొరికిన క్రీ. శ. 3 వ శతాబ్దినాటి సంస్కృతశాసనమున నాకాలమున శ్రీమారునిసంతతివారు చంపాపాలకులుగనుండిరని చెప్పబడినది. దీనినుండి మాస్పెర్స్ అను ఫ్రెంచిపండితుడు కియుణలియణను, శ్రీమారుడు నొక్కరే యనియు, నితడు క్రీస్తుశకము రెండవయంత్యభాగమున చంపారాజ్యమును స్థాపించెననియు వ్రాసియున్నాడు. కాని కియణలియణ అనునది కౌండిన్యుని పేరనియు, నాతడే యారాజ్యమును క్రీ. శ. 1 వ శతాబ్దిలో నిర్మించెననియు, దీనిని రెండవశతాబ్దమునుండి శ్రీమారుడు నాతనిసంతతివారు నేలిరనియు జెప్పుట సమంజసముగ నుండును. ఏది యెట్లున్నను క్రీస్తు శకారంభమున భారతీయు లిచటికి వలసవచ్చిరని స్పష్టమగుచున్నది. అయినచో వీర లెచటివారు? అను సమస్యయొకటి బయల్వెడలును. "చంపా" యను నీరాజ్యనామమును బట్టి వీరార్యావర్తమునందలి ప్రాగ్భాగమునుండి వచ్చిరేమోయని తోచుచున్నది. కాని వోకాణ శాసనము దక్షిణహిందూదేశమును సూచించుచున్నది, ఈశాసనమునందలి భాషయు, లిపియు, క్షత్రపరుద్రదాముని గిర్‌నార్ శాసనమును, ఆంధ్రవాసిష్ఠీపుత్రుని కన్హేరిశాసనమును పోలియున్నవి. ఈవిషయముల నన్నిటిని చర్చించి జదునాథ్ సర్కారుగారు "చంపారాజ్యమునేలిన మొదటి రాజవంశము గోదావరీ కృష్ణా నదీతీరములనుండి వచ్చిరని చెప్పవలసి యున్న"దని నిశ్చయించినారు.

ఈప్రదేశము లాంధ్రదేశములోనివే యగుటచే, అంధ్రులు క్రీ. శ. 1, 2 శతాబ్దములలో ఇండోచైనాకు వలసపోయి యిచట నొకహిందూరాజ్యమును స్థాపించిరను ముఖ్యాంశము నచ్చారుపండితుని వ్రాతలనుండి స్పష్టమగు చున్నది.

చంపారాజ్యచరిత్రమును రచించుటకు పెక్కు సంస్కృత శాసనములును, తాత్కాలికులవ్రాతలు నుపకరించుచున్నవి. క్రీ. శ. 1 వ శతాబ్దమున చైనాలో చేరియుండిన యీభాగమున అమరావతి యనుచోట శ్రీమారుడు తనస్వాతంత్ర్యమును ప్రకటించెను. అతని కాలమున నీరాజ్యమునపాండురంగ, విజయ, కౌథార యను మరిమూడువిభాగములుండినవి. ఆతని సంతతివారు మాతృదేశమునందలి హిందూమతము నిచట వ్యాపింప జేసిరి. దేవాలయములెల్లెడలను నిర్మింపబడినవి. స్థానికులగు చామ్‌ప్రజలు త్వరలో నీహిందూమతమును, హిందువుల యాచారవ్యవహారములను స్వీకరించిరి. ఈశ్రీమారవంశమునకు బిమ్మట క్రీ. శ. 336-420 నడుమ నొకక్రొత్తవంశము చంపాసింహాసనము నధిష్ఠించెను. ఈవంశీయులలో మూడవవాడగు భద్రవర్మ మిక్కిలి గొప్పవాడు. 'ధర్మమహారాజ' యనునితని బిరుదము దక్షిణహిందూదేశపు పల్లవ, వాకాటక, కదంబరాజుల బిరుదులను పోలియున్నది. ఈతడు మిసన్ అనుచోట తనపేరిట భద్రేశ్వరస్వామియాలయమును గట్టించెను. ఈతని తనయుడగు గంగరాజు విరాగియై, రాజ్యమును త్యజించి, గంగానదిని దర్శించుటకై హిందూదేశమున కేగెను.

క్రీ. శ. 420-530 నడుమ నీరాజ్యమునందంతఃకలహములేర్పడినవి. చంపారాజ్యవిజృంభణమును గాంచి యోర్వలేక చైనాదేశీయులీయదనున నీరాజ్యముపై దండెత్తి, రాజధానిని దోచి, దేవళములను కాల్చిరి. పిమ్మట క్రీ. శ. 530లో శ్రీరుద్రవర్మయను నతడు చైనాదేశీయులచే చంపారాజ్యమున కభిషిక్తుడయ్యెను. ఈమూడవ రాజవంశము

క్రీ. శ 758 వరకును చంపారాజ్యము నేలెను. వీరిలో ప్రకాశధర్ముడను నతడు ముఖ్యుడు. "చంపాపుర పరమేశ్వర మహారాజశ్రీ ప్రకాశ ధర్మ" యనున దీతని పూర్తిపేరు. ఇశానేశ్వర, ప్రభవేశ్వరాది దేవాలయము లెన్నియో యాతనిచే నిర్మింపబడినవి. క్రీ.శ. 758 లో చంపాసామంతులు పాండురంగపురాధీశ్వరుడగు పృథివీంద్ర వర్మను చంపాసింహాసనమున గూర్చుండబెట్టిరి. ఈతని వంశీయులు క్రీ. శ. 9 వ శతాబ్ది మధ్యభాగము వరకును రాజ్యమేలిరి. క్రీ. శ. 774 లో యవద్వీపవాసులు చంపాపైదండెత్తి, కౌథారవిషయమును కొల్లగొని, యచటి శంభుదేవాలయమును పాడుచేసి, లింగమును గొనిపోయిరి. పిమ్మట నప్పటిచంపారాజగు శ్రీసత్యవర్మ శత్రువులతో సముద్రముపై యుద్ధమొనర్చి, వారిని దరిమివైచి, కౌథారమున నొక చక్కని యాలయమును గట్టించి తనపేరిట సత్యముఖలింగమును నెలకొల్పెను, రాజధానియగు పాండురంగపురమున నిత డొక గొప్ప సౌధమునునిర్మించెను ఈవంశములోని ఇంద్రవర్మ క్రీ. శ 787 లో యవద్వీపవాసుల దండయాత్రను ప్రతిఘటించి, యనేక శివాలయములను స్థాపించెను. ఈతనికాలమున శంకరనారాయణ విగ్రహములును, వాని యారాధనయు, వ్యాప్తిలోనికి వచ్చినవి. చంపారాజ్యములోని హిందూమతపరివర్తనమునం దిది యొక ముఖ్యాంశము. ఈరాజు వెనుక చంపారాజ్యము నేలినవాడు నీతని తమ్ముడునగు మొదటి హరివర్మ చంపారాజులలో నగ్రగణ్యుడు. క్రీ. శ. 803 లో నితడు చైనాలోని గొన్ని భాగములను జయించి రాజాధిరాజ బిరుదమును వహించెను. ఇతని తనయుడును యువరాజునగు విక్రాంతవర్మ కాంభోజదేశముపై దాటివెడలి యచటి రాజు నోడించెను. ఈవంశీయుల పాలనము కీ. శ. 860 లో నంతమయ్యెను. అటుపై మహారాజాధిరాజ ఇంద్రవర్మయు, నాతని పుత్రుడగు జయసింహవర్మయు క్రీ. శ. 900 వరకును రాజ్యమేలిరి. ఈకాలమున మహాయాన బౌద్ధమతము చంపారాజ్యమున వ్యాపించెను. క్రీ శ. 900-1074 నడుమ మూడువంశములు చంపారాజ్యమును పాలించినవి. ఈకాలమున

నెన్నియో యుపద్రవములు జరగినవి. క్రీ. శ. 945 లో కాంభోజ దేశీయులును, 982, 1034, 1069 సంవత్సరములలో అన్నాము దేశీయులును చంపారాజ్యముపై దండెత్తియాకాలపు రాజులను చంపియు, దేశమును కొల్లగొని దేవాలయములను కట్టడములను ధ్వంసముచేసియు, నల్లకల్లోల మొనర్చిరి. ఇదేసమయమున శ్రీవిజయ పాండురంగవిషయాధిపులు విద్రోహ మొనర్చిరి. కాన చంపారాజవంశములకు స్థైర్యము లేకుండినది. ఈకాలమున శాక్తధర్మ మీరాజ్యమున ప్రబలినది. క్రీ. శ. 1075 లో మూడవ హరివర్మమహారాజు అన్నాం, కాంభోజదేశములనోడించి,చంపారాజ్యము నాక్రమించెను. ఈవీరాగ్రణి శత్రువులచే నాశమొనర్పబడిన హిందూదేవాలయముల నన్నిటిని బాగుచేయించి, క్రొత్తవాని నెన్నిటినోనిర్మించెను. చంపారాజ్యమున తిరిగీ శాంతిసౌఖ్యములు ప్రబలినవి. ఈరాజు మరణించినపుడు రాణులు నల్గురు సహగమనమొనర్చిరి. అనంతర మీతని పుత్రుడు బాలుడగుటచే నీతనితమ్ముడగు పరమబోధిసత్వుని బ్రజలెల్లరును దమ కేలికగ నెన్నుకొనిరి. ఈక్రొత్తరాజు బౌద్ధమతము నవలంబించెను. పాండురంగ విషయాధిపు డీకాలమున విద్రోహమొనర్చెను గాని శీఘ్రకాలముననే యణచబడెను. క్రీ శ. 1139–1144 నడుమ పదునొకటవ రాజవంశము పరిపాలనమునకు వచ్చెను. ఈకాలమున శైవబౌద్ధమతములు రెండును చంపారాజ్యమునవర్ధిల్లినవి. క్రీ. శ, 1192 నుండియు నీ రాజ్యము క్షీణించెను. ఇంతటితో నిచటి హిందూరాజుల ప్రతిభ నశించినది ఉత్తరమున శ్రీవిజయ విషయము కాంభోజరాజుచే జయింపబడెను పాండురంగ విషయమును స్థానికులగు చాము లాక్రమించిరి. క్రీ. శ. 1203-1220 నడుమ చంపారాజ్యమంతయు కాంభోజసామ్రాజ్యమున గల్పుకొనబడెను. క్రీ. శ. 13 వ శతాబ్దిమూడవపాదమున చెంగిస్ఖాణ తనయుడగు కుబిలైఖాణ అను మంగోలురాజు చంపాపై యనేకసార్లు దండెత్తెను. తుదకు క్రీ. శ. 1318 ప్రాంతమున అన్నాందేశీయులు చంపారాజ్యమును వశపరచుకొనిరి ఇంతటితో చంపా హిందూరాజ్యచరిత్ర ముగిసినది.

క్రీ. శ. 1వ శతాబ్దినుండి 13వ శతాబ్దివరకునుండిన యీహిందూ రాజ్యపు నాగరీకత నించుక పరిశీలింపవలసియున్నది. హిందూదేశమునం దువలె చంపారాజ్యమునగూడ దేవాలయములు ముఖ్యనిర్మాణములుగ నుండినవి.వానిని సాధారణముగ నిటుకలతోను, అరుదుగ రాతితోను నిర్మించుచుండిరి. వీనిలోపలిభాగము దారునిర్మితము. ఒకయాల యాంతర్భాగము మంచిగందపుకఱ్ఱతో గట్టబడి. బంగారు వెండిరేకులమలామాను గలిగియుండెను. మరియొక దాని గోపురమునకు వెండిరేకువేయబడినది. ఈ యాచారము హిందూదేశమునగూడ నుండెడిది. చంపారాజ్యమున శైవ మతము ప్రబలముగ నుండినది. శర్వ, భవ, ఈశాన, పశుపతి, ఉగ్ర, రుద్ర యనుపేరులుగల్గి, నటరాజ, యోగి, లింగరూపములలో శివు డీ దేశమున నారాధింపబడుచుండెను. చంపాశైవమతమున రెండు క్రొత్త విషయములు గలవు. అందు మొదటిది ముఖలింగపూజ. రాజులనేకులు తమ పేరిట బ్రతిష్ఠింపుచుండిరి. ఇందు సామాన్యమగు లింగమునకు పైభాగమున ముఖమొకటి కల్పింపబడుచుండెడిది. ఇట్టి ముఖలింగములను నిర్మించుటలో అయారాజులను శివునితో సరిచేయుటయే ముఖ్యోద్దేశమై యుండవచ్చును. శైవముతోపాటు శాక్తమును వ్యాపించినది. ఉమా గౌరీ, చండీ, కాళీ, భగవతీ యను పేరిట జనులా కాలమున శక్తినారాధించుచుండిరి. నంది, విఘ్నేశ్వరుడు నీశైవాలయములలో సామాన్యముగ స్థాపింపబడెడివి. చంపాశైవమున రెండవయంశము శంకర నారాయణ పూజ. శివకేశవుల యభేదమును దెల్పుటకై యొక పార్శ్వమున శివుని, మరియొక పార్శ్వమున విష్ణువును జూపు విగ్రహములు నిర్మింపబడినవి. శివునకుబిమ్మట విష్ణువు విశేషముగ నిరాజ్యమునం దారాధింప బడుచుండెను. ఇతనితోపాటు లక్ష్మియు, గరుడును పూజింపబడుచుండిరి. క్రీ. శ. 7వ శతాబ్దినుండి యీదేశమున బౌద్ధమతమును ప్రబలినది. ఇచట ననేకములగు విహారములు నిర్మింపబడినవి. నాగారోహకుడగు బుద్ధుడు నవ లోకితేశ్వరుడు నిట బూజింపబడిరి, కాని చంపాలోని బౌద్ధశిల్పములు

తేజోహీనములై సామాన్యమైనవిగనున్నవి. మతమునకుబిమ్మట పేర్కొనదగినది వాఙ్మయము. స్థానికమగు చామ్భాష యాదేశమునం దుండినను సంస్కృతమే రాజభాషగ పరిగణింప బడినది, హిందూవిజ్ఞానము చాలభాగము చంపాలో వ్యాపించినది. వ్యాకరణము, జ్యోతిషము, ధర్మశాస్త్రము, మీమాంస, శైవేతరకల్పము, ఆఖ్యానము, రామాయణము, మహాభారతము మున్నగునవి యాదేశీయులకు చక్కగ దెలిసియుండినవి. మతమును, వైదుష్యమునేగాక చంపారాజులు హిందూదేశమునుండి సాంఘికపద్ధతులనుగూడ తమ దేశమునకు గొనితెచ్చిరి. ఇచటగూడ బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్రాది చతుర్వర్ణములు నుండినవి. రాజు లందరును క్షత్రియులుగ నుండిరి. అయినను వారు బ్రాహ్మణులతో మాత్రము వైవాహిక సంబంధములను గలిగియుండిరి. రాజపుత్రులు బ్రాహ్మణకన్యలను, బ్రాహ్మణయువకులు రాజ కన్యకలను బరిణయమాడు టాచారమైయుండినది. అందుచే గొందరు చంపారాజులు తాము బ్రహ్మ క్షత్రియకులజులమని చెప్పుకొను చుండిరి. వివాహము హిందూపద్ధతినే జరుగుచుండెడిది. చంపాలో హిందూదేశము నందువలెనే రాజు రాష్ట్రమునం దగ్రగణ్యుడుగ నుండెను. సాధారణముగ నధికారము తండ్రివెనుక జ్యేష్ఠపుత్రునికే చెందుచుండెను. కొన్నిసమయములలో సామంతులును. మంత్రులును జేరి రాజు నెన్నుకొనుచుండిరి. ఒక్కొక్కప్పుడు రాజులు దత్తతచేసికొనుటయు లేక తమ యనంతరము రాజ్యమేలుట కొకనిని తామేపేర్కొనుటయు జరగెడివి. రాజ్యాభిషేకము హిందూధర్మశాస్త్రముల ననుసరించియే జరుపబడుచుండెడిది. ఆ సమయమున రాజులు క్రొత్తనామములను, బిరుదములను గైకొనుచుండిరి. జ్యేష్ఠపుత్రుడు యౌవరాజ్యాభిషిక్తుడై మహాసేనాపతిగ నుండెను. చంపారాజ్యము మూడువిభాగములుగ నుండెను. అందు మొదటిది అమరావతీ విషయము ఉత్తరముననున్న యావిషయము నేటి క్వా అంగ్నాం (Quang-nam)కు సరియగును. విజయ యను రెండవవిషయము రాజ్యము మధ్యనుండెడిది, ఇయ్యది నేటి

బింగడిన్ (Bing-Dinh)కు సరిపోవును. ఇంద్రశివిజయ అను రేవుపట్టణ మునందెడిది. మూడవది దక్షిణమునసుండెడి పాండురంగవిషయము. ఇదియే నేటి పన్రన్ (Panran) అను విభాగము. ఈవిషయములలో నొక్కొక్క దానిపై నొక్కొక రాజప్రతినిధి యుండెను. కేంద్రప్రభుత్వము యిర్వురు సామాన్యోద్యోగులయొక్కయు, నిర్వురు, ఘనోద్యోగుల యొక్కయు, మంత్రుల యొక్కయు, సాహాయ్యముతో రాజుచే నిర్వహింపబడు చుండెడిది. చంపారాజ్యము ప్రబలముగనుండినది. ఇందు గజాశ్వపదాతి బలములుండెడివి. ఖడ్గములు, బల్లెములు, డాలులును యుద్ధములలో నుపయోగింప బడు చుండెడివి. నగరములచుట్టును దిట్టములగు గోడలుండెడివి.

# భారతీయ నాగరికతా విస్తరణము.

## VII కాంభోజరాజ్యము.

ఈప్రాచీనహిందూరాజ్యము నేటి కాంబోడియాకు సరియగును. మొదటిలోనియ్యది యీనాటి కొచిన్, చైనా, సయాం, మలేద్వీపకల్పము లకు వ్యాపించిన ఫూనన్ రాజ్యములో చేరియుండి క్రీ. శ. 600లో స్వతంత్రరాజ్యమయ్యెను. యీ కాంభోజరాజ్యోత్పత్తినిగూర్చి వివిధములగు గాథలుగలవు. స్థానికులగు ఖ్మెర్ (Khmer) ప్రజలు కంబుస్వాయంభువను నార్యదేశపురాజు కాంభోజదేశమున కేగి, యొక నాగరాజుకూతురును పెండ్లాడి యాదేశమున కధిపతియయ్యెనని చెప్పుదురు. మరియొక గాథ ననుసరించి ఆదిత్యవర్మయను నింద్రప్రస్థపురాజు తన రెండవకుమారుడు దేశమునుండి వెడలగొట్టెననియు, నారాజపుత్రు డోడపై కాంభోజప్రాంతమును జేరి, యచటి రాజునోడించి, దానే రాజయ్యెననియు, నొకసారి సముద్రతీరమున విహరించుచు నొక నాగకన్యకను గాంచి మోహితుడై, యామెనుబరిణయ మాడెననియు, నంతట నాతనిమామగారగు నాగరాజు సముద్రములో గొంత నీటిని ద్రాగి, బయల్పడలిన భూమికి తన యల్లునిరాజును జేసి, దానికి కాంభోజ యను నామము నిడెననియు, దెలియుచున్నది. ఇట్టి నాగరాజులతోడి వైవాహిక సంబంధమువలన రాజ్యాధికారము బడయుట దక్షిణహిందూదేశములోని పల్లవ రాజవంశ చరిత్రముననుగలదు. చంపారాజ్యోత్పత్తిని పేర్కొనునపుడు కౌండిన్యుడను బ్రాహ్మణు డీప్రాంతమును క్రీ. శ. 1 వ శతాబ్దిలో జయించెనని చెప్పియుంటిమి. చైనాదేశ

యుల వ్రాతలలో కాంభోజదేశమునకు మరియొక కౌండిన్యుడేతెంచి యప్పటి కట రాణిగనున్న సోమయను నామెను పెండ్లియై బ్రజలచే రాజుగ నెన్నుకొన బడెనని యున్నది. యీగాథలనుండి దక్షిణహిందూదేశమునకు ను కాంభోజరాజ్యోత్పత్తికిని సన్నిహితమగు సంబంధముగలదని తెలియుచున్నది. జదునాథ్ సర్కార్ పండితు డీయూహకే మరి రెండుకారణముల నొసంగుచున్నాడు. (1) వర్మయను కాంభోజరాజుల నామాంత్యము (2) ఇచటి దేవాలయ శిఖరములు దక్షిణహిందూదేశపు గోపురములనుపోలియుండుట. వీనినిబట్టి కాంభోజదేశమునకు మొదట వలస వచ్చినవారు కళింగము ఉత్తరసర్కారులనుండి, ముఖ్యముగ కృష్ణాగోదావరీతీరములనుండి వచ్చియుండిరని పైపండితుని యభిప్రాయము.

యీ రాజ్యముయొక్క చరిత్రను ప్రారంభించుటకు Baksey Chang Krang అనుచోట గన్గొనబడిన సంస్కృతశాసన ముపకరించుచున్నది. అది కంబుస్వాయంభువ శృతవర్మన్, శ్రేష్ఠవర్మన్ అను మూడు పురుషాంతరములను, కౌండిన్యసోమ, రుద్రవర్మన్, భావవర్మన్ అను మరి మూడు సమకాలిక పురుషాంతరములను తెల్పుచున్నది. ఇందు రెండవ వరుసలోని కౌండిన్యుడే క్రీ. శ. 4 వ శతాబ్దమున కాంభోజదేశమునకు వచ్చినవాడు. రుద్రవర్మ క్రీ. శ. 570 ప్రాంతమున నుండెను. విష్ణువుతోడను, దిలీపునితోడ నీతడు సరిపోల్పబడినాడు. యీకాలమునకు హిందూ అయుర్వేద మీదేశమునకు వ్యాపించినది. రాజువద్ద అశ్వినులను పోలిన యిర్వురువైద్యులుండిరట. రుద్రవర్మతనయుడగు భావవర్మ క్రీ.శ. 580-600 నడుమ రాజయ్యెను. యీరాజు తమ్ముడు చిత్రసేనుడను నతడు ఫూనన్ రాజు నోడించెను. ఇంతటితో కాంభోజము స్వతంత్రరాజ్యమయ్యెను. భావవర్మసోదరి సామవేదపారగుడగు సోమశర్మయను నతనిని పెండ్లాడెను. యీసోమశర్మ విష్ణుభక్తుడు. విష్ణ్వాలయములను, సూర్యాలయముల నెన్నిటినో గట్టించి యాతడు వానికి మహాభారత రామాయణ

పురాణాదిగ్రంథములను సమర్పించెను. రాజు శైవుడగుటవలనను, శక్తి పూజ యీకాలమున ప్రబలముగ నుండుటవలనను, రాజ్యమున శివాలయములుగూడ జయముత్పెడలినవి. క్రీ. శ. 604 లో చిత్రసేనుడు మహేంద్రవర్మయను నామముతో కాంబోజసింహాసనమునకు వచ్చి యిరువదియేదు సంవత్సరములు పాలించెను. యీకాలమున నొక బ్రాహ్మణుడు శివపాదమును బ్రతిష్ఠించి దానిపై నొకయాలయమును గట్టించెను. ఇయ్యది హిందూదేశములోని విష్ణు బుద్ధపాదముల యారాధన జ్ఞప్తికి దెచ్చుచున్నది. తరువాత రాజ్యమునకు వచ్చి క్రీ. శ. 627-639 నడుమ రాజ్యమేలిన యీశానవర్మకాలము మిగుల ముఖ్యమైనది. యీశానపుర, తామ్రపుర, చక్రాంకపుర, భీమపురాది నగరములెన్నియో యీసమయమున నిర్మింపబడినవి. శంకరనారాయణ పూజగూడ నీకాలమున వ్యాప్తిచెందినది. యీరాజు నీతనిసామంతులును బౌద్ధులసంఘారామములవలె హిందూ ఆశ్రమములను స్థాపించి వానిని కపోధనుల కాశ్రయములుగ నొసర్చిరి. క్రీ. శ. 665-690 నడుమ రాజ్యమేలిన మొదటి జయవర్మకాలమున బౌద్ధమతము దేశమును బ్రవేశించెను. క్రీ. శ. 8 వ శతాబ్దము కాంభోజచరిత్రమునందంధకారమయముగనున్నది. యీకాలమున శంభుపురము, వ్యాధపురము, అనిందితపురము నను మూడు చిన్నరాజ్యములుగ దేశమంతయు విభజింపబడి యంతఃకలహములకు లోనయ్యెను. క్రీ. శ. 802 లో రెండవ జయవర్మ శాంతిని నెలకొల్పి చంపారాజ్యము నంతటిని క్రీ. శ. 820 వరకు నేలెను. మహేంద్రపర్వతముపై నీత డొక నూతనరాజధానిని నిర్మించెను. రాజేంద్రదేవి, నరేంద్రలక్ష్మి యను వా రీతని భార్యలు. క్రీ.శ, 877-889 నడుమ పరిపాలించిన మొదటి యింద్రవర్మగూడ నెన్నియో యాశ్రమములను స్థాపించెను. పిమ్మట సింహాసనమునకు వచ్చిన యశోవర్మ కాంబోజపాలకులలో నగ్రగణ్యుడు. సోమశివుడను మహామునికీతడు శిష్యుడు. ఈకాలమున జనులు శివుడు, విష్ణువు, శక్తి, గణపతి, కార్తికేయుడు మున్నగుదేవతల నారాధించుచుండిరి. చాతుర్వర్ణ్యవ్యవస్థ యీ

దేశమునందుండెను. శుశ్రుతాచార్యుని వైద్యశాస్త్రమున యశోవర్మ ప్రవీణుడు. రెండవ జయవర్మ ప్రారంభించిన రాజధానిని పూర్తిచేసి దాని కీతడు యశోధరపురమని పేరిడెను. ప్రపంచమున కంతటికిని విస్మయముగొల్పు అంగ్‌కోర్‌థామ్ అను కట్టడ మీతనిచే నిర్మింపబడినది. క్రీ. శ. **944-968** నడుమ రాజ్యమేలిన రాజేంద్రవర్మకాలమున మహాయానబౌద్ధమతము ప్రబలినది. బౌద్ధదేవాలయములెన్నియో బయల్వెడలినవి. ఈరాజుపుత్రుడగు నైదవ జయవర్మకాలమున హిందూమత ముజ్జీవనము నందెను. ఈరాజు సోదరియగు ఇంద్రలక్ష్మి భారతదేశమునందలి యమునానదీ తీరమునుండి యేతెంచిన దివాకరుడను బ్రాహ్మణుని పెండ్లాడెను. దీనినుండి మాతృదేశమునుండి యీశాఖా రాజ్యముల కేగినవారల కాకాలమున జూపబడుచుండెడి గౌరవము తెలియుచున్నది. దివాకరు డెన్నియో యాలయములను స్థాపించెను. పిమ్మట సూర్యవర్మ క్రీ. శ. **1002-1049** నడుమ రాజ్యమునకు వచ్చెను. యోగీశ్వరుడను మహాపండితు డీతని యాచార్యుడు. ఈ రాజగురుని మూలమున శైవమతమున కెంతయో ప్రాబల్యము లభించెను. శివాచార్యుడను మరియొక పండితుడు వర్ణవ్యవస్థను సంస్కరించెను. పతంజలీ వ్యాకరణనేత్రయగు శంకరపండితుడుగూడ నీకాలముననే యుండెను. సూర్యవర్మ మహతంత్రజ్ఞుడు. చైనా చంపారాజ్యములతో మైత్రినిపాటించి నీతడు అన్నాంరాజ్యముపై దండెత్తెను. క్రీ. శ. **1112-1152** నడుమ కాంభోజదేశమునకు నాటరాజగు రెండవసూర్యవర్మ విశేషమగు ఖ్యాతి నొసగూర్చెను. ఈరాజు మలక్కాదీవులను జయించి తనరాజ్యమును విస్తరింప జేసెను. ఈకాలమున కాంభోజరాజ్యమునకు తూర్పున చంపారాజ్యమును, పడమట పెగూరాజ్యమును, దక్షిణమున మలేరాజ్యము నుండెడివి. చైనాకు రెండురాయబారముల నంపియు, చంపారాజు ననేకసారు లోడించియు నీతడు శత్రుభయంకరుడై యుండెను. దివాకరుడను పండితాగ్రణి యీరాజునకు గురువు. ఏడవజయవర్మ కాంభోజరాజులలో కడపటివాడు. క్రీ. శ. **1182-1201** నడుమ నీతడు రాజ్యమేలెను. చంపారాజ్యము

తోడి యుద్ధము నీతడు జయప్రదముగ నిర్వహించి, బర్మాలో కొంతభాగ మును జయించెను. ఈకాలమునం దెల్లెడలను వైద్యశాలలు నెలకొల్పబడి నవి. క్రీ. శ. 14వ శతాబ్దిలో కాంభోజరాజ్యము క్షీణించెను. రాజులు బల హీనులుగనుండిరి. ఒక వంకనుండి చంపాపాలకులును, మరియొక వంక నుండి సయాంరాజులును కాంభోజముపై ననేకసారులుదాడి వెడలి తుదకు దానిని రూపుమాపిరి.

కాంభోజదేశనాగరీకత యనేకవిషయములలో హిందూదేశనాగరీ కతనుపోలియున్నది. ఇచటి దేవాలయములు రాతితోను యిటుకలతోను కట్టబడినవి. ఇందు దక్షిణహిందూదేశమునందలి గ్రామదేవతలయొక్కయు, చిల్లరదేవతలయొక్కయు గుళ్ళవలె త్రికోణాకృతిగలవియు, పెద్దగోపురములు గలిగి విశాలములైనవియు. ననేకవిధములగు నాలయములు గలవు. ఆలయముచుట్టును ప్రహరీగోడయు ప్రధానద్వారముపై గోపురము నిట గూడనుండెడివి. శైవమతమీదేశమున బ్రధానముగనుండినది శివుడు పరమేశ్వర, త్ర్యంబక, శంభు, గౌరీశ, జగత్పత్యాదినామములతో నారాధింప బడుచుండెను. నందివాహన, నటరాజ, పంచముఖ. లింగరూపములు శిల్పమున గాంచనగుచున్నవి. పాశుపత వీరశైవ శాఖలును, వేదాంత శైవమును నీరాజ్యమున ముఖ్యములుగ నుండినవి. ఇచట విశేషమగు నొక శైవాచారముండెడిది. రాజులు చంపాలోవలెనే తమపేరిట ముఖ లింగములను స్థాపించుచుండిరి. వారికి మరణానంతరము శైవబిరుదము లొసంగబడుచుండెడివి. జయవర్మకు ఈశ్వరలోక, యశోవర్మకు పరమ శివలోక, హర్షవర్మకు రుద్రలోక మున్నగుబిరుదము లిందులకు నిదర్శన ములు, పారమేశ్వర. స్పందవృత్తి పరమేశ్వర తంత్రమున్నగు శైవగ్రం థము లీదేశమున రచింపబడినవి, కాంభోజదేశమునందలి శైవమతమున శివవిష్ణులింగ, శంకరనారాయణ విగ్రహారాధన మింకొక నూతనాంశము. ఇచటను శివపాదమనక దేవళములను గట్టించు టాచారమై యుండెను

ఉమ, పార్వతి, భవాని, గౌరీరూపములలో శక్తియు, శివ, విష్ణు, బ్రహ్మ, సరస్వతి, గంగా, శ్రీ, చండీ, గణేశ, గరుడ, నంది, కాళ్యాది యితరదేవతలు నీదేశమునందు దారాధింపబడుచుండిరి. క్రీ. శ. 7 వ శతాబ్దమున బౌద్ధమతమీదేశమునందు ప్రబలినప్పటినుండియు మైత్రేయ, అవలోకితేశ్వర, వజ్రపాణి, ప్రజ్ఞాపారమితా, దివ్యాదేవి, లోకనాథాది మహాయాన బౌద్ధదేవతలారాధింపబడుచుండిరి. చంపాలోవలె కాంభోజదేశమునగూడ హిందూవాఙ్మయము వ్యాపించినది. ఋగ్యజుస్సామవేదపారగులెందరో యిటనుండిరి. తంత్రములు, నాగమములును, రామాయణ మహాభారతములు నిచ్చటివారికి కరతలామలకములుగ నుండినవి శాసనములలో వేదాంతజ్ఞానసారులును, స్మృతిపథనిరతులు, నష్టాంగయోగ ప్రకటితకర్ములునగు బ్రాహ్మణుల ప్రశంసగలదు. కాణాద న్యాయసూత్రములును, పతంజలి మహాభాష్యమును, జ్యోతిశ్శాస్త్ర శబ్దశాస్త్రములును, ఆయుర్వేదమును, శిల్ప గీత నాట్యశాస్త్రములును, ధర్మశాస్త్రము, నర్థశాస్త్రము నీకాంభోజదేశమున విశేషముగ వ్యాప్తినందినవి. ఇచటి కట్టడములలో అంగ్‌కోర్‌వాట్ అను విష్ణ్వాలయము ముఖ్యమైనది. ఇందలి గోడలపై రామాయణ మహాభారత హరివంశములలోని ఘట్టములు చిత్రింపబడినవి. అంగ్‌కోర్‌థామ్ అను రాజధానీనగరము దీని కెనయగును. హిందూకాంభోజ (Indo-Combodian) కళకీరెండు కట్టడములు నుత్కృష్ట నిదర్శనములు.

# భారతీయ నాగరికతా విస్తరణము

## VIII దక్షిణహిందూదేశము — ప్రాగ్భారతదేశములు.

ఈవిధముగ దేశాంతరములందు భారతీయనాగరికతను విస్తరించు నెడ హిందూదేశమునందలి యుత్తరాపథ దక్షిణాపథములు రెండును సమముగ పాల్గొనినవి. ముఖ్యముగ బౌద్ధమతమును, సంస్కృతప్రాకృత వాఙ్మయములను విదేశీయు లుత్తరదేశమునుండి గ్రహించిరి. అందు కాశ్మీరమును, వంగదేశము నగ్రగణ్యములు. మనదేశమునకు బ్రాగ్దిశ నున్న ద్వీపమాలకును' ప్రకృత ఇండోచైనాకును దక్షిణహిందూదేశముతో సన్నిహితమగు సంబంధముండినటుల స్పష్టమగుచున్నది. యీసంబంధ మీదేశములందలి గాథలు, శాసనములు, దేవతలు, మతము, కట్టడములు మున్నగువానిలొ గాంచనగుచున్నది.

(1) వర్తకము :- మొదటినుండియు దక్షిణదేశవాసులు సముద్రయానమునకును, విదేశవాణిజ్యమునకును వాసికెక్కి యుండిరి. మలబారుతీర మీసందర్భమున పేర్కొనదగినది. అటనుండి పాశ్చాత్యదేశములతో వర్తకము జరుగుచుండెడిది. అటులే తూర్పుతీరమున పాండ్యరాజ్యములోని కొర్కై ( Kor ai ) నగరమును, చోళుల రాజధానియగు కావేరీపట్టణమును, మహాబలిపురమును, ఆంధ్రదేశమునందలి గూడూరు, ఘంటశాల, మోటుపల్లి, కోరంగి మున్నగు రేవుస్థలములును ప్రాగ్దేశములతో వాణిజ్యమును నెరపుచుండెడివి.

(2) వలసపోవుట :- సాధారణముగ దేశాంతర సామ్రాజ్యనిర్మాణమునకు వాణిజ్యము మార్గదర్శకము. యీప్రాచీన దాక్షిణాత్యవర్తకుల వెంటనె యితరులనేకు లిదూరదేశములకు వలసపోయిరి. క్రీ. శ. 1 వ శతాబ్దిమధ్యభాగమున శకులు భారతదేశమున గల్లోలమును గల్గించిరి. దానికిఫలితముగ దేశీయులు గొందరు విదేశముల కేగియుందురు. క్రీ. శ. 78 లో అజీశకుడనునతడు పశ్చిమతీరమునుండి కొంపరనుచరులతో సముద్రముపై బ్రాగ్దిశకేగెనని తెలియుచున్నది. అటుపై భారతదేశ ప్రాగుత్తర దిశనుండు సముద్రతీరమునుండి యనేకులు జావాద్వీపమునకు వలసపోయిరి. వీరిలో చాలమంది మహానదీ గోదావరీతీరవాసులు. మలేద్వీపకల్పవాసులు, భారతదేశమునుండి యటకేతెంచినవారిని "కెలింగ్" లేక "క్లింగు" లని పిలచుచున్నారు. యీపదములకు "కళింగదేశీయు" లని యర్థము.

(3) గాథలు :- అగస్త్యమహర్షి భారతదేశముననే యార్యనాగరీకత ననార్యమగు దక్షిణాపథమున విస్తరింపజేసెనను ప్రతీతి గలదు. ఇండోచైనా, జావాద్వీపములలోగూడ నీతడు జ్ఞానప్రదాతగ నారాధింపబడుచుండెను. 'అకిత్తజాతక' మను బౌద్ధగ్రంథమున నీయగస్త్యుడు దక్షిణ హిందూదేశమునుండి 'కారద్వీపము' న కేగెనని చెప్పబడియున్నది. యీ దీవి ప్రకృతము (Celebes) అని వ్యవహరింపబడు శ్రీభోజద్వీపరాజ్యము నందుండినది. జావాద్వీపమునందు విచిత్రములగు విగ్రహములు గలవు. అవి పొడుగైన గడ్డమును చక్కనివస్త్రమును ధరించిన యొక వృద్ధునివి. "భతారగురు" లేక "మహాగురు" యను నీవిగ్రహములు శివాలయములలో నెలకొల్పబడి ప్రత్యేకముగ నారాధింపబడుచున్నవి భతారయనగా మళయాళములో శివుడనియర్థము. అగస్త్యమహర్షి శివభక్తుడు. గాన నీయవద్వీపవిగ్రహము లగస్త్యునివని స్పష్టమగుచున్నది. క్రీ. శ. 240 లో కంబోడియాదేశపు రాజొకడు 'మావ్‌లన్' (Mao Lun) అను విదేశ

రాజునొద్దకు రాయబారి నంపెను. ఈ 'యావ్‌లక్' అనుపేరు 'మారక్' అను పేరుతో 'సంఘయుగమున' (Sangam Age) దక్షిణహిందూదేశము నేలిన పాండ్యరాజుల పేరును పోలియున్నది. ఇదేదేశపు రాజులు తాము కౌండిన్యుడను భారతీయ బ్రాహ్మణుని సంతతికి జెందినవారని దలచిరి. ఎలియట్ పండితు డీకౌండిన్యుడు మహాబలిపురమునుండి కాంబోడియా కేతెంచెనని వ్రాసియున్నాడు. యవద్వీపమున కళింగమునుండి వచ్చిన త్రితేస్థుడను బ్రాహ్మణు డచ్చట హిందూమతమును స్థాపించెనని మఱియొక గాథ గలదు. ఇండోచైనాలో వారసత్వము స్త్రీలమూలమువనే మలబారు లోని మరుమక్కత్తాయమువలె సంక్రమించును. సుప్రసిద్ధ ద్రవిడగ్రంథ మగు 'మణిమేఖలై' లో యవద్వీపప్రశంస గలదు. అపుత్రుడను బ్రాహ్మణ యువకుడు యవద్వీపరాజపుత్త్రుడుగ జన్మించి, దక్షిణదేశమున మణిపల్లవ మనుచోట నివసించు మణిమేఖలై యనుభిక్షుణివలన ధర్మోపదేశమునంది, బౌద్ధధర్మమును తనరాజ్యమున వ్యాపింపజేసెనట. మణిమేఖలయను పదమునకు జావాభాషలోను, సంఘయుగపు తమిళబాషలోనుగూడ సముద్రమని యర్థము.

(4) <u>శాసనములు</u> :- జావాద్వీపమునందలి శాసనములు మూల వర్మ, అశ్వవర్మ జయవర్మమున్నగు పత్రిస్థరాజన్యుల నామములను పేర్కొనుచున్నవి. వీనిలోని "వర్మ" శబ్దము దక్షిణహిందూదేశపు పల్లవ రాజుల నామములలో గన్పించుచున్నది మఱియు నీశాసనములలోని భాషయు లిపియుగూడ పల్లవశాసనములందలి భాషను, పల్లవగ్రంథ లిపిని బోలియున్నవి ఉత్తరాపథమునందువలెగాక దక్షిణాపథమున బ్రాయిక ముగ శాలివాహనశకమే వాడుకలో నుండినది; ఈప్రాగ్భారతదేశశాసనము లందు నాశకమే వాడబడియున్నది. ఇండోచైనాలోనిభాగమగు లిగోర్ (Ligor) రాష్ట్రము, గోదావరీమండలనివాసియగు నంతకుమారుడను నాతనిచే స్థాపింపబడెనని మఱియొకశాసనము దెల్పుచున్నది. చంపారాజ్య

ముననుండిన విభాగములలో అమరావతి, పాండురంగ, కౌథారయనునవి ముఖ్యములు. ఈయమరావతికి ప్రాచీనాంధ్రసామ్రాజ్యమునకు రాజధానిగనుండి చరిత్ర ప్రసిద్ధినందిన యమరావతీనగరమే మాతృక. రెండవవిభాగము బొంబాయి రాష్ట్రమునందలి ప్రఖ్యాతయాత్రాస్థలమగు పండర్‌పూర్‌ను సూచించుచున్నది. కౌథారము కుఠారమను సంస్కృత దమునకు రూపాంతరము. పరశురామ క్షేత్రమగు మలబారు నీపదము జ్ఞప్తికి వేగలదు. చంపాలోని హిందూరాజ్యము శ్రీమారునిచే నిర్మింపబడినది. దక్షిణహిందూదేశపు పాండ్యరాజుల కీనామ ముండెడిది. జావాలోని తకోపాయనుస్థలమునందలి శాసనమున సేనాముఖం, మణిగ్రామం, చాపత్తార్ అను సంఘములు పేర్కొనబడినవి. ఇందు కడపటినామమునకును "శపథ" శబ్దమునకును సామ్యమున్నది. మలభారులో "సాపత్తార్" అనువారు రాజుల కంగరక్షకులుగ నుండిరి.

(5) దేవతలు :— ఈప్రాగ్భారతదేశమున నారాధింపబడుచుండిన దేవతలందరును దక్షిణహిందూదేశమునకు జెందినవారలే. ఇచట శైవ, వైష్ణవ, బౌద్ధమతములును, వానికి జెందిన దేవతలు నుండిరి. శివునియారాధనము ప్రబలముగ నుండినది. దేవరాజగు నీతడు త్రిమూర్తులలో నగ్రగణ్యుడుగనుండి, హర, పశుపతి, శంకర నామాభిధుడైయుండెను. ప్రత్యేక పష్ణుప్రతిమలును, శంకరనారాయణ హరిహరవిగ్రహములుగూడ నిటనుండినవి. వీరలుగాక లక్ష్మి, ఉమా, స్కంద, గణేశ, నందిమున్నగు దేవతలుగూడ నిదేశములలో నారాధింపబడుచుండిరి. బుద్ధవిగ్రహములు సామాన్యములు. శివునితోబాటు శక్తిగూడ యీప్రాంతముల కేతెంచి భగవతియనుపేరిట నారాధింపబడుచుండెను. దక్షిణహిందూదేశములో రాజులు దేవాలయములను నిర్మించి యందలి దైవములకు దమనామముల నొసంగు టాచారమై యున్నది అట్టి యాచారమే చంపా, కంబోడియా, ఇండోచైనారాజ్యములందును, జావాబలిద్వీపములందును రాజు లవలం

బించుచుండిరి. మఱియొక చిత్రమేమన, కాంభోజ అన్నాందేశములందు ను, జలిద్వీపమునను గొన్ని యాలయములలో విగ్రహముండవలసిన స్థలమునం దొక శూన్యసింహాసనము మాత్రము స్థాపింపబడినది మహెూ న్నతములును, సుందరములునగు, నీయాలయములను, వానియందలి యీశూన్యాసనములను, గాంచినచో "చిదంబర రహస్య" మను నాంధ్ర లోకోక్తికి గారణమగు ద్రవిడదేశములోని చిదంబరమునందలి దేవాలయము జ్ఞప్తికి వచ్చుచున్నది.

(6) మతము :— ఈ దేశములలోని పండితులు మతప్రవర్తకులు గనుండిరి. వీరిలో మూడు తెగలుండెడివి. "చూశూ" యనువారు బౌద్ధులు. మహాయాన మతాను యాయులగుటచే బుద్ధుని విగ్రహము నారాధించుచుండిరి. 'పసూవెయ్' (Pa-ssu wei) అను నింకొక తెగ వారు మెడలో యజ్ఞోపవీతమును ధరించుచుండిరి. బహుశః వీరు వైష్ణవు లైయుందురు. ఈ పాన్‌చూశబ్దమునకును వైష్ణవ గ్రంథమగు పాంచరాత్రా గమమునకును సంబంధమేమైన నుండవచ్చును.

(7) కట్టడములు :— ఈ ప్రాగ్భారతదేశములందలి కట్టడములు గూడ దక్షిణహిందూదేశ సంపర్కమును సూచించుచున్నవి. కాంభోజ దేశ ములోని 'అన్‌కోర్ వాట్, (Ankor w t) దేవాలయ యీ సందర్భమునం దుగగణ్యము. ఇయ్యది యంతరువులుగానున్నది మొదట నొకచతురస్ర మును, దానిపై నంతకంటెను చిన్నదగు మఱియొకటియు, నటుపై నింకను జిన్నదియు, నిర్మింపబడి యీ విధమున పైకి పోనుపోను యీ కట్టడము చిన్నదగుచున్నది. ఎన్నియంతర్వులున్నవో యన్నివరుసల మెట్లు వెలుప లికి గన్పించు చున్నవి. దక్షిణహిందూదేశములోని తిరుచినాపల్లికొండపై దేవాలయమును, తిరుప్పరన్ కున్రం కొండపై యాలయమునుగూడ నిటులే యున్నవి. ద్రవిడదేశమునందువలె నిచ్చటగూడ శైవ వైష్ణవ శిల్పము లెన్ని యోగలవు. కాంబోడియాలోని యాలయములలో గోడలపైనను, ద్వారము

లమీపను రామాయణ మహాభారతములలోని భాగములలోని ఘట్టములు చెక్కబడియున్నవి. ద్రవిడదేశములోని కుంభకోణమునందలి చక్రపాణి దేవళమునను, మధురమీనాక్షి గుడిలోనుగూడ నిట్టివి గలవు. బలిద్వీపాల యములకు గోపురములున్నవి. జావాలోని 'డీఇఙ్గు' పీఠభూమి (Di-ing-plateau) లోనున్న పాండవుల గుడులు మైసూరు రాజ్యము లోని పట్టడకల్, హాలేబీడు, ఐహోలు లందలి చాళుక్య దేవాలయము లను, కాంచీపురములోని కైలాస నాథాలయమును బోలియున్నవి. 'చండీ జాగ్' అను జావాదేవాలయమున విష్ణువర్ధనుడను రాజు బుద్ధునివలె శిల్పింపబడియున్నాడు. దీనిని మఱికొన్ని శిల్పములను బరిశీలించి ప్రాచ్య కళాకోవిదుడగు ఫెర్గుసన్ పండితుడు "ఈదేవాలయమునుండి యవద్వీప మునందలి హిందూమతమునకును' దత్సంబంధములగు శిల్పములకును, భారతదేశమునందలి తెలింగాణమును, కృష్ణానదీముఖద్వారమును, మాతృకలని స్పష్టమగుచున్న" దని వ్రాసియున్నాడు. ఇట్టి శిల్పములు ప్రాంబనం, బెనన్ అనుచోట్లగూడ గలవు ప్రాగ్భారతదేశములందలి శిల్పములలోనెల్ల జావాలోని బొరొబుదుర్ దేవాలయ మగ్రగణ్యము ఒకకొండను దొలిచి, శిఖరమున నొక స్థూపమును' దానిచుట్టు నేడు స్థూపవలయములను శిల్పి యిచట నిర్మించెను. విస్మయజనకమును వర్ణనాతీతము నగు నీయాలయమును బ్రశంసించుచు ఫెర్గుసన్ పండితుడు "శిల్పవైఖరి నిబట్టి చూచినచో నీబొరొబుదుర్దేవాలయమును, హిందూదేశమునందలి అజాంతాగుహలనుగూడ నొకేశిల్పి నిర్మించెననియు, నిరెంటికి నడుమ కాలవ్యత్యాసము విశేషముగ నుండియుండ"దనియు వ్రాసియున్నాడు. మఱికొన్ని విషయములలో నీయాలయము పల్లవులచే మహాబలిపురమున నిర్మింపబడిన దేవాలయములను బోలియున్నది. ఇచ్చటి యాలయపుటాకృతి కాశ్మీరమునను, మళయాళమునను శాక్తేయులు రచించు శ్రీచక్రమువలెనున్నది.

# భారతీయ నాగరికతా విస్తరణము

## IX ఆంధ్రదేశము — ప్రాగ్భారత దేశములు.

ఇంతవరకును దక్షిణహిందూదేశమునకును బ్రాగ్భారతభూములకు నుగల సంబంధమును పేర్కొని యుంటిమి. ఈ దేశాంతరములలో భారతీయనాగరికతను విస్తరించునెడ నాంధ్రదేశ మెక్కుడుగ బాలొనియుండెను. ఈ విషయమై గొన్నివివరము లిట పేర్కొనబడుచున్నవి.

ఆంధ్రదేశమున దక్షిణమున పులికొట్ చెరువు మొదలుత్తరమున కళింగపట్టణము వరకును దీర్ఘమగు సముద్రతీరముండుటచే, సముద్రయానమునకు సౌకర్య మెక్కువగనుండినది. వంశధారా, గోదావరీ, కృష్ణా, పినాకినీ నద్యులమూలమున లోభాగములకుగూడ నౌకలు పోవుచుండినవి. క్రీ. శ. 12 వ శతాబ్దములనాటివగు (Pariplus of the Erythrian Sea and Ptolemy's Geography) లలోనా కాలమున కృష్ణాగోదావరీ ముఖద్వారములనుండి నౌకలు దూర్పునకేగుచుండెడివని వ్రాయబడినది. ఈ కాలమున రెండురకముల నౌకలుండెడివి. ఒక విధమైనవానిని తీరమునందలి వాణిజ్యమునకును, మరియొక విధమగు వానిని విదేశవాణిజ్యమునకు నానాటి యాంధ్రు లుపయోగించుచుండిరి.

బహుప్రాచీన కాలమునుండియు నాంధ్రదేశవాణిజ్యప్రశంస గలదు, భీమసేన జాతకమునం దీదేశము నేతపరిశ్రమకు ముఖ్యస్థానమని చెప్పబడియున్నది. పర్తియాలలో వజ్రపు గనులును, వినుకొండలో రాగి గనులును, పల్నాడులో సీసము చలువరాళ్ళుగలగనులు నాకాలమునం

దుండెడివి. శాతవాహనాంధ్రులకాలమున వాణిజ్యమభివృద్ధినందెను. టగర ప్రతిష్ఠాన నగరములందలి బజారులలో కృష్ణాగోదావరీనదులమూలమున దేశములనుండి గొనితేబడిన మస్లినులును (Muslins) వర్ణవస్త్రములు నమ్మబడుచుండెడివి. పినాకినీముఖద్వారమును, మనర్ప కొట్టిస్, కృష్ణముఖద్వారములు, కొన్టకొస్సల, కొడ్డుర, అల్లొస్గైనిమున్నగు నౌకాశ్రయస్థానములను టాలెమీ పేర్కొనియున్నాడు మనర్ఫ యనునది నేటి నెల్లూరుజిల్లాలోని మన్నేరుపైనున్నది. కొట్టిస్‌రేవు గుంటూరు జిల్లాలోని అల్లూరు కొత్తపట్టణమునకును, కొంటకోస్సల బంచరువద్దగల ఘంటసాలకును, కొడ్డూర బందరువద్దనున్న గూడూరుకును, అల్లొస్గైని గోదావరీముఖ్యద్వారమునకును సరియగుచున్నవి. ప్రాగ్భారతదేశమునందలి రేవులలో అరకాన్‌కు ముఖ్యపట్టణమగు త్రిలింగనగరమును, సయాంలోని కాకుళనగరమును, మలేద్వీపకల్పములోని సింహపురమును, బ్రహ్మపుత్రానదికిని అరకాన్‌కును నడుమగల పెంటపలిస్‌పట్టణము నాంధ్రదేశమునందలి శ్రీకాకుళమును, విక్రమసింహపురమును (Nellore) మోటుపల్లిని సూచించుచున్నవి. శాతవాహనులయొక్కయు బల్లవులయొక్కయు నాణెములపైనుండు నౌకాచిత్రములు విదేశీయసంబంధమును సూచనజేయుచున్నవి. ఈ విధమున నీసంబంధము దినదినాభివృద్ధి నందినది.

అరకాన్ సయాందేశములలో వేంగీ చాళుక్యరాజులగు శక్తివర్మయొక్కయు, రెండవ రాజరాజుయొక్కయు నాణెములు దొరకుటచే క్రీ. శ. 12 వ శతాబ్దము వరకునుగూడ నాంధ్రదేశమున కీప్రాగ్భారతదేశములతో సంబంధముండినటుల దెలియుచున్నది. ఈ కాలమున నిట్టిసంపర్కమునకులోనైన దేశముల చరిత్రము సంక్షేపముగ నీదిగువ వ్రాయబడుచున్నది.

(1) బర్మా :— బర్మాలోని పెగూతీరమునకు "కళింగ" మనియు, దాని కించుక బశ్చిమోత్తరముగనుండు భాగమునకు 'ఉత్కళ', మని

యు నామములుండెడివి. ఈ దేశములో కృష్ణాగోదావరీ తీరస్థులు పెగూలో నికి వలనవచ్చిరని యొకగాథగలదు. బర్మాలోని 'తైలంగులు, త్రిలింగ దేశవాసుల సంతతివారైయుందురు. ప్రాచీన త్రైలింగభాషలో సంస్కృత పదములును, ఆంధ్రదేశ ప్రశంసయు గాంచనగుచున్నది. ఈత్రైలింగ లిపి క్రీ. శ. 4 వ శతాబ్దపు వేంగిలిపిని బోలియున్నది ప్రోం జిల్లాలో క్రీ. శ. 1 వ శతాబ్దిలో నాంధ్రదేశమున లిఖంపబడిన శాసనముల లిపిని బోలు లిపిలో వ్రాయబడిన శాసనమొకటి గన్గొనబడినది. ఇచ్చటనే యొక బౌద్ధస్తూపమునం దాంధ్రదేశపు తెలుగు కన్నడ లిపిలో వ్రాయబడిన మరి యొక శాసనమున్నది. బర్మాలోని పెగన్ (Pegan) లో బూర్వము రాజ్య మేలిన 'శాన్ లన్ క్రోం, (San Lan Krom) అను రాజు బర్మాలో బౌద్ధ మతమును వ్యాపింపజేసెనని శాసనాలంకార మనుగ్రంథమునుండి తెలియు చున్నది. ఈ రాజు క్రీ. శ. 3-5 శతాబ్దములలో వేంగిదేశము నేలిన శాలం కాయనుల సంతతివాడనియు, నీవెంగిరాజులు బర్మాలో నొక రాజ్యమును నెలకొల్పి దమవంశీయు నొకనిని దత్పాలకునిగ నియమించిరనియు, బండి తుల యభిప్రాయము.

(3) మలేద్వీపకల్పము :- ఇచటి తూర్పుతీరమునందలి 'లిగోర్' నగర మశోకుని వంశీయునిచే నిర్మింపబడెననియొక గాథగలదు. పల్లవ వంశమునం దొక యశోకుడు పేర్కొనబడియున్నాడు. ఆతడే యీ స్థాపకుడై యుండునేమో. సాల్మోనీయను పండితుడు లిగోర్‌నగరమునందలి హిందూ శిల్పము ఎల్లోరా మహాబలిపుర శిల్పములను పోలునని వ్రాసియున్నాడు. స్వర్గలోక (Sanvan Kolak) మను మఱియొక స్థలమున దొరికిన కంచు ప్రతిమలకు, ఆంధ్రదేశమునందలి గుంటూరు జిల్లాలోని 'బుద్ధాని' విగ్ర హమువలె కోలముఖములును, స్ఫుటములగు కేశములును, చంద్రవంకల బోలు కన్బొమలును, కొక్కెములవంటి ముక్కులును, నగు మోములును గలవు.

(3) ఇండోచైనా :— ఇందలి వోకన్ [Vocon] అను చోట దొరకిన శిలాశాసనము రుద్రదాముని గిర్‌నార్ శాసనమును సర్వవిధముల ననుకరించుచున్నది. చంపా రాజ్యము [ఇప్పటి Annam] నేలిన మొదటి భద్రవర్మకు "ధర్మమహారాజ" అను బిరుద ముండెడిది. ఇది యాంధ్ర పల్లవరాజుల బిరుదము. ఈ ప్రాంతమునందుండిన హిందూరాజ్యములలో ఫూనన్ [Funon] మఱియొకటి దీనిని స్థాపించి హిందూమతమును వ్యాపింపజేసిన కౌండిన్యుడను బ్రాహ్మణుడు ద్రోణాచార్యుని తనయుడగు నశ్వత్థామవద్దనుండి యొక యీటెనుగొని యీదేశమున బ్రతిష్ఠించెననియు, నిచట నొక నాగకన్యను వివాహమై రాజ్యభారమును వహించెననియు, క్రీ. శ. 579 నాటి యొక శాసనము దెల్పుచున్నది. ఆంధ్రపల్లవులలో చూతపల్లవుని కుమారుడగు వీరకూర్చవర్మ నాగకన్యనుద్వాహమై రాజ్యమును సంపాదించెను ఈ పైకౌండిన్యునిగాథ యీ చారిత్రక విషయమునకు సరియగుచు, బల్లవుల కీ ఫూనన్ రాజ్యముతోగల సంబంధమును జూపుచున్నది. వేంగీరాజ వంశీయుల నామములగు చంద్రవర్మ, దేవవర్మ, జయవర్మయను నామము లీ ఫూనన్ రాజులకుగూడ గాంచనగుచున్నవి. చంపా రాజ్యమునను, కళింగదేశమునను గూడ ఇంద్రవర్మాభిధులగు రాజులు పెక్కండ్రుగలరు. ఇండోచైనాలోని శాసనములన్నియు సంస్కృత భాష యందును, చాళుక్యలిపిలోను వ్రాయబడియున్నవి. వీనిలో శాలివాహన శకముగూడనున్నది.

(4) సింహళద్వీపము :— ఆంధ్రదేశమునకును సింహళ ద్వీపము [Ceylon] నకును సన్నిహితమగు సంబంధ ముండెడిది. దుత్తగామినియగు భిక్షు వాంధ్రదేశమునుండి బుద్ధుని యవశేషములను సంపాదించి, దంతపురమున స్థాపించియొక స్థూపమును గట్టించెను. ఆసమయమున జరగిన సమావేశమునకు పల్లవ భోగమునుండి వేలకొలది భిక్షువు లేగిరి. ఈ పల్లవ భోగము నిప్పటి గుంటూరు మండలములోని పల్నాడు [పల్లవ— నాడు] తో

జంతువులు సమన్వయించియున్నారు. ఈ ద్వీపమున గుంటూరుజిల్లాలోని ఉండవల్లి గుహలవంటి గుహలుకూడ గలవు.

పైవిధముల భారతీయ నాగరికతను దేశాంతరములలో విస్తరించు నెడ నుత్తరాపథ దక్షిణాపథములు రెండును సమముగ బాల్గొనినవి. ఆఫ్గనిస్థానము, కాష్గర్, యార్కండ్, కోటాన్, టిబెట్, చైనా, జపాన్ దేశముల నుత్తరాపథమునుండియు, బర్మా, ఇండోచైనా, సయాం, మలేద్వీపకల్పము, జావా, బలి, సుమాత్రా, బోర్నియో, మొలక్కస్, సెలిబిస్ మున్నగు దేశములకు దక్షిణ హిందూదేశమునుండియు భారతీయ నాగరికత వ్యాపించినది. ఈ నాగరికతా విస్తరణమునందు ప్రాచీనాంధ్రులు నిశేషముగ పాల్గొనియుండిరి. క్రీస్తుశకారంభమునుండి సుమారు పండ్రెండవ శతాబ్దమువరకునుగూడ భారతదేశము ఆసియాఖండమునందు సువిశాలమగు వైజ్ఞానిక సామ్రాజ్యము నేలుచు ప్రాచ్య ప్రపంచమున కధినేతయై యుండెను.

# భారతీయ నాగరికతా విస్తరణము.

## X సుమాత్రాద్వీపము.

### సుమాత్రా ప్రశంస.

హిందూవాఙ్మయమునం దనేక స్థలముల సుమాత్రాద్వీపప్రశంస గలదు. శ్రీమద్రామాయణమున సీతాన్వేషణార్థము వానరులనంపుచు సుగ్రీవుడు తూర్పుదిశకేగు వారలు గంగా బ్రహ్మపుత్రా ముఖద్వారములను దాటి ఇండోచైనామీదుగా బంగారపు గోడలుగల సువర్ణద్వీపమున కేగవలెనని యాజ్ఞాపించెను. బృహత్కథాసారమగు శ్లోక సంగ్రహమునను, నిద్దేశ మిలింద పన్హాయను బౌద్ధ గ్రంథములందును, చైనానుండి సముద్రముపై దక్షిణముగ బోవువారలు జూచుదేశములలో బర్మాదేశమును జావాసుమాత్రా దీవులును పేర్కొనబడినవి. బౌద్ధవాఙ్మయమునుండి ప్రాచీనకాలమున సుమాత్రాద్వీపమున బంగారము విశేషముగ దొరుకునను నాశతో నెల్లరు నటకేగు చుండిరని తెలియుచున్నది. క్రీ. శ. 7 వ శతాబ్దమున "ఈత్ సింగ్" అను చైనాదేశ యాత్రికుడు సుమాత్రాలోని శ్రీవిజయ రాజ్యమునకేగి, యటనుండి హిందూదేశమునకు రాక పోకలను జరుపు నారాజు యోడలలో నొకదానిపై బయనము చేసి తామ్రలిప్తి నగరమునుజేరెను. దక్షిణహిందూదేశమున రాజ్యమేలిన చోళరాజుల శాసనములలో శ్రీ విజయరాజ్య ప్రశంస గలదు. **11** వ శతాబ్దమున దక్షిణ హిందూదేశమునందలి నాగపట్టముణ ములో శ్రీవిజయరాజగు చూడామణి వర్మ యొక బౌద్ధాలయమును గట్టింప

నాతని పుత్రుడగు మారవిజయోత్తుంగవర్మ దానిని బూర్తి చేసెను. అదేకాలమున రాజేంద్రచోళుడు సుమాత్రాద్వీపముపై నొక నౌకాదళమును పంపి, యచ్చటిరాజగు సంగ్రామ విజయోత్తుంగుని జయించి, విశేషధనరాసులను కొల్లగొనెను వీర రాజేంద్ర చోళుడుగూడ మరియొకతూరి యిటులే విజయమునందెను. ఉత్తరహిందూదేశ శాసనములలోగూడ సువర్ణద్వీప ప్రసంగగలదు. నాలందాలో 9 వ శతాబ్దినాటి యొక తామ్రశాసనము దొరకినది. దానినుండి, ధర్మసేతువను శ్రీవిజయరాజు యవద్వీపరాజపుత్రికను వివాహమయ్యెననియు, వారి పుత్రుడగు మహారాజ బాలపుత్ర దేవుడు బుద్ధభక్తుడగుటచే నాలందా విద్యాపీఠమునందొక విహారమును నిర్మించెననియు, దెలియుచున్నది. 10 వ శతాబ్దమున నాలందా విశ్వవిద్యాలయమునం దధ్యక్షుడుగ నుండిన దీపంకర అతీశుడు స్వర్ణభూమికేగెను. అదేశపు రాజపుత్రు డొకడు జంబూద్వీపమున కేగి బుద్ధగయలో ఆచార్యమహాశ్రీరత్న యను భిక్షువువద్ద ధర్మోపదేశమునంది, స్వదేశమునకు మరలి బౌద్ధధర్మమును ప్రచారము చేసెను. అతీశుడు సుమాత్రాలో 12 సంవత్సరములుండి యాకాలపు బౌద్ధపండితులలో నప్రతిముడగు ధర్మకీర్తివద్ద తత్త్వమును నేర్చుకొనెను. 11 వ శతాబ్దమునాటి యొక నేపాళదేశ లిఖిత గ్రంథమున "స్వర్ణభూమిలోని శ్రీ విజయపురమునందు లోకనాథాచార్యుడు" అను శీర్షికతో నొక చిత్రముగలదు. బృహత్కథలో హిందూవర్తకులు స్వర్ణద్వీపముతో వాణిజ్యము సేయుచుండిరని యున్నది యీ యాధారముల నుండి బూర్వము హిందూదేశమునకును సుమాత్రా ద్వీపమునకును సన్నిహితమగు సంబంధ ముండెడిదని తెలియుచున్నది.

## శ్రీ విజయ రాజ్యము.

సుమాత్రా ద్వీపమున శ్రీ విజయమను పట్టణము రాజధానిగా నొక రాజ్యముండెడిది. దీనిని శైలేంద్ర వంశోద్భవులగు రాజులు పాలించు

చుండిరి. క్రీస్తుశకారంభమునకే యీ ద్వీపము హిందూమతము నవలంబించినది. చైనాదేశీయులు శ్రీవిజయ రాజ్యమును "పాలెంబాన్గ్" (Palembang) అని పిలచిరి. 5 వ శతాబ్దమునందీ రాజ్యముండెనదని వారు వ్రాసియున్నారు. 7 వ శతాబ్దమున సుమాత్రాకును మలేద్వీపకల్పమునకును నడుమ గల వంకాద్వీప మీ రాజ్యమున జేరియుండెను. మఱునటి శతాబ్దమునందీ రాజ్యము మలేదేశమున చాలవరకును వ్యాపించెను. ఈ కాలమున మధ్యజావాద్వీపము శైలేంద్ర రాజులచే జయింపబడినది. ఈ రాజులలో నొకడిచ్చట "కలస్సన్" అనుచోట తారాదేవి కొకయాలయమును గట్టించెను. ఇందత్యద్భుతములగు శిల్పములున్నవి. శ్రీవిజయరాజ్య నౌకాదళమును చంపారాజ్యము (Annam) నకును కాంభోజ రాజ్యము (Cambodia) నకును గూడ నేగి విజయములను గాంచినవి. ఈ శైలేంద్ర రాజులు మహాయాన బౌద్ధులు. నాలందా విద్యాలయాచార్యుడగు ధర్మపాలుడిచటనే దనయవసాన కాలమును గడపెను. ఈ రాజుల శాసనములు చాలభాగముత్తర హిందూదేశమున 8, 9 వ శతాబ్దములందుండిన లిపిలోనే వ్రాయబడియున్నవి. కానపాలవవంశీయుల కాలమున మగధ వంగదేశములలో ప్రబలిన మహాయాన బౌద్ధమే యీ కాలమున సుమాత్రాద్వీమునకు వ్యాపించెనని స్పష్టమగుచున్నది. ఇంతకు పూర్వమిట హిందూశైవమతము ప్రబలినది. ఈ రెండు మతముల సంమిశ్రణమువలనను తాంత్రిక సిద్ధాంతమీద్వీపమున ప్రబలినది. 10, 11 శతాబ్దములలో దక్షిణహిందూదేశమునుండి చోళరాజులు సువర్ణద్వీపముపై ననేకసారులు దాడి వెడలిరని యిదివరలో దెలిపితిమి. ఇటులు చోళులకు సామంతులగుటచేతనే శైలేంద్ర రాజులిర్వురు నాగపట్టణమున-బౌద్ధాలయమును నిర్మింపగల్గిరి. ఈసమయమున శ్రీ విజయరాజ్యమునకు లోబడియుండిన జావాద్వీపము స్వతంత్రించినది.

12 వ శతాబ్దమున శ్రీ విజయరాజ్యము మిగుల ప్రఖ్యాతిపహించి, జావా రాజ్యముతో సరియగు పదవి నలంకరించినది. 13 వ శతాబ్దము సుమాత్రాద్వీప చరిత్రమున నిరుపమమైనది. ఈ కాలమున చైనా చక్రవర్తి పక్షమున సుంకాధికారిగ నుండిన యొక చైనా దేశీయుడు సువర్ణద్వీపము ను గూర్చి యీ క్రింది విశేషాంశములను వ్రాసియున్నాడు.

“శ్రీ విజయ రాజులు నౌకావిహార మొనర్చునపుడు బంగారు పల్లెములను ధరించుభటులు వారితో నేగుదురు. ప్రజలు నీటిపైన తెప్పలమీద నివసింతురు. వారేమియు సుంకముల నీయరు. యుద్ధసమములలో సైనికులు నాయకులను తామే యెన్నుకొనెదరు. శత్రువులను నిర్జించుట యందును, మృత్యువును తృణప్రాయముగ నెంచుట యందును వారగ్రగణ్యులు. వీరు సంస్కృతభాషనే వ్రాతకోతల కుపయోగింతురు. ఇచ్చటి శాసనము లతికఠినములు. వ్యభిచారమును జేసినవారికి మృత్యుదండనము విధింపబడును. ఇచటి రాజుచనిపోయినచో ప్రజలు శిరోముండనము జేయించుకొని తమ విచారమును బ్రకటింతురు. రాజభృత్యులు శవముతో సహగమనము జేయుదురు. క్రొత్తరాజులు సింహాసనము నెక్కుటకు బూర్వము బంగారముతో దమప్రతికృతిని చేయింతురు. ప్రజలీ విగ్రహమునకు గానుకల నర్పించెదరు. శైలేంద్రవంశీయులకు “నాగరాజ” యనునది బిరుదము. ఈ దేశీయులు విదేశములనుండి ముత్యములు, పన్నీరు, ఇంగువ, దంతము, పగడములు దూదిబట్టలు మున్నగు వానిని దిగుమతిచేయుదురు. విదేశీయులిటనుండి బంగారము పట్టు, పంచదార, కర్పూరము మున్నగువానిని గొనిపోదురు.”

ఈ కాలమున పహంగ్, కెడ, కిలంటన్ మొదలగు మలేప్రాంతములును, పశ్చిమ జావా, సింహళద్వీపములును మఱి పంద్రెండు రాజ్యములును శైలేంద్రవంశీయుల యాధిపత్యమునం దుండినవి. 13 వ

శతాబ్ది యుత్తరార్థమున శ్రీవిజయ రాజ్యము క్షీణించినది. 1277 లో జావాలో ప్రసిద్ధికెక్కిన సింగ సరిరాజులు సుమాత్రాలో చాలభాగమును జయించిరి. వారికి బిమ్మట రాజ్యమేలిన బిల్వతిక్తపుర రాజులీద్వీపమును క్రమముగ స్వాధీనము జేసికొనిరి. ఈ జావా రాజులు సుమాత్రాద్వీపమును సంరక్షింపక, నయ్యది తిరిగి తలయెత్తి తమ కపాయమును గూర్చునను భయమున దానిని వదలివేసిరి. అంతట చైనాదేశీయు లనేకు లిట జేరి, వాణిజ్యనౌకలను కొల్లగొట్టుచు జీవించుచుండిరి క్రీ. శ. 9-13 శతాబ్దములలో మహాకీర్తిని గడించి, సుభిక్షమగు భూమిగల యీ ద్వీపము క్రీ. శ. 14 వ శతాబ్దమున కేవలము సోదదొంగల కాశ్రయస్థానమై నశించినది.

బౌద్ధ శిల్పకళాచరిత్రమున శ్రీ విజయరాజ్య చరిత్రమెంతయు ముఖ్యమైనది. జావాద్వీపములోని కలస్సన్, బొరొబుదుర్ శిల్పములు భారతీయ శిల్పముల కెనయగునని పండితుల యభిప్రాయము. ఈ శిల్పములను శైలేంద్రవంశీయులే నిర్మింపజేసిరి. స్థూపములను బోలు కట్టడములను భారతదేశమునుండి యీ రాజులే సూమాత్రాదీవిలోనికి దెచ్చి యట నుండి జావా, బోర్నియోలకు వ్యాపింపజేసిరి అలంకార శిల్పమునందును, కట్టడముయొక్క బాహుళ్యతకు సరియగునటుల వివరములను నిర్మించుట యందును, బౌద్ధవాఙ్మయమునకును, ఇతిహసమునకును సరియగు ప్రతి కృతులను శిల్పములను నిర్మించుటయందును, సూమాత్రాద్వీపవాసు లగ్రగణ్యులని కళాభిజ్ఞులు పొగడియున్నారు.

ఇటుల ప్రాచీన భారతదేశముతో సన్నిహిత సంబంధమును గలిగియుండి, యిచ్చటి నాగరికతను విదేశములలో వ్యాపింపజేసి, బూర్వహిందూదేశముయొక్క విశ్వవిఖ్యాత ప్రవృత్తికి ప్రబలనిదర్శనమైయున్న యీ శ్రీ విజయపురాధీశ్వరులగు శైలేంద్రరాజుల చరిత్రము చిరస్మరణీయమై యొప్పుచున్నది.

# భారతీయ నాగరికతా విస్తరణము

## XI. యవద్వీపము (జావా)

### యవద్వీప ప్రశంస.

హిందూవాఙ్మయమునం దనేకస్థలములలో యవద్వీపప్రశంస గలదు. సీతాన్వేషణార్థమై దన యనుచరుల ననేక దిశలకు బంపుచు సుగ్రీవుడు వారలు పూర్వమునం దతిక్రమింపవలసిన దేశములను బేర్కొని యున్నాడు. అందుబ్రాగ్దిశకేగువారలు గంగానదీముఖద్వారమును దాటి, సువర్ణద్వీపము నతిక్రమించి, యనేకములగు బంగారపు గనులు గలిగి యేడురాజ్యములుగ విభంజింపబడిన యవద్వీపము నన్వేషింపవలసి యుండెను.

క్రీ. శ. 2 వ శతాబ్దమునం దనేకదేశములను దిరిగి యొక భూగోళశాస్త్రమును రచించిన "టాలెమి" (Ptolemy) యను యవనదేశీయుడు "జబడియూ అనగా యవలుపండు ద్వీపమని యర్థము. ఇచ్చటిభూమి కడు సారవంతమైనది. ఇందనేక బంగారుగనులు గలవు" అని వ్రాసి యున్నాడు. బౌద్ధగ్రంథములగు మిలిందపన్హశ్లోక సంగ్రహ మున్నగు వానిలో నావికులకు బ్రాగ్భాగమున గాంచనగు నౌకాశ్రయస్థానములు వర్ణింపబడియున్నవి. వానిలో తక్కోల, కలముఖ, మరణపర, వెసుంగ, వెరపథ, జవ, తామ్రలిప్తి, వంగ, సువర్ణకూట, సువర్ణభూమి మున్నగునవి ముఖ్యములు. క్రీ. శ. 5 వ శతాబ్దమున జీవించిన ఆర్యభటుడను జ్యోతిశ్శాస్త్రజ్ఞుడు

"సింహళమున సూర్యోదయమగునపుడు యవకోటిలో మధ్యాహ్నమును, రోమకదేశమునం దర్ధరాత్రమునై యుండు,, నని వ్రాసియున్నాడు. అదే కాలమున రచింపబడిన 'సూర్యసిద్ధాంత, మను జ్యౌతిషగ్రంథమునందు "భూమియొక్క చుట్టుకొలతలో నాల్గవభాగమున, తూర్పుదిశకు స్వర్ణకుడ్య వ్యాశోభితమగు 'యవకోటి, యనునగరము గల" దని వ్రాయబడి యున్నది. క్రీ. శ. 8 వ శతాబ్దమున రచింపబడిన "మంజు శ్రీమూల కల్ప"మను బౌద్ధగ్రంథమున జావా, బాలిద్వీపములలోని భాషయస్పష్ట మైనదనియు. 'ర, యనుశబ్దమందు తరచుగ వచ్చుచుండుననియు జెప్పబడియున్నది 'నవకనాడు" అనునామాంతరముగల యవద్వీప మునందలి నాగపురమునందు ఇంద్రుని సంతతివారగు భూమచంద్ర, పుణ్యారాకయనువార లిద్దఱు రాజ్యమేలిరని "మణిమేఖల" యను ద్రవిడకావ్యమున జెప్పబడియున్నది. క్రీ. శ. 11 వ శతాబ్దమునాటి యొక నేపాళదేశ లిఖిత గ్రంథమునందు "యవద్వీపమున దీపంకర అతి శుండు" అనుపేరిట నొక చిత్రము వ్రాయబడియున్నది. 'రసమాల, యను గుజరాతీ గ్రంథమున "జావాకుపోయినవాడు తిరిగిరాడు. అదృ ష్టవశమున దిరిగివచ్చినచో రెండు పురుషాంతములకు సరిపడువెండి మూట లతో వచ్చును" అను నొకసామెత గలదు. ఈ ప్రశంసలనుండి క్రీస్తుశకా రంభమునుండియు హిందూదేశమునకును యవద్వీపమునకును సన్నిహిత మగు సంబంధముండెడిదని స్పష్టమగుచున్నది.

## మొదటి రాజులు.

జావాద్వీపపు సమగ్ర చరిత్రమును రచించుటకు వలయుసాధనము లింకను లభింపవలసి యున్నవి. చైనా దేశీయుల వ్రాతలనుండియు జావా, బోర్నియో, సుమాత్రాదీవులందు దొరకిన శాసనముల నుండియు క్రీ. శ. 2 నుండి 10 వ శతాబ్దమువరకును గల యవద్వీపచరిత్రమునందలి

విశేషాంశములు గొన్ని తెలియనగుచున్నవి. ఈ కాలమునందీ ద్వీపమునకు దక్షిణ హిందూదేశముతో నెక్కుడు సంబంధముండెడిది. బోర్నియో ద్వీపమున మిక్కలి ప్రాచీనములగు శాసనములు లభించినవి. వీనిలిపి దక్షిణ హిందూదేశము నందలి ప్రాచీన పల్లవశాసనములను బోలియుండుటచే చరిత్రకారు లియ్యవి క్రీ. శ. 4 వ శతాబ్దమునాటివని నిర్ణయించిరి. ఈ సంస్కృతభాషాశాసనములనుండి యీ ప్రాంతమునం దశ్వవర్మతనయుడగు మూలవర్మ రాజ్యమేలెననియు, నాతడు బ్రాహ్మణులచే శిలాయూపములను నిర్మింపజేసి 'బహుసువర్ణక', మను యజ్ఞమును జేసెననియు దెలియుచున్నది, ఈ రాజనామములు పల్లవ రాజులగు స్కందవర్మ, మహేంద్రవర్మ మున్నగువారి నామములవలె నున్నవి. యజ్ఞములను బ్రాహ్మణ సన్మానమును జేయుటయుగూడ పల్లవుల యాచారములే.

పశ్చిమ జావా:— క్రీ. శ. 5 వ శతాబ్దమునకు బశ్చిమ జావా రాజ్యము ప్రసిద్ధికెక్కినది. పల్లవగ్రంథలిపితో లిఖింపబడిన యీ కాలపు శాసనములు కొన్ని పూర్ణవర్మయను రాజునుగూర్చి విశేషాంశములను దెలుపుచున్నవి. ఈతండు తరుమర నగరాధీశ్వరుడు. చంద్రభాగా, గోమతి యను పేరిట రెండు కాల్వల నితడు త్రవ్వించెను. ఈతని రాజ్యకాలమున 'ఫాహియన్', పశ్చిమ జావాకు వచ్చెను. అప్పటి కచట బౌద్ధమతము ప్రబలియుండక దేశమునం దనేకులగు బ్రాహ్మణు లుండిరట. ఈ దేశమునకును చైనాకును వర్తక వ్యాపారము జరుగుచుండెడిది. క్రీ. శ. 413 లో 200 మంది హిందూవర్తకులతో నిండియుండిన యోడపై ఫాహియన్ చైనాకు బయల్వెడలెను. క్రీ. శ. 423 లో కాశ్మీర రాజపుత్రుడగు గుణవర్మ యీ రాజ్యమున గొంత కాలము బౌద్ధమత ప్రచారమొనర్చి, యటనుండి 'నంది', యను నొక హిందువు యోడలో చైనాకు పోయెను. క్రీ. శ. 6 వ శతాబ్దమున పశ్చిమ జావారాజ్యము క్షీణించినటుల చైనా దేశీయుల వ్రాతలనుండి తెలియుచున్నది. ఈ కాలపు రాజులలో నొక

యాతడసమర్థుడగుటచే ప్రజలు శూరుడగు నొక రాజబంధువు నాశ్రయింప సాగిరి. అంతట రాజీతనిని దేశమునుండి వెడలగొట్టెను. ఈ శూరుడు హిందూదేశమునకేగి యచటి రాజపుత్రి నొకయామెను పెండ్లాడి, జావారాజు మరణించిన పిమ్మట తానాదేశమునకు రాజుగా నేతెంచెను. ఇటుపైని పశ్చిమ జావా చరిత్రము దెలియుటలేదు.

మధ్యజావా – క్రీ. శ. 7–వ శతాబ్దమున మధ్యజావాలో నొక రాజ్యము నిర్మింపబడి త్వరలో బ్రసిద్ధికెక్కెను. 674 నాటి కిచ్చట 'సోమా' యనురాజ్ఞి యేలికగనుండెను. ఆమెపరిపాలనమున బ్రజలు మిక్కిలి నీతిపరులుగను దర్మ బుద్ధిగలవారుగ నుండిరనియు, నొకచోట నొకవర్తకునిచే బరీక్షార్థ ముంచబడిన బంగారపు పేటిక తిరిగి యావణిజుడు గైకొనువరకును మూడు సంవత్సరముల కాలమటులే యుండెననియు అరబ్ దేశీయులు వ్రాసియున్నారు. క్రీ. శ. 654 నాటి శాసనమొకటి యీ మధ్య జావాలో దొరికినది. ఇది సంస్కృతభాషలో పల్లవ గ్రంథలిపిలో వ్రాయబడినది. 'కుంజరకుంజ' యను పుణ్యక్షేత్రమునం దొక శివాలయము పునరుద్ధరింపబడెనని యీ శాసనము దెలుపుచున్నది ఈ రాజ్యమును బూర్వము సన్నహూడనునతడు మనువువలె నేలుచుండెనట. అతనివెనుక నాతని పుత్రుడగు సంజయుడు రాజ్యమునకు వచ్చెను. మహా పరాక్రమశాలియగు నతడు జావాద్వీపమునంతటిని జయించి, సుమాత్రా, బాలిద్వీపపాలకులవలనను, మలేద్వీపకల్పపు రాజుల వద్దనుండియు కప్పములను గొనెను.

ఇటుపై క్రీ. శ. 760 నాటి మఱియొక శాసనము గజయనుడను రాజుగూర్చి విశేషములను దెల్పుచున్నది. ఒకప్పుడు వర్షాభావము గల్గుటచే నీ రాజు తన పూర్వులు దేవదారు కఱ్ఱతో నిర్మించిన అగస్త్యమహర్షి విగ్రహమును జూచి నీలశిలతో దానికొక ప్రతికృతిని జేయించెను. పిమ్మట

నీ విగ్రహము 'మహర్షిభవన, మను నాలయములో నొకనాడు కుంభలగ్నమున బ్రతిష్ఠింప బడెను గజయన రాజు బ్రాహ్మణ భక్తుడుగూడ నైయుండెను.

క్రీ. శ. 8 వ శతాబ్దినాటి కీశైవరాజులు మధ్య జావాలో క్షీణించిరి. ఈ భాగమంతయు సుమాత్రాద్వీపమునుండి రాజ్యమేలుచుండిన శైలేంద్ర వంశీయుల యాధిపత్యమునకు లోనయ్యెను. ఈ కాలముననే జావాద్వీపమున శిల్పకళ యపూర్వశోభను గాంచినది. క్రీ. శ. 778 లో శైలేంద్ర వంశపు రాజొకడు మధ్యజావాలోని కలస్సనులో నత్యద్భుతమగు నొక దేవాలయమును నిర్మించి 'తారా, యను బౌద్ధదేవతనందు బ్రతిష్ఠించెను. ఈ రాజు లందరును మహాయానబౌద్ధులు. ఇంతటినుండియు మహాయాన శైవమత సమ్మేళన మూలమున శిల్పకళకు నూతనోత్తేజము గల్గినది. జావా శిల్పములలో నగ్రగణ్యమును, విశ్వవిఖ్యాతమునగు బొరొబుదుర్ దేవాలయ మీ కాలము నాటిదే. ఈ శిల్పములు భారతదేశమునందలి గుప్త వంశీయుల శిల్పముల కెనయగుచున్నవి. క్రీ. శ. 10-వ శతాబ్దమున జావాద్వీపమునందలి విదేశీయ పరిపాలన మంత మందెను. ఇంతవరకు నాద్వీపమునందలి తూర్పు భాగమున దలదాచుకొనిన హిందూ రాజులు, శైలేంద్రవరాజ ప్రతినిధుల నోడించి మధ్యజావాను స్వాధీనము చేసికొనిరి. ఇటుపై నీ దేశమునం దనేకములగు హిందూదేవాలయములు బయల్వెడలినవి. వీనిలో 'ప్రాంబనన్, ఆలయ మగ్రగణ్యము. ఇందు రామాయణమంతయు శిల్పమున జిత్రింపబడినది. పదియవ శతాబ్దాంతమునకు మధ్యజావా రాజ్యము నశించినది. తుదకొక యగ్నిపర్వత మీ దేశమును నాశ మొనర్చుటచే బ్రజలు దీనిని విడనాడిరి.

తూర్పు జావా :— పిమ్మట యవద్వీపమునందలి తూర్పు భాగమునందొక రాజ్యము బయల్వెడలినది. దీనిని సింద్‌క్ అనునతడు నిర్మిం

చెను. ఈతని మనుమరాలు బాలీద్వీప రాజప్రతినిధియగు ఉదయనుని బెండ్లాడెను. వీరికి ఎర్లన్‌గుడుదయించెను. బాల్యమునందితడు శత్రువులచే బాధింపబడి, కొంతకాల మరణ్యావాసమొనర్చెను. క్రీ. శ. 1035 నాటి కీతడు శత్రువులనెల్ల నిర్జించి వాజాద్వీపమున కంతటికిని యేలిక యయ్యెను. ఈతని రాజ్యకాలము కడుప్రసిద్ధమైనది. ఎర్లన్‌గుని ప్రోత్సాహముచే అర్జున వివాహము, విరాటపర్వము మున్నగు గ్రంథములు పూర్వజావా భాషయగు కావీభాషలో లిఖింపబడినవి. అంతియగాక మహాభారతమును రామాయణమునుగూడదేశభాషలోనికి బరివర్తింపబడినవి. క్రీ. శ. 1042 లో నీరాజు తన రాజ్యమునంతటిని కెదిరి, జంగల యను పేరిట రెండు భాగములుగ జేసి తన యిర్వురు తనయులకునొసంగి తాను విరాగియై వనములకేగెను.

కెదిరి రాజ్యము :—ఇంతటినుండియు కెదిరి రాజ్యచరిత్ర మారంభమగును. కావీవాఙ్మయాభివృద్ధి కీరాజ్యము మూలస్తంభము. క్రీ. శ. 1104 లో వర్షజయు డిచ్చట రాజుగనుండెను. ఈతని యాశ్రితుడగు త్రిగుణుడనుకవి సుమనసనంతక, కృష్ణజనన యను రెండు కావ్యములను కావీభాషలో రచించెను. క్రీ. శ. 1120 లో కామేశ్వరుడు కెదిరికి రాజయ్యెను. ఇతని భార్య జంగలరాజ పుత్రి. ఈ రాజు కొలువు దీర్చునపుడు స్వర్ణసింహాసనమున గూర్చొను చుండెనట. ధర్మజుడను సత డాస్థాన కవిగనుండి యీ కాలమున స్మరదహనమను కావ్యమును రచించెను.

1135–55 ల నడుమ జయభయుడు కెదిరి రాజ్యమును పాలించెను. ఈతని పోషణమునందుండి పెనూలూ యను కవి భారత యుద్ధమును, హరివంశమును రచించెను. జయభయుడు జావాద్వీప వాసులచే

నవతార పురుషుడుగ బరిగణింప బడుచున్నాడు. మహాభారత యోధులలో నీతడుగూడ బేర్కొనబడియున్నాడు, భావికాలమున నాతడు తిరిగి జావా ద్వీపమున కేతెంచి ధర్మము నుద్ధరించునని యచటివారి నమ్మకము. జయ భయరాజు వైష్ణవుడు. ఈకెదిరిపాలకులు విదేశములందు సహితము తమ ప్రతిభను నెలకొల్పిరి. అరభ్ దేశీయుల వ్రాతలనుండి జావావాసులా కాలమున ఆఫ్రికాఖండమున మెడగాస్కర్ ద్వీపమున కెదురుగనున్న షోఫల దేశముతో వర్తకము నెఱపుచుండిరని తెలియుచున్నది. జావా రాజుల కొలువులో నెందరో నీగ్రోలు బానిసలుగ నుండిరి. Ferrand అను పండితుడు క్రీ. శ. 1 వ శతాబ్దముననే జావా సుమాత్రాదీవులనుండి హిందువులు మెడగాస్కర్ దీవికి వలసపోయి యటస్థిరపడిరనియు, నటుపై 10 వ శతాబ్దమున మలేరాజ్యమునుండి మఱిగొందఱు హిందువులట కేగిరనియు వ్రాసియున్నాడు. 13 వ శతాబ్దప్రారంభమున నీ కెదిరి రాజ్యము నశించినది. ఈ కాలమున కెన్అరోక్ అను నొక మహాబలశాలి బయల్వెడలెను. స్వార్థపరుడై యాతడు తన మేధాబలములను దుర్మార్గముల నుపయోగించి తానొక విశిష్టమానవుడనని తలంచుచు, శౌర్యము, హత్యా మున్నగువాని మూలమున స్వార్థము నభివృద్ధి పఱచుకొనుచుండెను. అంతట నాతని కొక బ్రాహ్మణుడు సహకారి యయ్యెను. కెదిరి రాజులకు సామంతులుగ సింగసరి రాజ్యము నేలుచుండిన రాజువద్ద నీకూరు దుద్యోగమును సంపాదించెను. అనతికాలముననే యాతడు మహా సౌందర్యవతియును, దనయేలిక భార్యయునగు డీడిస్ (Dedes) అనునామెను మోహించి, రాజును జంపి, యామెను పెండ్లాడి సింగసరి రాజ్యమును వశపఱచుకొనెను. పిమ్మట నీతడు కెదిరి, జంగల రాజ్యములను జయించెను. యింతటితో కెదిరి రాజ్యచరిత్రము ముగిసినది.

## సింగసరి రాజ్యము.

క్రీ. శ. 1220 లో పైవిధమున అరోక్ వలన సింగసరి రాజ్యము ప్రాముఖ్యతనందెను. ఈతని కాలమున జావాశిల్పములలోనెల్ల ప్రఖ్యాతి వహించిన ప్రజ్ఞాపరిమితా విగ్రహము నిర్మింపబడినది. రాణియగు డీడిస్ సౌందర్యమున కిది ప్రతి కృతియట. అరోక్ క్రీ. శ. 1227 లొ హత్య చేయబడెను. అతనికి నాల్గవతరమువాడగు కృతనగరుని రాజ్యకాలము (1268–92) మిగుల ముఖ్యమైనది. ప్రజలీ తనిని శివబుద్ధుల యవ రావతారమని కొనియాడిరి. కాని వాస్తవముగ నాతని రాజనీతి ప్రమాదక రముగ నుండెను. స్వరాజ్యమున తన యధికారమును బలపఱచుకొన కుండగనే యాతడు, బాలి, వకుళపురాది రాజ్యములకు యుద్ధయాత్రలను సాగించి, కడువ్యయప్రయాసలకు లోనయ్యెను. మహాగర్వముచే నాతడు చైనా చక్రవర్తి పంపిన రాయబారి నవమానించెను. ఈ యదనున కెదిరి రాజుల సంతతివాడును సామంతుడునగు జయకటంగ్ అను నతడు విద్రో హమొనర్చి, కృతనగరుని యల్లుడగు విజయుని నిర్జించి, రాజధానియగు సింగసరిని బ్రవేశించి, రాజునుజంపి, సింహాసనము నధిష్ఠించెను. విజ యుడు జావాకుత్తరమునగల మధురాద్వీపమునకు పాఱిపోయి, కొంతకాల మునకు బిమ్మట సింగసరికి వచ్చి జయకటంగ్‌వద్ద కొలువుండెను. అప్పటి నుండియు విజయుడు పగదీర్చుకొన నవకాశమునకై వేచియుండెను. క్రీ. శ. 1293 లో కృతనగరుని గర్వము నణంచుటకై చైనా చక్రవర్తి జావాద్వీపముపై గొంత బలమును బంపెను. విజయు డీవిదేశీయులయెడ గపటస్నేహమును జూపి, వారలను జయకటంగ్‌పై కనిపెను. యుద్ధ మున కటంగ్ మరణించెను. పిమ్మట విజయుడు చైనా సేనల నెదుర్కొని చెల్లాచెదరు గావించెను. ఇంతటితో సింగసరి రాజ్యమంత మందెను.

## బిల్వతిక్త రాజ్యము.

ఇటుల శత్రువులెల్లరను నిర్జించి విజయుడు క్రీ. శ 1294 లో 'కృతరజస జయవర్ధన,' యను బిరుదముతో వానిధివరలో నిర్మించిన బిల్వతిక్త (మజపహిత్) నగరమున సింహాసనము నధిష్ఠించెను. ఇంతటి నుండియు నీ నూతన రాజ్యచరిత్ర మారంభమగును. కృతరజసునిపుత్రుడవినీతిపరుడు. ఆతనికి బిమ్మట నాతని చెల్లెలగు త్రిభువనోత్తుంగ దేవి జయవిష్ణువర్ధని యనునామె రాజ్యమునకు వచ్చెను. ఈమె చెలియలగు రాజదేవియు మాతయగు గాయత్రి దేవియుగూడ రాజ్యసన్మానము నందుచుండిరి. విష్ణువర్ధని దేవిభర్త రాజ్యమునకంతటికిని ప్రధాన న్యాయాధిపతిగా నుండెను. రాణికి బిమ్మట గజమదుడను ప్రధానమంత్రి ముఖ్యుడుగ నుండెను. ఒక నాతీమంత్రిపుంగవుడు పశ్చిమ జావా, బాలి, బకుళపురము, సుమాత్రా, సింగపుర రాజ్యములను జయించినగాని తనయాస్తిలో నొక చిల్లిగవ్వనైనను ముట్టనని శపథ మొనర్చెను. రాణియాజ్ఞను బడసి యాతడు క్రీ. శ. 1343 నాటికి బాలిద్వీపపాలకుని జయించి, యాతని పాలనమునందుండిన జావాకు తూర్పునగల ద్వీపములను, మధుర యను దీవిని, సెలిబిస్ దీపమున గొంతభాగమును వశపరచుకొనెను. వాఙ్మయమును శిల్పమునుగూడ నారాజ్ఞి పెంపొందించెను. శాంతి సౌఖ్యము లెల్లడలను బ్రబలినవి. ఈమె సర్వవిధములను భారతదేశ రాజ్ఞీమణులగు కాకతీయరుద్రాంబ, రెజియబేగం మున్నగు వారిని జ్ఞప్తికి దెచ్చుచున్నది. క్రీ శ. 1350 లో నీమెతనయుడగు హ్యాంవురుక్ (Hyam Wuruk) ప్రాయమునందుటతోడనే రాజభారము నాతనిపైనుంచి తన యైహిక ప్రవృత్తిని జాలించెను. అంతట నీరాజపుత్త్రుడు శ్రీరాజనసగర యను బిరుదముతో మజపహిత్ లేక బిల్వతిక్త రాజ్యమును బరిపాలింప మొదలిడెను. నగరకృతాగమ, పరరటణ అను కావిగ్రంథములనుండి యాతని రాజ్యకాలచరిత్రము దెలియనగుచున్నది. ఈతడు బలపరాక్రమ

ములచే తల్లిని మరపించి, బిల్వతిక్త రాజ్యము నొక మహాసామ్రాజ్యము నొనరించెను. గజమదు డీకాలమునగూడ మంత్రిగనుండెదు. ఆకాలమున జావా, న్యూగినీదీవులును, వాని మధ్యనుండు ద్వీపములు, బోర్నియో, సెలిబెస్, బుటన్, బురు, సెరం, బంద, మొలక్క, టలట్, ద్వీపములును కెడ, కెలంగ్, సింగపూర్, పహాంగ్, కెనకాటన్ మున్నగు మలేభాగము లును, సుమాత్రాద్వీపములోని శ్రీవిజయ రాజ్యము—ఇవియన్నియు బిల్వ తిక్తపుర సామ్రాజ్యమున జేరియుండినవి. వీనిని జయించుటలో నలుడను నౌకాబలాధికారి గజమదమంత్రి కెక్కుడుగ తోడ్పడెను. ఇంతియగాక సయాంలోని అయోధ్య రాజపురి రాజ్యములును, మరుత్మ, కాంభోజ, చంప, యవన, (ఉత్తర ఆనాంలోనిది) మున్నగు రాష్ట్రములును, బిల్వతిక్త సామ్రాజ్యముతో మైత్రిని బాటించినవి. సామంతద్వీపములన్నియు నేటే టను గప్పములనుజెల్లించుచుండెడివి. వాని యోగక్షేమములనరయుటకై పురుక్ చక్రవర్తి మంత్రులు, భుజంగులు నను నుద్యోగులను నియమించు చుండెను. ఈ భుజంగులలో శైవభుజంగులు, బౌద్ధభుజంగులు నని రెండు తెగలుండెడివి. వీరు రాజకీయధర్మములను నిర్వర్తించుటయేగాక తమతమ మతములనుగూడ బ్రవర్తింపుచుండిరి. రాజాజ్ఞల నుల్లంఘించు వారిని జలధిమంత్రులు (Admirals) శిక్షించుచుండిరి. రాజబంధువులు వివిధభాగములను బ్రతినిధులుగ నేలుచుండిరి. చక్రవర్తి పట్టమహిషికి శ్రీపరమేశ్వరి యను బిరుదముండెడిది. రాజధానీనగర ముద్యానముల తోడను, కేసరీచంపకాదివృక్షములతోడను, చక్కని బజారులు, హర్మ్యములు భవనములు మున్నగు వానితోడను విరాజిల్లుచుండెడిది. అందలి ప్రాగ్భాగమున బ్రాహ్మణులును, దక్షిణమున బౌద్ధులును, పశ్చిమమున క్షత్రియులు రాజోద్యోగులు మొదలగువారును నివసించుచుండిరి. ఈ రాజ్యము నందలి ధనికులుమాత్రమే బౌద్ధమతము నవలంబించిరి. ప్రజాసామాన్యమున హిందూమతమే ప్రబలినది.

క్రీ. శ. 1389 లో వురుక్ చక్రవర్తి మరణించినపిమ్మట బిల్వాతిక్తపుర సామ్రాజ్యము క్షీణించెను. అనతికాలముననేయాతని పుత్రుడును అల్లుడును సింహాసనమునకై తగవులాడిరి. ఈ యదనున బోర్నియో, సుమాత్రా, మలక్కాన్ మున్నగుదీవులు స్వతంత్రించినవి. దీనికితోడుగ నొకపెద్ద కఱవు జావాద్వీపమునంతటిని దుడిచివేసినది. వురుక్ మనుమరాలగు సుహితాదేవికాలమున కెదిరిరాజ్యము దహాయనువాని నాయకత్వమున తిరుగబడి స్వతంత్రించెను. ఆమెకు పిమ్మట నామెతమ్ముడు కృతవిజయుడు రాజ్యమునకు వచ్చెను. ఈతడు చంపారాజపుత్రికను వివాహము చేసికొనెను. ఆమె మహమ్మదీయమతమునెడ నాదరముజూపెను. ఇంతటినుండియు నామతము జావాద్వీపమున బ్రబలి తుదకచ్చటి హిందూ రాజ్యనాశమునకు ముఖ్యకారణమునైనది. బిల్వతిక్తరాజులలో కడపటివాడను నైనవవిజయునికాలమునమహమ్మదీయులుస్వామిద్రోహులైతమకుపకారమొనర్చినరాజును తుదముట్టించిరి. అవసానకాలమునం దీరాజుదేశాంతరములనుండి మఱియొకజాతివా రేతెంచితురుష్కులపై పగదీర్చుకొందురని శపించెను. వచ్చివారు దాని కనుగుణ్యముగనీదీవులలో మహమ్మదీయులను హతమార్చిరి. ఇంతటితో హిందూజావాచరిత్రమును, బిల్వతిక్తపుర సామ్రాజ్యచరిత్రమును ముగిసినవి.

# భారతీయ నాగరికతా విస్తరణము.

## XII యవద్వీపకళ.

భారతదేశమునుండి ప్రాచీనభారతీయులు భారతీయనాగరికతాధినివేశములను దేశాంతరములకు గొనిపోయి వానినట బాదుకొల్పిరి. ఈనూతన భావములును సంస్థలును స్థానికములగువానితో గలసి యీదేశాంతరములలో విలక్షణమగు నాగరీకతవర్థిల్లినది. భారతభూమిలో గనియెరుంగని పరిణామమును భారతీయావర్షము లీ దూరదేశములలో గాంచినవి. ఇందులకు శిల్పకళ ప్రబలమగు నుదాహరణము. అందునను యవద్వీపమునం దీకళ నిరుపమమగు రీతి నభివృద్ధినందినది. కావనీయవద్వీపకళను బరీక్షించినచో ప్రాచీనకాలమునం దొకసువిశాలమగు నైతికసామ్రాజ్యమునకు నాయికయై భారతదేశ మెట్టియున్న తాదర్శములను ప్రపంచమున కొసంగెనో దెలియు చున్నది. ఇటుపై యవద్వీపమునందలి కట్టడములును వాని ప్రాశస్త్యమును సంగ్రహముగ వర్ణింపబడుచున్నవి.

యవద్వీమున చారిత్రశిథిలము లెన్నియో గలవు. వీనినన్నిటిని నేటి ప్రభుత్వములు జాగరూకతతో సంరక్షించుచున్నవి. ఈ శిథిలములకు హిందూదేశమునందలి తాత్కాలిక నిర్మాణములకును సన్నిహితమగు సంబంధము గలదు. యవద్వీపశిథిలములలో నారిటినిమాత్రము బరిశీలించినచో తత్సాధిక్యత యవగతము కాగలదు.

## బొరొబుదుర్ దేవాలయము.

ఈ యాలయము యవద్వీపశిల్పములలో నెల్ల నగ్రగణ్యము. వర్ణనాతీతమగు నీ కట్టడము చూపరులను విస్మయావిష్టుల నొనర్చుచున్నది అలంకారములతోడను విగ్రహములతోడను నిండి యెన్నియో యంతరువులు గల యీ నిర్మాణము వివిధదేశములందలి కళాభిమానుల నాకర్షించుచున్నది.

ఇచ్చటి శిల్పియొక్క నైపుణ్యము స్థలనిర్దేశముననే గనవచ్చుచున్నది. జావాలో "కెడు" అను నొక మైదానము గలదు, ఇయ్యది సస్యశ్యామలమై మనోహరముగ నుండును. ఇందసంఖ్యాకములగు చిన్న చిన్నకట్టడములు గలవు. యీ మైదానమునకు చుట్టును పర్వతములున్నవి. మధ్య నొక కొండగలదు. దానిపైనుండి నలుదిశలను బరికించినచో నొకవంక పచ్చని పైరులును, మఱియొకవంక సాయంసమయమున నీలమేఘములలో విలీనమగు కొండలును, మఱియొకచో ధూమమును విరజిమ్ము నగ్నిపర్వతములును గనుపింపగలవు.

ఇట్టియాలయము దేశాంతరములలోనేగాక భారత దేశమునందుగూడ లేదు. ఇందొక నూతన నిర్మాణపద్ధతి యవలంబింపబడినది. మొదట నొకకొండను యెత్తుపల్లములులేక సమముగా చెక్కిరి. దీనిపై చదునైన రాతిపలకల నతికి యటుపై కట్టడములను నిర్మించిరి. యీ కొండపైన మధ్యగా నొకస్థూప మున్నది. దీనిచుట్టు నొకదానిలోనొకటిగ మూడువలయములున్నవి. వీనిలో డెబ్బది రెండు చిన్న స్థూపములు గలవు. యీత్రికోణాకృతిగల కొండకు మూడు వైపులను మూడు ద్వారములున్నవి. వీనిద్వారా నొకదానిపై నొకటిగానున్న స్థూపవలయములకు బోవుటకు మెట్లవరుసలున్నవి. బొరొబుదుర్ ఆలయమునం దేకాంతస్థలములు గలవు.

భూమట్టమునుండి పైయంతస్థువరకును, చుట్టునుగూడ నిరుపమములగు శిల్పము లున్నవి. యీ విధమున మూడుమైళ్ళ చుట్టుకొలతగల యీ యాలయమున బౌద్ధులచరిత్రము, గాథలు, తత్త్వమును చిత్రింపబడినవి. పైపేర్కొనినటుల నీస్థూపవలయములలో నొక్కొకటి యొక్కొక ప్రదక్షిణ మార్గము. యీ మార్గముల బ్రదక్షిణమొనర్చు భక్తులు గోడలపైనను స్థూపములపైనను లలితవిస్తారము, దివ్యావదానము, జాతకమాల, చండ వ్యూహము మున్నగు బౌద్ధ గ్రంథముల ననుసరించి చిత్రింపబడిన బుద్ధుని జీవితమునుగాంచి తన్మయులగు చుండిరి. ఇట్టులే బోధిసత్వుల చరిత్రము కూడ చిత్రింపబడినది, యీ విధముగ నిచ్చటి గోడలలో నేర్పరుపబడిన శిల్పఫలకములసంఖ్య 1300. ఇవిగాక నీ యాలయపుక్రింది భాగమున మఱి 160 ఫలకములు గలవు.

యీ బొరొబుదుర్ ఆలయమున నిలచిచూచినచో మినొరెయను పర్వతముయొక్క శిఖరము గన్పించును. ఇది యొక మనుష్యుని ముఖ మువలె నున్నది. యవద్వీపవాసు లీశిఖరము బొరొబుదుర్ ఆలయమును నిర్మించిన గుణధర్ముని ముఖమని చెప్పుదురు.

యీ యాలయరాజ మెపుడు నిర్మింపబడెనను విషయమున దెల్పు శాసనము లింతవరకును దొరకయుండలేదు. శాసనాధారముపై కాలనిర్ణయ మొనర్పనగు నితర కట్టడములను బొరొబుదుర్ ఆలయమును సరిపోల్చి చూచి కళాపద్ధతి నాధారముగ గొని క్రోమ్ అను పండితు డీయాలయము క్రీ. శ. 8 వ శతాబ్ది యుత్తరార్థమున నిర్మింప బడియుండునని వ్రాసి యున్నాడు.

బొరొబుదుర్ ఆలయముయొక్క స్వభావమేమి? ఏ మహాత్ముని యస్థికలపై నైనను దీనిని నిర్మించిరా? లేక నేదోనొక మహాకార్యమును సూచించుటకై దీనిని గల్పించిరా? ఇది స్థూపమా, చైత్యమా, విహారమా?

యను సమస్యలకు సరియగు సమాధానముల నొసంగవలనుపడదు. పైకట్టడముల లక్షణము లన్నియు నిందుగలవు. యీ యాలయ మనిర్వాచ్యమును, వర్ణనాతీతమునగు నొక శిల్పవినోదము. ఇందు శిల్ప కేవలమును మత్తావేశ పూరితుడై తన యావేశమునంతటిని వ్యంగ్యమును, విస్మయకరమునగు శిల్పముగ బరిణమింపజేసెను. ఇందు కృత్రిమత్వ మిసుమంతములేదు. అయినను కళానైపుణ్యమున కేమియు కొదవలేదు. నిశ్చలమును, గంభీరమునగు నిచటికళ ప్రేక్షకులకు నూతనమగు భావప్రబోధమును గల్గించుచున్నది. సుప్రసిద్ధ కళాభిజ్ఞుడగు హావెల్ (Havell) పండితుడు గ్రీసుదేశ శిల్పశిఖామణియగు 'పార్థినన్, శిల్పమున కీయాలయ మిసుమంతయు దీసిపోదని వ్రాసియున్నాడు.

## తారా దేవాలయము.

దీనికి 'చండీకలస్సన్, అనిపేరు. ఈ యాలయము గూడ క్రీ. శ. 8 వ శతాబ్దముననే మహాయాన బౌద్ధమత మీద్వీపమునం దుచ్చదశలోనుండినపుడు నిర్మింపబడినది. ఇచ్చటి యొక శాసనమునుండి క్రీ. శ. 778 లో సుమాత్రా దీవినుండి విశాలరాజ్యము నేలిన శైలేంద్రవంశీయుడగు నొకరాజు తారా యను బౌద్ధదేవీవిగ్రహము నిచటియాలయమున బ్రతిష్ఠించెనని తెలియుచున్నది. ఈయాలయశిల్పము బొరొబుదుర్ శిల్పము ననుసరించుచున్నది.

## చం డీ సే వూ.

యవద్వీపమునందు బౌద్ధమతము క్రీ. శ 8, 9 శతాబ్దములలో ప్రబలముగ నుండినను, హిందూమతముగూడ వర్ధిల్లుచుండెను. చండీసేవూయనగా వేయిగుడులని యర్థము. ఇవియన్నియు శిథిలావస్థలో నున్నవి. బొరొబుదుర్‌కు సమీపమున 'చండీబనన్, యను శివాలయము గలదు. ఇందు శివ, విష్ణు, బ్రహ్మ, అగస్త్య విగ్రహములున్నవి. వీనికిని

పాశ్చాత్యలిక భారతదేశ శిల్పములకును సన్నిహితమగు సంబంధముగలదు. ఇచటివేయగు నొక దర్గానుండి యుద్ధరింపబడిన శివుని శిరస్సు యీ కాలమున చోళరాజుల పాలనమునందుండిన దక్షిణ హిందూదేశమున నిర్మింపబడిన విగ్రహభాగమును పోలియున్నది.

## డీ-యింగ్ పీటభూమి (Di-ing Plateau)

యవద్వీపమున డీ-ఇంగ్ అను నొక నిర్జనమగు పీటభూమిగలదు. ఇది సముద్రమట్టమునకు 6500 అడుగులయెత్తున నున్నది. ఇందు జీర్ణావస్థనున్న యాలయము లయిదుగలవు. వీనికి మహాభారత వీరులగు పాండవుల పేరిట చండీపుత్రదేవ (యుధిష్ఠిర) చండీ భీమ, చండీ అర్జున చండీ శ్రీఖండీ, చండీ సేనుభద్ర యని నామములున్నవి. ఇయ్యవి నగరములకును గ్రామములకును సమీపమునగాక నిర్జన స్థలమునందుండుటచే యాత్రాస్థలములని దోచుచున్నది. జైను లిట్టిపద్ధతి నవలంబించిరి ఇయ్యవి బొరొబుదుర్‌వలె మనోహరములు గాకున్నను, హిందూదేవతల యారాధనకై, హిందూపద్ధతుల ననుసరించి నిర్మింపబడి యుండుటచే మనకు ముఖ్యములు. ఇందలి శిల్పము నిరాడంబరము. ఇచ్చటి త్రిమూర్తుల విగ్రహములు రేఖశిల్పమునకు చక్కనిదృష్టాంతములు. ఈ యాలయములు క్రీ. శ. 9 వ శతాబ్దారంభమునాటివి. ఇయ్యవి దక్షిణ హిందూదేశములోని యాలయములను పోలియున్నవి. కొందరు పండితులు పట్టడకల్, ఐహొాల్, బేలూరు, హళేబీడు మున్నగు స్థలములందలి చాళుక్య కట్టడముల నీ యవద్వీపాలయము లనుకరించుచున్నవని దలచుచున్నారు. మఱికొందరు దక్షిణహిందూదేశమునందలి పల్లవచోళ దేవాలయములకు నీ పీటభూమియందలి యాలయములకును సామ్యమున్నదని చెప్పుచున్నారు.

## పనటరణ దేవాలయము.

యవద్వీపమధ్యభాగమున సింగసరి మున్నగురాజ్యములు ప్రబలి నపుడు బౌద్ధమత ముచ్ఛదశనందినది. పిమ్మట దూర్పుజావాలో విల్వ త్రిక్తపుర సామ్రాజ్యము నిర్మింపబడిన తోడనే శైవమతప్రాబల్య మారంభ మయ్యెను. మొత్తము మీద నీద్వీపమునందలి నిర్మాణకళలో నీరెండు మతముల ప్రభావమును గాంచనగుచున్నది. విల్వతిక్తరాజులు నిర్మిం చిన కట్టడములలో బ్లిటర్ నగరమునకు సమీపమునందున్న పనటరణ దేవాలయ మగ్రగణ్యము. ఇట నొక ప్రధానాలయమును, గొన్ని చిన్న దేవళములును గలవు. ఇదియొక శివాలయము. ఇందలి గోడల క్రింద భాగమున రామాయణ మహాభారతములలోని భాగములు చెక్కబడియున్నవి. ఈ శివాలయములో నీ వైష్ణవశిల్పము లుండుటనుబట్టి యీ దేశమునందుం డెడి మతసహిష్ణుత వ్యక్తమగుచున్నవి.

## చండి మెండట్ (Chandi-Mendut)

ఈ బౌద్ధాలయము బొరొబుదుర్‌కు మైలున్నర దూరములో నున్నది. ఇందు మూడంతరువులున్నవి. అడుగు దానిలో నిరువది నాలుగును, రెండవదానిలో పదునారును, మూడవదానిలో నెనిమిదిని చిన్న స్థూపములును, మూడవ యంతరువు మధ్యగా నొక పెద్ద స్థూపము నిట గలవు. ఇందలి గోడలపైనను, ద్వారములపైనను హిందూదేవతలవిగ్రహము లున్నవి. ఆలయమునందలి ప్రధాన విగ్రహము బుద్ధునిది. మరిరెండు బోధిసత్త్వుల విగ్రహములుగూడ నిటగలవు. ఈమూడు విగ్రహములును బౌద్ధశిల్పమునం దగ్రగణ్యములనియు, నియ్యవి హిందూదేశములోనిగుప్త శిల్పముల కెనయగుచున్నవనియు ఫెర్గుసన్ పండితుని యభిప్రాయము ఈ బౌద్ధాలయములోని శిల్పకళ బొరొబుదుర్‌కంటె యభివృద్ధిని జూపు చున్నది.

ప్రాంబనన్ ఆలయము.

ఈ యాలయముగూడ జావాద్వీప శిల్పుల కళానైపుణ్యమును జాటుచున్నది. భారతదేశముననేగాక భారతీయ నాగరికత విస్తరించిన దేశములన్నిటియందునుగూడ వాల్మీకి రచించిన రామాయణము విశేషముగ బ్రేమింపబడి గౌరవింపబడినది. సయాంభాషలో 'రామకియన్', అనియు, మలేభాషలో 'హికాయత్ సెరిరామ', యనియు నీ గ్రంథము గాంచనగు చున్నది. యవద్వీపమునం దియ్యది విశేష వ్యాప్తి నందెను. దీనికి 1200 భాషాంతరీకరణములు ప్రాచీన జావాభాషలో గలవు. అంతియగాక పనటరన్, ప్రాంబనన్ దేవాలయములలో నీ కథయంతయు శిల్పమున జిత్రింపబడినది. పనటరన్ శిల్పములలో నీ చరిత్రము శ్రీ రామచంద్రుడు లంకాద్వీపమున కేగునప్పటినుండి ప్రారంభమగు చున్నది.

సుకు దేవాలయములు.

యవద్వీపములో మధ్యభాగమున లోవిన్ (Lowes) పర్వతములకు సమీపమున నీ దేవాలయము గలదు. యవద్వీపకళాచరిత్రమున కియ్యది మిగుల ముఖ్యమైనది. ఇందలిభాగములు క్రీ. శ 1435–1440 ల నడుమ అనగా బిల్వతిక్తపుర సామ్రాజ్యమును, హిందూమతమును గూడ నీ ద్వీపమునం దంతరించుటకు గొంచెము ముందుగా నిర్మింపబడినవి. ఇందలికళ క్షీణావస్థను సూచించుచున్నది. ఇయ్యది వైష్ణవాలయము. ఇందు మూడంతస్తులున్న, వానిపై నొక గోపురమును గలవు ఈ కట్టడము మధ్య అమెరికాలోని యుకటన్, మెక్సికో అను స్థలముల నున్న కట్టడములను బోలియున్నది. ఇందుమూలమున యవద్వీపవాను లమెరికాకేగిరా? లేక నమెరికనులే యీ ద్వీపమున కేతెంచిరా? యను సమస్యలు బయల్వెడలు చున్నవి. బహుశః యీ రెండు స్థలములందును గూడ నొకేజాతివారలు నివసించి యొకేజాతి కట్టడములను నిర్మించి యుందురు. శ్రీ [illegible] దేవరాయ ఆంధ్ర భాషానిలయము